
'౮౮ ఏప్రిల్
జ్యోతి
75 పైసలు

విజయవంతముగా నడుస్తున్నది



డ్రింకోటేబ్

ఇన్‌స్టంట్ డ్రింక్



జాయిసన్ వారి
మధురానందమునిచ్చు
సాటిలేని పానీయము

క్షణంలో మీకు మీరే
చేసుకోవచ్చును

మంచినీటి గ్లాసులో
ఒక డ్రింకోటేబ్ (బిళ్ళ)
వేయండి. క్షణంలో
మధురమ్మైన
ఫలపానీయం
తయారవుతుంది-

DRINK-O-TAB
DROP AND DRINK

డ్రింకోటేబ్ ఆక్షేపణలేని ఆధునిక
పానీయములు. అతిథులు వచ్చినప్పుడనండి,
మీ ఆనందానికేనండి — అన్నివేళలా
ఆదుకుంటుంది- ఎల్లప్పుడూ ఇంట్లో వుంచుకోండి

డ్రింకోటేబ్ లెమన్ - డ్రింకోటేబ్ ఆరెంజ్
డ్రింకోటేబ్ వనిల్లా- డ్రింకోటేబ్ పైనాపిల్
డ్రింకోటేబ్ రాస్‌బెర్రి

వ్యాపారవివరములకు
జాయిసన్ ఎంటర్‌ప్రైజెస్ పోస్టుబాక్స్ 51 గుంటూరు-1.

HYFLYTE/JE/66 TEL



తొలిమాట

'సిక్స్త్ సెన్స్'—దాన్ని అరవ జ్ఞానేంద్రియమే అంటారో, అతీంద్రియ శక్తి అంటారో మీ యిష్టం—కొందరికి వుంటుంది. అని ఆ కొందరు గాఢంగా విశ్వసిస్తారు. ఏటొచ్చీ, అది సాధారణంగా తప్పులో కాలేస్తూ వుంటుంది. బీనాదేవిగారు సరదాగా, అవలీలగా ఈ సత్యాన్ని కథించారు. (89 వ పేజీ)

• • •

నిజం సూర్యుడి లాంటిది. దాన్ని అనుమానమనే మబ్బు కమ్మివేస్తుంది. ఫలితంగా కన్నీళ్ళ జడివాన. ఈ వాన వెలిసి, మబ్బు తొలగి, నిజం తెలిసే వరకు మనిషి మనిషిగా వుండడు. అందుకే 'వాన వెలిసింది' అనే కథకు నిజం తెలిసింది అనే పేరు కూడా సరిపోతుంది. (33 వ పేజీ)

• • •

ఆశయాలు అందరికీ వుంటాయి. అవకాశాలు మటుకు కొందరికే వస్తాయి. అందుకే లోకంలో ఇంత నిరాశ, ఇంత విషాదం. (61 వ పేజీ)

జ్యోతి మేనేజింగ్ ఎడిటర్.

జ్యోతి

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట పోస్టు
విజయవాడ—2.

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
ఏప్రిల్ 1966
సంచిక 4

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్
బాపు

సంపాదకవర్గం
నండూరి
రామమోహనరావు
ముళ్ళపూడి
వెంకటరమణ
వి. ఎ. కె. రంగారావు
రావికొండలరావు

ముఖచిత్రం :
వి. ఏ. వి. వారి
'నవరాత్రి'లో దృశ్యాలు



ఉత్తరాలు

విజ్ఞానపత్రిక మాస మాసానికి క్రొంగ్రొత్త వెలుగులు చిలుకుతూ, మంచి కథలను, చిత్ర పరిశ్రమ హెచ్చు తగ్గులను, రాజకీయాలను, ఆనందోత్సాహభరితాలైన ఫిట్టులను ఇంకా ఎన్నో విషయాలను మోసుకొని విజయవాడనుండి ఈపాకిస్తాన్ సరిహద్దు ప్రాంతానికి వస్తూంది. కళాశాలల, పాఠశాలల, విద్యార్థి విద్యార్థినులకు, వారు వ్రాసిన కథలను ఎన్నుకొని వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను పక్షపాతం లేకుండా ఇస్తూ వారిని ప్రోత్సాహపరుస్తున్నారనుట సత్యదూరంగాదు. ప్రత్యేకించి మార్చినెల 'జ్యోతి'లో 'మెంటాలిటీల'తో చివర్న మీ మెంటాలిటీని కూడా కలిపి పాఠకులకు ఎంకరేజ్‌మెంట్ యిస్తూ మీ బిజినెస్ మెంటాలిటీని తెలియబరచారు. ముస్ముందుకూడా ఇలాగే మీ జ్యోతి మా హృదయాలను రంజింపజేయగలదని, అందుకు తగు కృషి మీరు చేయగలరని ఆశిస్తూ ఉత్తరాన్ని ముగిస్తున్నాము.

టి. బలరామరెడ్డి, సి. శేషు,
(నెం. 4 స్క్వాడ్రన్,ఎయిర్‌ఫోర్స్)

మార్చి జ్యోతిలో సోదరులు శ్రీ ఎన్. రామకృష్ణారావు గారు చాలా తొందరపాటు విమర్శ చేశారు. రచన పూర్తిగా చదవకుండా ఒక అభిప్రాయానికివచ్చి విమర్శకి దిగటం మొదటి పొరబాటు. విమర్శించేప్పుడు అవసరంలేని విషయాలు తడమటం రెండో పొరబాటు.

రచన ఏ వుద్దేశ్యంతో రాయబడిందో - మొత్తంగా అందులో ఏ సందేశం యివ్వబడిందో - పూర్తి రచన చదవకుండా ఆయనకి ఎలా తెలుస్తుంది? 'చదువుకున్న కమల'లో ఎంతసేపూ అత్తా కోడళ్ళ దెబ్బలాటలే వున్నాయని (నిత్య జీవితంలో డబుల్ సిల్లీగా వున్నాసరే) ఆయన ఏ దూరదృష్టితో ఊహించగల్గారు? 'తక్కిన నవలలలాగే యిందులో కూడా ...' అంటూ ప్రస్తావించారు. తక్కిన నవలల ప్రసక్తి ఇక్కడెందుకు? తిళ్ళు తింటూ ఎడమచేత్తో వడ్డించుకునే వాళ్ళూ - యువదంపతుల పక్కల మీద పడుకునే పెద్దవాళ్ళూ ఆయన దృష్టికి రాకపోవచ్చు. అది అవునో కాదో కొన్ని కుటుంబాలను పరిశీలించి తెలుసుకోవాలిగానీ - అది నిజమేకాదంటే విమర్శ అవుతుందా? ఈ నవలలో చర్చించిన విషయాలు సంఘ సమస్యలు కావనే ఆయన అభిప్రాయమా?

'నాలుగు సినిమాలుచూసి ఓ నవల రాయగలిగితే మన ప్రేక్షకులంతా మహా మహా రచయితలై వుండేవాళ్ళు.' ఇదేనా విమర్శించాల్సిన తీరు? రచయితకి పాఠకుడికి ఆత్మీయతతో కూడిన అవినాభావ సంబంధం వుండాలిగానీ వ్యంగ్యాలకూ-వెటకారాలకూ అవసరం లేదే!

సద్విమర్శకుడు ఎప్పుడూ రచయితకు మార్గదర్శకుడు. సద్విమర్శ నుంచే రచన అభివృద్ధి సాధిస్తుంది, ప్రయోజనాత్మకమైన రచనలు చేయాల్సిన బాధ్యత రచయితకు వున్నట్టే - అసభ్యతకూ అపహాస్యాలకూ తావులేని సద్విమర్శ హృదయపూర్వకంగా చెయ్యాల్సిన బాధ్యత విమర్శకుడికి వుంది.

రచయితలు శారీరకంగా - మానసికంగా కృషిచేసి రచనలు చేస్తారు. కనీసం వాటిని పూర్తిగా చదివి విమర్శకు దిగాలన్న పద్ధతిని కూడా పాటించక పోవటం చాలా విచారకరం.

ముప్పాళ రంగనాయకమ్మ,

విశాఖపట్నం.

ఈ నెల 'జ్యోతి'లోని మెంటాలిటీలు చాల బాగున్నాయి. కాని డాక్టర్ల గురించి వేసిన కార్టూను సరిగ్గా లేదనిపించింది. ఈ రోజుల్లో ప్రైవేటు కన్సల్టేషన్ ఫీజు ఇస్తే ఏ డిపార్టుమెంటు డాక్టరైనా ఎగ్జామిన్ చేయడానికి తయారే.

యద్దనపూడి సులోచనారాణిగారి సీరియల్ సస్పెన్సుతో సాగుతోంది. ముప్పాళ్ళ రంగనాయకమ్మగారి సీరియల్ పై పాఠకుడు చేసిన విమర్శ సమంజసంగా లేదు,

జె. జానకి, సరోజ, నల్లగొండ

ముప్పాళ రంగనాయకమ్మగారి నవల 'చదువుకున్న కమల' చాలా వాస్తవికంగా ఉంటోంది. కాని ఈ కాలంలో శేషమ్మ వంటి అత్తగార్లున్నా రంటే నమ్మొచ్చుగాని మధుమూర్తిలాంటి భర్తలుంటారా! సందేహమేమరి! జ్యోతిలో కార్టూన్లు చాలా బాగా వేస్తున్నారు. గిరీశంగారి లెక్చర్లు నవ్విస్తున్నాయి. బి. వి. రమణరావుగారి 'సంధ్యావందన మహాత్మ్యం' చదువుతున్నకొద్దీ చాలా బావుంది.

ఆర్. కామేశ్వరి, నైవేలి.

ఫిబ్రవరి 'జ్యోతి'లో ప్రచురింపబడ్డ నా 'విశాల' గురించి మార్చి సంచికలో శ్రీ యమ్. యన్. మూర్తి (అహమ్మదాబాదు) గారు నిశితంగా విమర్శించడం గమనించాను అలనాడెప్పుడో ఆరేడేళ్ళ క్రితం కొందముదివారో, వాకాటివారో చెప్పిన 'సైకాలజీ' కథకు 'విశాల' నకలు అని శ్రీ మూర్తి గట్టిగా చెప్పారు. నయం! ఆ సైకాలజీ మరిపద్దెనిమిదో శతాబ్దంలోనిదో ఏమో తెలియదు. కథేతి వృత్తాలు మరీ కరవైపోలేదు, అంతేగాక — చిత్తశుద్ధి లేనివాడు, ఇతరుల నుండి దొంగలించిన ఇతివృత్తం అంతంత మాత్రంగానే అవుపిస్తుంది. రచయితల చిత్తశుద్ధిని శంకించడం సముచితం కానేరదని మనవి.

వై. శేషతల్పశాయి, హైదరాబాదు.

రాజకీయాలు

మార్చి నెలలో రాజకీయాల కంటె అరాజకీయాలే ప్రాముఖ్యం వహించాయి. క్రమశిక్షణ, ప్రజాస్వామిక ప్రవర్తన భారతీయులకు ఇంకా అలవాటు కాని విషయాలని మార్చి నెల సంఘటనలు నిరూపించాయి.

బియ్యం రేషన్ సమస్యపై కేరళలో జరిగిన అల్లర్లను మించి పశ్చిమ బెంగాల్‌లో పెద్ద పెట్టున అలజడి వాన కురిసింది. పశ్చిమ బెంగాల్ కూడా కొరత రాష్ట్రాలలో ఒకటైనప్పటికి, కేరళలో ఉత్పన్నమైనంత తీవ్ర పరిస్థితి అక్కడ లేదు. ధాన్య సేకరణ సరిగా జరగకపోవడం, కొన్ని కొరత ప్రాంతాలకు సకాలంలో చాలినంతగా సరఫరా చెయ్యలేక పోవడంతో అక్కడ ప్రజలలో అసంతృప్తి ప్రబలమైన మాట నిజం. ఈ అసంతృప్తిని తొలగించడానికి ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోని మాట నిజం. అయితే, పరిస్థితి తీవ్రతను మించిన యెత్తున ప్రతిపక్షాలు ఆందోళన సాగించాయి. వామపక్షాలన్నీ కలిసి ఐక్య సంఘటనగా ఏర్పడి అరాజకాన్ని ప్రోత్సహించాయి. బహుశా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో ఏ మూల కని విని ఎరుగనంత తీవ్ర పరిస్థితిని అవి కల్పించాయి. వామపక్షాల బలం అధికంగా వున్న జిల్లాలలో రైళ్ళ రాకపోకలను ఆపివేయడం, బస్సులను తగుల పెట్టడం, ప్రభుత్వ కార్యాలయాలను, ఇతర ఆస్తులను ధ్వంసం చేయడం ఒక పథకం ప్రకారం జరిగి పోయింది. పోలీసు బలగం చాలక సైన్యాన్ని కూడా శాంతి భద్రతల రక్షణకోసం పిలిపించ వలసి వచ్చింది. ఆందోళనకారులకు, పోలీసులకు జరిగిన ఘర్షణలో కొందరు నిహతు లయ్యారు; ఎందరు గాయపడ్డారో లెక్క లేదు.

వామపక్షాల కోర్కెలను ప్రభుత్వం అంగీకరించినప్పటికి, ఆహార పరిస్థితి కొంత మెరుగైనప్పటికి, అల్లర్లు చాలవరకు తగ్గిపోయినప్పటికి, పూర్తిగా ప్రశాంతి ఏర్పడిందనడానికి వీలులేదు. వామపక్షాలు ప్రభుత్వం చర్యలతో సంతృప్తిపడలేదు. ప్రభుత్వాన్ని ఇంకోక పూపు పూపి చూడ్డానికే నిశ్చయించుకున్నాయి.

ఈ సంఘటనలపట్ల దేశంలో బాధ్యతాయుతులు, ఆలోచనాపరులైన వారందరు ఆందోళన పడ్డారు. మనలో మానవత్వానికి ఈ సంఘటనలు ఒక సవాల్‌గా రాష్ట్రపతి రాధాకృష్ణన్, మన దేశానికి అవి

తలవంపులు తెస్తున్నాయని ప్రధాని ఇందిరాగాంధి ఆవేదన వెలిబుచ్చారు. ప్రతిపక్షాల నాయకులు కూడా కొందరు ఈ దుస్సంఘటనలపట్ల ఆందోళన వెల్లడించినా, అతివాద పక్షాలు మాత్రం నిర్మొగమాటంగా ఖండించలేదు.

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ప్రజల అసంతృప్తిని తమ పార్టీ ప్రయోజనాలకోసం వినియోగించుకోవాలని వామపక్షాలు ఈ అల్లర్లను రెచ్చగొట్టాయనడంలో సందేహం లేదు.

పంజాబీ సుబా

బెంగాల్ అల్లర్లు కొంత సద్దుమణిగాయో లేదో పంజాబ్‌లో ప్రారంభమైనాయి. చాలకాలంగా జరుగుతున్న శిక్కుల ప్రత్యేక రాష్ట్రాందోళన అకాలీ నాయకుడు సంత్ ఫతేసింగ్ ఆత్మాహుతి నిర్ణయాన్ని ప్రకటించడంతో తీవ్రరూపం ధరించింది. పంజాబీ సుబా నిర్మాణాన్ని ఇంతకాలంగా ప్రతిఘటిస్తూ వచ్చిన కాంగ్రెసు ఒక్కసారిగా అందుకు తన అనుకూల్యాన్ని ప్రకటించడంతో, దాన్ని వ్యతిరేకిస్తున్న మతరాజకీయవాదులు పంజాబ్‌లో అల్లర్లను రెచ్చగొట్టారు.

పంజాబ్ సుమారు తొమ్మిదేళ్ళుగా ద్విభాషా రాష్ట్రంగా వుంటున్నది. పంజాబీ, హిందీ భాషా ప్రాంతాలలో ఆయాభాషలు అధికార భాషలుగా చెలామణి అవుతున్నాయి. కాని, ఈ పద్ధతి సరిగా పనిచేయలేకపోవడం, తమకు అన్యాయం జరుగుతున్నదని పంజాబ్ భాషావాదులు భావించడంతో, తమకు వేరే రాష్ట్రం ఏర్పడాల్సిందేనని ఆందోళన చేస్తూ వచ్చారు.

శిక్కులలో అతివాదులైన కొందరు ప్రత్యేకంగా శిక్కురాజ్యం ఏర్పడాలని కూడా ఉద్యమం లేవదీశారు. అయితే తమ ప్రాతిపదికపై ఈ విభజన తగదనే వర్గానికే సంఖ్యాబలం లభించింది. వీరు సంత్ ఫతేసింగ్ నాయకత్వాన పంజాబ్‌ను భాషా ప్రయుక్తంగా పునర్విభజించాలని పట్టుపట్టారు. పంజాబ్ స్వాతంత్ర్యసిద్ధి సమయంలో ఇదివరకే ఒకసారి విభజించడం జరిగింది. మరొకసారి విభజించడం సరిహద్దులలో వున్న ఈ రాష్ట్రం శ్రేయస్సుకు దోహదకరం కాదని కాంగ్రెసు భావించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే అభిప్రాయంతో పంజాబీసుబాను వ్యతిరేకించింది.

కాని, భాషా ప్రయుక్త విభజనలో తప్పేమీ లేదు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలు భాషా ప్రయుక్తంగానే ఏర్పడిపోయాయి. ప్రతిభాషకు ఒక రాష్ట్రం వున్నది. అయినప్పుడు పంజాబీ సుబాను వ్యతిరేకించవలసిన అవసరంలేదు. పంజాబీ, హిందీ భాషలవారు కలిసి



పారిస్‌లో ప్రధాని ఇందిరాగాంధి ఫ్రెంచి ప్రెసిడెంట్ డిగోల్‌ను, ఆయన సతీమణిని కలుసుకున్నప్పటి ఫొటో

మెలిసి వుండగలిగితే మంచిదే. కాని అది సాధ్యం కానప్పుడు, వేరుచేయడమే ఉత్తమం. బలవంతాన కలిపివుంచడంవల్ల సరిహద్దు రాష్ట్రమైన పంజాబ్‌లో సమైక్యం భగ్నం కావడమేకాక, మత ప్రాతిపదికపై విభజన కోరుతున్న తారాసింగ్ వర్గానికి బలం చేకూరవచ్చు. ఇవన్నీ అలా వుంచి, తక్షణమే ఈ నిర్ణయం తీసుకోవడానికి కాంగ్రెసును ప్రేరేపించింది ఫతేసింగ్ ఆత్మాహుతి నిర్ణయం. ఈ దుస్సంఘటనే జరిగితే అది ఎన్ని విపత్తులకు దారి తీస్తుందో ఎవరూ చెప్పలేరు.

ఈ విషయాలన్నీ ఆలోచించి కాంగ్రెసు కార్యవర్గం పంజాబును విభజించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అయితే, ఈ నిర్ణయాన్ని హఠాత్తుగా దేశంమీదికి విసిరినట్టయింది. ఇందుకు దేశం, ముఖ్యంగా పంజాబులోని హిందువులు సిద్ధంగా లేరు. దానితో ఒక్కసారిగా పంజాబులో కల్లోలం ప్రారంభమైంది. కాంగ్రెసు నిర్ణయాన్ని జనసంఘ్ వ్యతిరేకించింది. చాలా జననష్టం, ఆస్తి నష్టం జరిగిపోయింది.

చివరికి ఈ సమస్య ఎలాగో

పరిష్కారమైందనే చెప్పవచ్చు. పార్లమెంటు స్పీకర్ హుకుంసింగ్ అధ్యక్షతన నియమించిన కమిటీ కూడా పంజాబును భాషా ప్రయుక్తంగా విభజించాలని సిఫారసు చేసింది. చివరకు కేంద్ర ప్రభుత్వం ఈ సిఫారసును ఆమోదిస్తూ నిర్ణయం ప్రకటించింది. పంజాబు హిందూ నాయకులతో సంప్రతింపులు జరిపి పంజాబీ రాష్ట్రంలో మైనారిటీ వర్గాలకు కొన్ని రక్షణలు కల్పించడానికి అంగీకరించింది. ఇది జనసంఘ్ నాయకులకు సంతృప్తి కలిగించడంలో ఉద్దేశాలు చల్లబడ్డాయి. అటు అకాలీలకు, ఇటు హిందీ భాష వారికి కూడా ఆమోద యోగ్యంగా పంజాబ్ విభజన జరగడం ఖాయమైపోయింది.

మిజోల తిరుగుబాటు

విభజనవాదం అనేక ప్రాంతాలలో అనేక రూపాలలో తలెత్తుతూ మన జాతీయ సమైక్యం ఇంకా సుస్థిరమైన పునాదులపై బలపడలేదని రుజువు చేస్తున్నది. ఆహార సమస్యను పురస్కరించుకుని, తమకేదో అన్యాయం జరుగుతున్నదనే వాదంతో కేరళ వంటి రాష్ట్రంలో కూడా విభజనవాదం వినిపించినప్పుడు మారుమూల అస్సాంలో, మిజో జిల్లాలోని కొండజాతుల వారిలో ఈ వాదం బయలుదేరడంలో ఆశ్చర్యం లేదు. మిజో కొండల జిల్లా ఒకవైపు తూర్పు పాకిస్తాన్‌ను, మరొకవైపు బర్మాను అనుకుని వున్నది. ఎనిమిదివేల చదరపు మైళ్ళగా వైశాల్యం, రెండు లక్షలు పైబడిన జనాభా, నలభై శాతం పైగా విద్యావంతులతో కూడిన ఆ జిల్లాలో కొంత కాలంగా విభజనవాదం రాజుకుతున్నది. స్థానిక ప్రజల కోర్కెలను తీర్చడానికి అస్సాం ప్రభుత్వం ఇంత కాలం ఏ చర్యలు తీసుకోలేదు. వారి పౌరజీవితపు అవసరాలను తీర్చడం పట్ల శ్రద్ధ వహించ లేదు. అందుచేత అతివాదులు బయలుదేరి యూనియన్ నుంచి విడిపోవాలనే వాదం లేవదీశారు. ఇతరదేశాల నుంచి ఆయుధాలు సేకరించుకుని తిరుగుబాటుకు సంఘటితులయ్యారు. వారి రహస్యోద్యమం నాగవిద్రోహుల పద్ధతిలో నడిచింది. చివరకు హఠాత్తుగా జిల్లా ముఖ్యపట్టణం ఐజాల్, మరికొన్ని పట్టణాలపై దాడి చేశారు. వెంటనే భారత సైనిక దళాలు జిల్లాలో ప్రవేశించి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. జిల్లాలో బొత్తిగా రహదార్లే లేకపోవడంతో సైనిక చర్యలు మొదట్లో కష్టసాధ్యమైనా, క్రమంగా తిరుగుబాటును అణచివేయడం జరిగింది.

పరిస్థితులు ముదిరి విషమించే వరకు ప్రభుత్వం కదలదని, గోటితో పోయేదానికి గొడ్డలి ప్రయోగించాల్సి వచ్చేవరకు వూరుకుంటుందని అనడానికి ఇది ఇంకొక ఉదాహరణ.



ఇటీవల ప్రధాని ఇందిరాగాంధి పారిస్‌లో ఫ్రెంచి ప్రధాని పాంపిడోను కలుసుకున్నప్పటి చిత్రం

పాకిస్తాన్‌తో సంబంధాలు

ఇవన్నీ అంతరంగిక పరిస్థితులు. ఇక విదేశ వ్యవహారాలలో పరిస్థితి కూడా అంత ఆశాజనకంగా లేదు. తాష్కెంట్ ప్రకటన కలిగించిన ఆశాభావం ఎంతోకాలం నిలవలేదు. ఆ ప్రకటనలోని ఒప్పందాన్ని అనుసరించి ఇండియా, పాకిస్తాన్ సేనల ఉపసంహరణ జరిగినా ప్రచ్ఛన్న యుద్ధానికి మాత్రం పాకిస్తాన్ స్వస్తి చెప్పలేదు. కాశ్మీర్ వివాదాన్ని మళ్ళీ రేకెత్తిస్తున్నది. అది తనకు అనుకూలంగా పరిష్కారం అయ్యేవరకు ఇండియాతో స్నేహం కుదరదని చెబుతున్నది. చైనా పక్షాన చేరగలనని బెదరించడంద్వారా ఇటు ఇండియాకు అమెరికా ఆర్థిక సహాయం చేయకుండా చేయడానికి, ఒత్తిడి పెట్టించడానికి ప్రయత్నిస్తున్నది.

అమెరికా కూడా ఇండో-పాక్ యుద్ధం కాలంలో ఆపి వేసిన ఆర్థిక సహాయాన్ని కొంత ప్రారంభించినా పూర్తిగా సాగించడంలేదు. ఆహార ధాన్యాలను ఏ నెల కా నెల సరఫరా చేస్తున్నా, దీర్ఘకాలిక ఒప్పందంపై ఇంకా తన అంగీకారం తెలపలేదు. పాకిస్తాన్‌తో మనం రాజీ పడేవరకు ఈ వైఖరినే కొనసాగిస్తుందో, ఆర్థిక తదితర సహాయానికి ఇంకా రాజకీయ షరతులేవైనా విధించాలనుకుంటున్నదో ఖచ్చితంగా తెలియడం లేదు. ఈ విషయాలన్నీ ప్రధాని ఇందిరాగాంధి అమెరికన్ పర్యటన తరువాత ఒక దారికి రావచ్చునేమో.

కరువు భత్యం

రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగుల కరువుభత్యం సమస్య ఇటీవల ఉధృత రూపం దాల్చింది. కేంద్ర ప్రభుత్వోద్యోగులకిచ్చే రేట్లతో సమానంగా తమకు కూడా కరువుభత్యాన్ని ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగులు పట్టుపట్టారు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ధరలసూచికలో పది పాయింట్లు పెరుగుదల కనిపించినప్పుడల్లా కరువుభత్యాన్ని పెంచాలన్న సూత్రానికి కట్టుబడి కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు ఈ మధ్య భత్యం పెంచింది. ఇదే సూత్రాన్ని తనకు కూడా వర్తింపజేయాలని రాష్ట్ర ఉద్యోగుల పట్టుదల. ధరల పెరుగుదల బాధ కేంద్ర ఉద్యోగుల కొక విధంగా, తమకొక విధంగా వుండదని, అది అందరికీ సమానమేనని, ఒకే పట్టణంలో పనిచేసే కేంద్ర ఉద్యోగులకు ఒక రకంగా తమకు మరొకరకం కరువు భత్యం వుండడం అన్యాయమని వారి వాదం. ఇది సబబే.

కాని, రాష్ట్ర ప్రభుత్వం ఈ వాదాన్ని అంగీకరించలేదు. కేంద్రం రాష్ట్రాలతో సంప్రతించకుండా తన ఉద్యోగుల భత్యాలను పెంచరాదని, ఒకవేళ తాను పెంచేట్లయితే రాష్ట్రాలకు కూడా ధనసహాయం చేసి, భత్యాల పెంపుదలకు తోడ్పడాలని రాష్ట్ర ప్రభుత్వం వాదన. కేంద్రానికున్నట్టు తనకు తగినంత ధనం సంపత్తి లేదని చెప్పి మొదట అసలే నిరాకరించింది. కాని పొరుగున మద్రాసు, మైసూరు ప్రభుత్వాలు కూడా తమ ఉద్యోగులకు కరువు భత్యాలను పెంచి వేయడంతో దాని వాదన బలహీన పడింది. ఉద్యోగుల కోర్కెను కాదనడానికి వీలులేని పరిస్థితిలో పడింది. కరువుభత్యాన్ని కొంతవరకు పెంచడానికి, మరి కొంత మేరకు కన్స్యూమర్‌స్టోర్స్ నెలకొల్పి చౌకధరలకు అత్యవసర పదార్థాలను సప్లయి చేయడానికి నిర్ణయించింది. కాని ఈ పద్ధతి ఉద్యోగులకు సమ్మతం కాలేదు. తమకు కేంద్రంతో సమానంగా అలవెన్సు పెంచాల్సిందేనని, చౌకధరలకు వస్తువుల సప్లయి పద్ధతి ఆచరణ సాధ్యం కాదు కనుక, తమ కది అక్కరలేదని వారు పట్టు పట్టారు. మార్చి 28 వ తేదీ పని నిలిపివేయగలమని బెదరించారు. అప్పటికి ప్రభుత్వం లొంగకపోతే ఏప్రిల్‌లో కొన్ని రోజులపాటు సమ్మె చేయగలమని ప్రకటించారు.




ఈ నెల మొదటి బహుమతి పొందిన
వి. కృష్ణమూర్తి



రెండవ బహుమతి పొందిన
బి హెచ్. ఎస్. వరప్రసాద్

చివరకు 27 వ తేది అర్థరాత్రికి ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య రాజీ కుదిరింది. తాను ఇదివరకు పెంచిన దానికంటె మరికొంత కరువుభత్యం పెంచడానికి ప్రభుత్వం ఒప్పుకుంది. ఉద్యోగులు కూడా కేంద్రం రేట్లతో సమానం కాకపోయినా, ప్రభుత్వం ఇవ్వదలచిన దానికి ఒప్పుకున్నారు. సమ్మె ఆలోచనను వారు విరమించారు. వారు సమ్మె చేయదలచిన రోజును సెలవు రోజుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధమైన సర్దుబాట్లతో ఉభయులు ఒక పరిష్కారం కుదుర్చుకున్నారు. కేంద్రం సహాయం చేస్తే ఇంకా కొంత పెంచగలనని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు వాగ్దానం చేసిందట. అలా జరిగే వరకు ఈ సమస్య పూర్తిగా అణగిపోతుందనే హామీ లేదు.

అంతేకాదు. జీవన వ్యయ సూచికలో పెరుగుదల కనిపించినప్పుడల్లా కరువుభత్యాన్ని పెంచుకుంటూ పోవడం కూడా మంచి పద్ధతి కాదు. ధరలు పెరిగినప్పుడల్లా కరువుభత్యం పెంచడం, కరువుభత్యం పెంచినప్పుడెల్లా ధరలు పెరగడం—దీనితో అటు ప్రభుత్వానికి, ఇటు ఉద్యోగులకు కూడా ప్రయోజనం లేకపోతున్నది. ఇలా కాకుండా ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రయత్నాలు జరగాలి. ఈ విషయంలో మన ప్రభుత్వం ఇంతవరకు విఫలమైంది. ఇది జరగనంతకాలం జీత భత్యాలను పెంచడం ద్రవ్యోల్బణాన్ని అధికం చేయడానికే తప్ప దేనికీ పనికిరాదు. ఇంతకంటె ఉద్యోగులకు వాస్తవ ప్రయోజనాలు కలిగే పథకాలేవైనా అమలు చేయడం మంచిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిప్పుడు ఈ ధోరణిలోనే ఆలోచిస్తుండడం సంతోషించవలసిన విషయం. □□□



ప్రవృద్ధి ప్రమోషనులకు తగిన అర్హులే వారు, హెర్‌క్యులిస్ దాని స్వంతదారుడుకూడా ఇన్ని సంవత్సరాలు శ్రమకోర్చి పనిచేసినందుకు. మీరు హెర్క్యులిస్ కొన్నారంటే అది మీ నిత్యజీవితపు భాగస్వామి అయిపోతుంది. ఏళ్ల గడిచిపోతున్న కొద్దీ జీవితంలో పరిస్థితులు మారిపోతాయి... ఉద్యోగంలో అభివృద్ధులు లభిస్తాయి...మీ పిల్లలు పెరిగి పెద్దవారౌతారు పెళ్లిచేసుకొని వేరేచోట కాపురం పెడతారు. కాని మీ హెర్క్యులిస్ ఎప్పుడూ మీదగ్గరే మంచి పరిస్థితులలోనే ఉంటుంది.

టి. ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు, మద్రాసు-53
ప్రొప్రైటర్లు: ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు-1.

హెర్క్యులిస్

సైకిల్‌కంటె ఎక్కువైనది—
జీవితకాలపు నేస్తము

JWT/TIC/H/2958



పూ ఆఫీసులో కొద్ది రోజుల క్రితం విద్యుత్ గణాంక యంత్రమును (ఎలక్ట్రానిక్ కంప్యూటర్) నెలకొల్పారు. దానిని గురించి ఆఫీసులో ఒకరోజు జరిగిన సంఘటన మీకు మనవి చేస్తాను.

● ● ●

ఆ రోజు సాయంత్రం విద్యుత్ గణాంక యంత్రాన్ని చూడడానికి చాలామంది వచ్చారు. ఒక ఆఫీసరు దాన్ని గురించి ప్రజలకు చెప్ప నారంభించాడు.

"ఫ్రెండ్స్! ఈ యంత్రం మీ రిచ్చే ఎంత పెద్ద లెక్కనయినా కొద్ది క్షణాలలో సమాధానాన్ని ఇట్టే ఇచ్చివేస్తుంది. కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగింపులు పెద్ద సంఖ్యలతో చేయవలసి వచ్చే ప్రతి ఆఫీసులో దీని ఉపయోగం అంతా ఇంతా అని చెప్పడానికి వీలులేదు. ఒక వందమంది కొన్ని రోజులలో చేయగలిగే పనిని ఈ యంత్రం కొద్ది నిమిషాలలో చేయగలదు.

ఈ యంత్రాన్ని ఆఫీసులో నెలకొల్పితే 'నిరుద్యోగ సమస్య' ఎక్కువవుతుందని కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. కాని, దీనివల్ల లాభాలు ఎక్కువగా రాగలవు. ప్రజల సొమ్ము తింటున్న మేము ప్రజలకు వీలైనంత ఎక్కువ లాభాలు చూపాలనే ఉద్దేశంతో ఈ యంత్రాన్ని నెలకొల్పాము. దీని విషయమై క్రింది తరగతి ఉద్యోగు లందరూ సమ్మె చేయాలని అనుకుంటున్నారు. ఇది చాలా విచారకరమైన విషయం. ఇటువంటి సమ్మెలకు మీరు ఎటువంటి సహకారం, సానుభూతి చూపవద్దని మా మనవి.

ప్రస్తుతం మీరు ఏదైనా లెక్క యివ్వదలచుకుంటే ఇవ్వండి. కొద్ది క్షణాలలో మీకు ఈ యంత్రం ద్వారా సమాధానం యిప్పించగలను."

తన లెక్చర్ పూర్తిచేసి ప్రజలందరివైపు సగర్వంగా చూశాడు ఆఫీసరు. కొంతమంది పెద్ద పెద్ద సంఖ్యలతో కూడిన కూడికలూ, గుణకారాలూ ఇచ్చారు. ఆ ఆఫీసరు ఆ యంత్రం ద్వారా ఆ ప్రశ్నలకు సెకెండ్లలో సమాధానం ఇప్పిం

మొదటి బహుమతి [రు. 50]

వి. కృష్ణమూర్తి
— బి. ఇ. (స్టూడెంట్) జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్, హైదరాబాదు.

చాడు. కొద్ది సేపటికి అక్కడున్న ప్రజలు లెక్కలివ్వడానికి కూడా విసిగెత్తినట్లుంది ఒక్కొక్కరే వెళ్ళి పోయారు.

20–22 ఏళ్ళ వయస్సున్న ఒక కుర్రవాడు మాత్రం అక్కడే నిల్చుండి పోయాడు. అందరూ వెళ్ళినా అతనుండడం ఆ ఆఫీసరుకి ఆశ్చర్యం వేసింది.

"హల్లో మిస్టర్! నీ కేమన్నా అనుమానాలున్నాయా ఈ యంత్రాన్ని గురించి? అడుగు, క్షుణ్ణంగా చెప్తాను" అని ఆ ఆఫీసరు అతన్ని దగ్గరకు పిలిచాడు. ఆ కుర్రవాడు ఒక్క క్షణం తటపటాయించాడు.

"సార్. మీరు లెక్కల స్టూడెంటా?" అని ప్రశ్నించాడు.

"అబ్బే! నేను ఎకనామిక్స్‌తో ఎం. ఏ. ప్యాసయ్యాను. ఏం? ఎందుకు?" అన్నాడు ఆఫీసరు కుర్రవాని ప్రశ్నకు, ఆ యంత్రానికి సంబంధం ఏమిటో అర్థంకాక. ఆ సమాధానంతో కుర్రవాని ముఖం వికసించింది!

"సార్! నా కొక లెక్కకు సమాధానం కావాలి. చాలా తేలిక లెక్క. మీ యంత్రం ఎంత సేపట్లో సమాధానం ఇవ్వగలదు?" అని ప్రశ్నించాడు ఆ కుర్రవాడు చిలిపిగా.

"తేలిక లెక్క అంటున్నావు. అయితే ఈ యంత్రం ఒక సెకండ్‌లో సమాధానం ఇవ్వగలదు" అన్నాడా ఆఫీసరు ధీమాగా.

"నాకు "నాలుగు డివైడెడ్ బై జీరో" సమాధానం కావాలి సార్" అన్నాడు ఆ కుర్రవాడు.

ఆ ఆఫీసరు ఆఫీసు పైకప్పు ఎగిరిపోయేట్టు ఒక నవ్వు నవ్వాడు. "ఇంత చిన్న లెక్కా నీవు అడిగేది? దీనికి సమాధానం నేను ఇవ్వగలను! అఫ్ కోర్స్ నీ లెక్కకు అన్సరు 4 అనుకో! అయినా ఈ యంత్రం ద్వారానే నీకు సమాధానం ఇప్పిస్తాను చూడు" అంటూ ఆ యంత్రానికి పని కల్పించాడు.

"ఒకటి ... రెండు మూడు ... వందలు, వేలు సెకెండ్లు దాటాయి. కానీ ఆ యంత్రం పని చేస్తూనే వుంది. అన్సరు పెరుగుతూనే వుంది. కానీ యంత్రం ఆగడంలేదు! ఐదు, పది, పదిహేను నిమిషాలు గడిచాయి. కానీ, ఆ యంత్రం పని చేస్తూనే వుంది. అన్సరు పెరుగుతూనే వుంది.

"సార్! మీ యంత్రానికి నా లెక్క మీకు కనపడినంత "సింపిల్"గా కనపడలేదేమో! ఇంతవరకూ సమాధానం ఇవ్వలేదు. ఇంకా పని చేస్తూనే వుంది" అన్నాడు చిలిపిగా ఆ కుర్రాడు.

ఆఫీసరుకు అర్థం కాలేదు! ఒకసారి యంత్రంవైపు, మరొకసారి ఆ కుర్రవానివైపు చూసి, వెంటనే యంత్రాన్ని ఆపుచేశాడు. ఆ కుర్రవాడు యిచ్చిన లెక్కను తిరిగి ఆ యంత్రానికి కొత్త లెక్క యిచ్చినట్లు ఇచ్చాడు. కాని, ఆ యంత్రం పని చేస్తూనే వుంది.

కుర్రవాడు ఈసారి కొంచెం పెద్దగానే నవ్వాడు.

"యంత్రం చెడిపోలేదు కదా" అనే అనుమానం వచ్చింది ఆ ఆఫీసరుకు తనకన్న పై ఆఫీసరు దగ్గరికి వెళ్ళి చెప్పాడు. ఆ పై ఆఫీసరు వచ్చాడు. ఇద్దరూ అదే లెక్కని తిరిగి ఇచ్చారు. ఫలితం శూన్యం.

ఇద్దరూ బిత్తరపోయారు. వారికన్నా ఇంకొంచెం పెద్ద ఆఫీసరు దగ్గరకెళ్ళి ఆ విషయం నివేదించారు. ఆ పెద్ద ఆఫీసరుకు ఆశ్చర్యం వేసింది. తన గదిముందు ఆ యంత్రం దగ్గరికి వచ్చారు ముగ్గురూ. వాళ్ళ విషయం పట్టకోనట్లుగా తన పనిలో మునిగి తేలుతోంది ఆ యంత్రం. ఆ కుర్రవాడు అదే చిరునవ్వుతో వీళ్ళను చూస్తూ అక్కడే నిలబడ్డాడు.

ముగ్గురు ఆఫీసర్లు కలిసి మరలా ఆ యంత్రానికి అదే లెక్కని కొత్తగా తిరిగి యిచ్చారు. యంత్రం విసుగూ, విరామం లేకుండా ఆ లెక్కను చేస్తూ వుంది!

ఆఫీసర్లకు అదొక వింత అనిపించింది. ఎంత పెద్ద లెక్కనయినా ఇట్టే క్షణాలలో చేయగలిగే యంత్రం ఇంత చిన్న లెక్కకు సమాధానం ఇలా గంటల తరబడి చేస్తూ ఉండటం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

కొద్ది సేపటికి ఒక ఆఫీసరు "యంత్రం చెడిపోయిందేమో"నన్న అనుమానాన్ని బయటపెట్టాడు. వెంటనే ఆఫీసర్లు ముగ్గురూ సంప్రతించుకొని ఎవరికో ఫోన్ చేశారు. కొద్ది సేపట్లో ఒకతను హడావిడిగా పరిగెత్తుకు వచ్చి ఆఫీసర్లకు నమస్కరించి, యంత్రాన్ని ఆపి, అన్ని భాగాలను పరీక్ష చేశాడు. అన్నీ సరిగ్గానే వున్నాయి.

ఈ సారి ఆఫీసర్ని లెక్క యివ్వమన్నాడు. ఆఫీసరు లెక్క యిచ్చాడు. యంత్రం పనిచేయడం మొదలెట్టింది.

ఒక్కసారిగా ఆ మెకానిక్‌కు ఓ ఐడియా తట్టినట్లుంది. "సార్. మీరు యిచ్చిన లెక్క ఏమిటి?" అని అడిగాడు. ఒక ఆఫీసరు చెప్పాడు లెక్క ఏమిటో. అది ఇచ్చినది ఎవరో కూడా చూపాడు.

మెకానిక్ ఆ కుర్రవాని వైపు చూసి, ఆఫీసర్లవైపు చూసి పెద్దగా నవ్వాడు. ఆ నవ్వుకు అర్థం తెలియని ఆఫీసర్లు తెల్లముఖం వేశారు.

"సార్! ఈ లెక్కకు మన యంత్రం సమాధానాన్ని ఒక్క క్షణం కాదు ఒక వందరోజులలో కూడా యివ్వలేదు. బైదిబై మీ ముగ్గురికి కూడా లెక్కల గురించి తెలియదనుకుంటాను. నాలుగు డివైడెడ్ బై జీరో అనే లెక్కకు సమాధానం అనంతం. [ఇన్‌ఫినిటీ] ఈ కుర్రవాడు మీకు లెక్కలలో ప్రావీణ్యం లేదని తెలిసికొని మిమ్మల్ని బాగా అల్లరి చేశాడు. ఇతన్ని అభినందించకుండా ఉండలేను. ఏం తమ్ముడూ! నా సమాధానం నీకునచ్చినట్లేనా?" అన్నాడు మెకానిక్ నవ్వుతూ.

ఆ కుర్రవాడు "అంతే" నన్నట్లు తలాడించాడు. ఆఫీసర్లకు అప్పటికి కాని కిటుకు అర్థంకాలేదు.

□□□

డాక్టర్

"యూ ఆర్ డాక్టర్ మనోహర్ సర్" టి. టి. ఇ. అడిగాడు. 'యస్ ప్లీజ్' అన్నాను. (కాని మనసులో కాదు బాబోయ్ అని అరిచా. నేను ఉత్త మనోహర్‌నే) 'థాంక్ యూ' అని ముందుకు వెళ్ళిపోయాడు.

ఇంతకూ కథేమిటంటే నేను అంతకుముందు హైదరాబాదు నుంచి బెంగుళూరుకు రిజర్వు చేసుకొన్నాను. కాని నా ఫ్రెండొకడు, రిజర్వేషన్ ఫామ్‌లో నా పేరు వ్రాస్తున్నపుడు డాక్టర్ అని ముందు చేర్చాడు. చేర్చుతూ 'స్టయిల్ లేవోయ్, అంతా మన మంచికే, ఎవరో దద్దమ్మ నిన్ను ఒక డాక్టరేట్ డిగ్రీ హోల్డర్ అనుకొని కాకా పట్టవచ్చు, భోజనం వగయిరా ఖర్చులన్నీ ప్రయాణంలో మిగలవచ్చురా నాన్నా' అన్నాడు. వాడి అయిడియా ఏడ్చినట్లుందను కున్నాను కాని డాక్టర్ అన్న పదాన్ని మాత్రం కొట్టివేయలేదు.

సరేనని ముందు నా బెర్త్‌లో హోల్డాల్ వేశాను. హోల్డాల్‌లో వున్న రెండు పుస్తకాలను సీట్ మీదకు విసిరి హోల్డాల్ సరిగా పరుస్తున్నాను. అంతవరకు ఒక పెద్ద మనిషి నా వేపు అదేపనిగా చూస్తున్నాడు.

ఆ పెద్దమనిషి నన్ను అడిగి 'సైంటిఫిక్ అమెరికన్' అన్న పత్రికను తీసుకొని అటు ఇటు తిప్పుతూ, అండర్‌లయిన్ చేయబడ్డ వాక్యాలను చదివాడు. చదువుతూనే అకస్మాత్తుగా తలెత్తి,

"డాక్టర్‌గారూ తమ రెక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవచ్చా" అన్నాడు.

మొదట కొంచెం (కొంచెమిమిటి చాలా) నివ్వెర పోయినా తరువాత అడిగింది నన్నేనని 'బెంగుళూరు వెళ్తున్నాను' అన్నాను.

కొంచెంసేపు అలా ఇలా చూసి 'తమరేం చేస్తున్నారండి' మరొక ప్రశ్న.

ఇక సరే నిండా మునిగినవాడికి చలేమిటి అని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో రిసెర్చి చేస్తున్నాను, ఇంతకు మునుపే ఒక డాక్టరేట్ తీసుకొన్నానండి' అన్నాను.

తరువాత తనను తాను ఇంట్రడ్యూస్ చేసుకొన్నాడు. అంతకు ముందే మూడేళ్ళముందు ఇంజనీరింగ్ పాసయ్యాడట. ఇప్పుడు? ఇంజనీరింగ్ కాలేజిలో పని చేస్తున్నాడట.

'సరే రిసెర్చిలో మీ సబ్జెక్ట్ ఏమిటి'

'టర్బో ప్రోపల్షన్' [అంతా కోత]

ఆ తరువాత నన్ను నేనే మరచి దేశంలో ఉన్న ఇంజనీర్లందరు ఒక్కొక్క రిసెర్చి చేస్తే దేశం బాగుపడిపోతుందని, ఇంకేమేమో గ్యాను దంచేశాను. దీని కంతటికి ఆధారం అంతకుముందు రోజు ఏదో ఇంగ్లీషు పేపర్లో చదివిన వ్యాసం.

'సర్. మీరేమో చాలా యంగ్‌గా కనపడుతున్నారు. కాని మీ వయసు చాలా వుండాలే.'

గతుక్కుమన్నాను కాని తడబడకుండా 'అదేమిటండీ నా వయస్సు 29 ఏళ్ళు. ఇద్దరు పిల్లలుకూడాను.' (నా వయస్సు 21 ఏళ్ళే.)

అలా చాల విషయాలు మాట్లాడు కొన్నాం. నిద్రపోయాము.

మరుసటి రోజు, మరుపురాని రోజు.

ఉదయం పదకొండు గంటలు కావస్తోంది. అనంతపురం దగ్గర పడుతున్నట్టుంది.

అతను 'అన్నట్టు సర్ నేను ఇక నాలుగురోజుల్లో ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా జాయినింగ్ రిపోర్టివ్వాలి. ఐతే అవి చూసుకోవటానికి చాల కష్టమేమోనని ముందుగా వస్తున్నాను...' ఇంకేమేమో అన్నట్టున్నాడు.

'నా గుండెల్లో రాయిపడింది. నేను చదువుతున్నది అనంతపూర్‌లో ఇంజనీరింగు కాలేజీలో ఫోర్త్ ఇయర్.

□□□



రెండవ బహుమతి [రు. 25]

ఎ. మోహన్ మనోహర్

బి. ఇ. (ఫోర్త్) మెకానికల్. ఇంజనీరింగ్ కాలేజీ. అనంతపురం.

మనసు

ఆ రోజు ఆదివారం. ఆనాడు అంటే ఆదివారంనాడు హాస్టలు స్టూడెంట్సుకు పర్వదినం లాంటిది. ఆ రోజుకోసం చంద్రుడికోసం చకోరాలు ఎదురు చూచినట్లు ఎదురు చూస్తారు. వారంలో ఆరు రోజులు చదువుతో విసిగెత్తి ఆదివారమైనా అలా ఉల్లాసంగా సిటీకి వెళ్ళి తిరిగి వద్దామని, సినిమాలు చూద్దామని అనుకుంటారు. అందుకనే ఆనాడు మధ్యాహ్నం భోం చేసిన తర్వాత సిటీకి వెళ్దామని బయలు దేరాను.

అల్లంత దూరంలో ఆర్ట్సు కాలేజీ దగ్గర ఒక బస్సు ఆగి ఉంది. త్వరగా నడిస్తే అందుతుందని త్వరగా నడిచాను. కాని నేను అంతదూరం పోకముందే బస్సు వెళ్ళిపోయింది. నా మనస్సు చివుక్కుమంది. ఛీ పాడు బస్సులు. నేను వచ్చేవరకూ ఆగకూడదూ. నేను బస్సు ఎక్కినాక కదలకూడదూ. మళ్ళీ ఎప్పటికివస్తాయోబస్సులు. అందులో ఆదివారం. బస్సులు చాలా తక్కువగా ఉంటాయి. వీటికి అసలు వేళా పాళా ఉండదు కాబోలు. ఇంకా కాసేపు ఆపితే వాడి సొమ్మేం పోయింది? అదేమంటే టైము అంటారు. మహా బస్సులన్నీ సరిగా టైముకు నడుస్తున్నట్లు. అలా కాసేపు ఆలోచించసాగాను.

ఇంతలో కోఠీనుంచి ఆర్ట్సు కాలేజి వరకే ఉన్న బస్సు ఒకటి వచ్చి ఆగింది. నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. ఎందుకంటే నేను సినిమాకి పోవాలని బయలుదేరాను. అప్పటికే రెండు గంటలయింది. ఇంకా అరగంటలో కోఠీకి వెళ్ళకపోతే ఆ రోజుకు ఇక సినిమా లేదు గినిమా లేదు. బస్సు కోఠీవైపు వెళ్ళటానికి తిరిగి వచ్చింది. నేను బస్సు ఎక్కాను. కాని డ్రైవరు ఇంజను ఆపుచేశాడు, నాకు విసుగుపుట్టింది. కండక్టరును అడిగాను. ఇంకా టైమెంత ఉందని. పదిహేను నిముషములు అన్నాడు. నాకు చికాకు వేసింది.

బస్సు కాస్త తొందరగా స్టార్టు చేయకూడదూ. అలా చేస్తే రావలసిన వేళకు ముందుగానే వచ్చిందని అంతా సంతోషిస్తారుగా. అని అనిపించింది. ఇప్పుడు బస్సులో నేనొక్కణ్ణే. ఎంతసేపు చూచినా బస్సు స్టార్టు చేయులేదు. పదిహేను నిముషములు అయింది. ఇప్పుడు బస్సు నిండా హాస్టలు స్టూడెంట్సుతో నిండిపోయింది. వాళ్ళతో వాళ్ళు అనుకుంటున్నారు 'ఈ బస్సు దొరకటం చాల లక్కి. ఇది దొరక్కపోయినట్లయితే చాల తిప్పలయేది' అని. బస్సు కదిలింది. అప్పుడనిపించింది. మనసు ముందు ఎప్పుడూ తన బాగేకాని పరుల కష్టసుఖాలు ఆలోచించదని.


మొదటిసారి నేను బస్సు మిస్సు అయినపుడు బాధపడ్డాను. నేను బస్సు ఎక్కినాక బస్సు తొందరగా కదలకూడదా అనుకున్నాను. టైముతో లెక్కేమిటి అనుకున్నాను. కాని అదే బస్సు టైముకు కాక ముందుగానే స్టార్టు చేసినట్లయితే ఎంత మంది కుర్రవాళ్ళకి ఆ బస్సు తప్పిపోయేది. వాళ్ళు వేరే బస్సు కోసం చాలాసేపు వెయిట్ చెయ్యాల్సి వచ్చేది. మొదటిసారి నా పరిస్థితి వాళ్ళ పరిస్థితితో పోల్చుకున్నాను. అప్పుడనిపించింది. వద్దు, వద్దు బస్సులు నియమితకాలం ప్రకారమే నడవాలి. ఒకరికోసం ఆగావద్దు. ఒకరికోసం ముందుగా పోనూవద్దు అని.

ఇలా ఆలోచించేటప్పటికి నా మనస్సు ఎంతో హాయి అనిపించింది.

□□□

రెండవ బహుమతి [రు. 25]
బి. హెచ్. ఎస్. వరప్రసాద్
ఎమ్. ఎస్ సి. (ప్రీవియస్), యూనివర్శిటీ సైన్సు కాలేజీ. హైద్రాబాదు.

పొద్దున్నంతా రిహార్సలు వేసుకున్నా- బాలాభీమాగా రూములోకెళ్లా-దర్జాగా కూచుని-కళ్లల్లోకి సూటిగాచూస్తూ 'ఇంక్రిమెంటుగారూ- నాకు మేనేజరు కావాలి' అన్నా





నిజానిజాలు

ఎస్. మురళీధర్

వెన్నెల్లో డాబాపైన శాస్త్రి, అవధాని, శంకరంలు కులాసాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. శాస్త్ర దూరంలో పిట్టగోడను ఆనుకొని సారథి దీర్ఘంగా ఆలోచిస్తూ నిలబడ్డాడు. వెన్నెలబరువును మోస్తున్న వాతావరణం మత్తుగా ఆహ్లాదకరంగా వున్నది. డిసెంబర్ నెల చలి. మంచు పొగ ఇళ్ళచుట్టూ ఆక్రమించు కొంటున్నది. సమీపంలో ఉన్న సినిమా హాలునుంచి నాయికా నాయకుల ప్రేమగీతం అస్పష్టంగా వినవస్తున్నది. ఓ ప్రక్క సుమిత్రా, పద్మ, లత కూర్చుని సంక్రాంతి పండగ ప్రోగ్రాం తయారు చేస్తున్నారు.

బాహ్య జగత్తునే మర్చిపోయిన సారథిని చూస్తూ శాస్త్రి చెప్తున్నవాడల్లా ఆగి 'వాడు మనస్సు మార్చుకొంటున్నాడులా ఉన్నది.' అన్నాడు.

'నీ మొహం అదేం లేదు. కోర్టులో విడాకుల పత్రం సమర్పించాలని నిశ్చయించుకొంటున్నాడులా ఉంది.' అవధాని గొంతు తగ్గించి మెల్లిగా అన్నాడు. అక్కడున్న పన్నెండు కళ్లూ సారథినే గమనించు తున్నాయని అతనికి తెలియదు. ఆడవాళ్ళు మధ్య మధ్య తలెత్తి ఓరకంట సారథి చర్యలను వీక్షిస్తూ గుసగుసలాడుతున్నారు.

అవ్యక్తమైన ఆవేదన సారథిని నిలువునా దహించి వేస్తున్నది.

'ఇదిగోనండీ, సంక్రాంతి పండగ ప్రోగ్రాం' అంది సుమిత్ర. శాస్త్రి భుజాలెగరేస్తూ 'మా కొంపలార్పడానికి ఏదో తెచ్చారు' అన్నాడు. అతని భార్య పద్మ మూతివిరిచింది. 'మిమ్మల్ని కాని ఖర్చుపెట్టమని కోరం. మీ కో-ఆపరేషన్ కావాలి' అంది.

'అంటే గరిటెలు పుచ్చుకొని

అదిలాబాదుజిల్లా, కళ్యాణఖనిలో "అభ్యుదయ సాహితీ సమితి"వారు ఈ మధ్య నిర్వహించిన కథల పోటీలో ఈ కథ మొదటి బహుమతి (రూ. 100) పొందింది.

వంటు రంగంలోకి దిగాలా?" శంకరం వ్యంగ్యంగా అన్నాడు.

"గరిటెలు కాదు గంగాళాలు పుచ్చుకోవాలి" లలిత అంది.

"అనవసరంగా మాట లెందుకూ? ఆ ప్రోగ్రాం ఏమిటో చదవండి." శాస్త్రి విసుగ్గా అన్నాడు.

సుమిత్ర వివరంగా చెప్పింది. "ఉమ్మడిగా ఒక ఇంట్లో వంటచేసు కోవటము, పన్నెండు గంటలకు భోజనం, సాయంత్రం నాలుగు గంటలకు బీచి, తరువాత సినిమా."

"పండగపూట సినిమానా? డబ్బు లయిపోయి మే మేడుస్తుంటే" అవ ధాని చిరాకు పడ్డాడు.

"కాని ఖర్చుతక్కువలేదన్నారుగా" నిగ్గదీసి అడిగాడు శాస్త్రి.

"మీరేం ఖర్చుపెట్టవద్దు. అయితే చిన్న షరతు."

"ఊఁ! చెప్పండి ఆ షర తేమిటో. అప్పుకోసం వెళ్ళాలా? ఊళ్ళు దోచుక రావాలా?" అని అడిగాడు శంకరం.

"పూర్తిగా వినకుండా ఏం రాద్ధాంతం చేస్తారండి."

"సినిమాకు అయ్యే డబ్బు మా హెూం సేవింగ్ బ్యాంకులోంచి తీసి ఇస్తాం. ఫస్టుకి మీ రంతా అర్ధ రూపాయి వడ్డీతో తిరిగి ఇచ్చే య్యాలి."

"అప్పుడే అనుకున్నాను స్మీ. వీళ్ళ మంత్రాంగం పీకలమీదకు తెస్తుందని." శాస్త్రి దిగాలుగా అన్నాడు.

"సినిమా మానేసి పేకాట వేసు కుందాం" అన్నాడు శంకరం. తన ఆలోచనెలా ఉందని గర్వంగా చూచాడు. ఆడవాళ్ళు మాత్రం ససేమిరా వీల్లేదన్నారు.

"ఈ ప్రోగ్రాంలో ఏ ఒక్కటీ మార్చటం జరగదు" ఖచ్చితంగా చెప్పివేసింది సుమిత్ర.

ఇంకేం అంటాం. మా తలలు వంచి ఒప్పిస్తూంటే. క్రిందకు దిగ బడి మా తిండి తిప్పలు చూడండి."

"థాంక్స్" అంటూ ఆడవాళ్ళు వెళ్ళిపోయారు.

విచారంగా ముఖం పెట్టి శంకరం అన్నాడు. "ఈ పండుగకు జానకి లేకపోవడం, ఏమిటో వెలితిగా ఉంది."

"ఈ చదువుకున్న ఆడాళ్ళు అంతే నోయ్. సారధిని మొదట్నుంచీ ఎరుగుదుము. మనస్సు వెన్న లాంటిది. భర్తకు హక్కు లేదా ఆ మాత్రం. జానకి అలిగి వెళ్ళిపోవ డమే. ఛ. ఛ" అన్నాడు శాస్త్రి.

"అసలు సారధి తప్పుందోయ్. వెధవ వందరూపాయలనోటు కోసరం భార్యమీద చెయ్యి చేసు కోవాలా?"

"మెల్లగా అన్నోయ్ వాడు విన్నాడా తారాజువ్వలా మీదపడ తాడు." అన్నాడు అవధాని కాషన్ ఇస్తూ.

భోజనాలకు పిలుపులు వచ్చాయి. ఆ ముగ్గురూ క్రిందకు దిగి వెళ్ళి పోయారు. మంచులా కురుస్తున్న వెన్నెలతో, ఆలోచనల్తో రగుల్తున్న మనస్సుతో సారధి మిగిలాడు.

నాల్గు రోజుల క్రితం ఆ దంప తుల్లో మాటపట్టింపులు వచ్చి. అలిగి ఆమె పుట్టింటికి వెళ్ళిపోయేదాకా వచ్చింది.

వాళ్ళంతా ఒక్క కాలేజిలో చదువుకున్నారు. మగవాళ్ళు ఒక్క ఆఫీసులోనే పని చేయటం, ఒకింటి వాటాలోనే ఆ నలుగురూ సంసా రాలు చేయటం వల్ల వాళ్ళ స్నేహం పకడ్బందీగానే ఉండింది. నాల్గు రోజుల క్రితం జరిగిన గొడవ వల్ల - వాళ్ళలో వాళ్ళు కుడితిలో పడ్డ ఎలుకల్లా గిజగిజ లాడ్తున్నారు. సారధిని కదపడానికి వాళ్ళకు ధైర్యంలేదు. ఎవరికివారు తప్పుకొని తిరుగుతున్నారు.


నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ చర్చి గంటలు పది వినిపించాయి. మొదటి ఆట వదిలిపెట్టారు. రోడ్లన్నీ రిక్షా గంటలతో, కారు హారన్ల చప్పు ళ్ళతో, విమర్శలు నవ్వులతో శుక్ర వారం సంతలా తయారయింది.

భార్య మీద ఆలోచనలతో సారధి మెదడు వేడెక్కి పోయింది. భుజంపైన ఎవరిదో చెయ్యి పడింది. ఉలిక్కిపడి, వెనక్కి తిరిగిచూచాడు.

"ఆకలి గుర్తుకు రావటంలేదా?" మృదువుగా అడిగింది సుమిత్ర. సారధి స్తబ్ధుగా నిల్చున్నాడు.

"ఇలా మంచులో ఎంతసేపని నిల్చుంటావ్. ఆరోగ్యం పాడవు తుంది." అంది.

"అనవసరంగా మనస్సు పాడు



చేసుకోకు. త్వరలో జానకి వస్తుందిలే' అంది మళ్ళీ.

'దాన్ని గురించి ఎవరూ ఆలోచించడం లేదు.' అన్నాడు విసురుగా సారధి. ఆ మాటన్నప్పుడు అతని కంఠం అపస్వరం పలికింది.

సుమిత్ర చిన్నగా నవ్వి 'వొట్టి అబద్ధాలు, పద భోజనానికి' అంది.

'నిజమే చెప్తున్నాను. నా హృదయం నుంచే దాని రూపాన్నే తొలగించుకున్నాను. ఇంకా ఆలోచించట మెందుకూ ? రేపే విడాకుల పత్రం దాఖలా చేస్తాను' అన్నాడు.

ఒక్కక్షణం విస్తుపోయింది సుమిత్ర. 'సారధీ నువ్వు మారిపోయావ్. గాఢంగా ప్రేమించి ఇంత త్వరగా జానకిని ఎట్లా మర్చిపోగల్గుతున్నా నంటావ్. నీ హృదయాన్ని అడిగి చూడు. నీ మనస్సు బాగులేదు' సుమిత్ర అతని చెయ్యి పుచ్చుకొని 'ఆలస్యం చేయకు, అన్నం చల్లారి పోతుంది' అంది.

'అఖ్ఖర్లేదు. హొటల్‌కు వెళ్ళగల్ను.'

'సరే నీ ఇష్టం. మరొక మనిషి వస్తుండటం నీ కిష్టమయితే అలాగే చెయ్.'

కళవళ పడిపోతూ 'నా కోసం వస్తుండటం దేనికి వస్తున్నాను పద' అన్నాడు సారధి.

సుమిత్ర ముఖంలో ఆనంద రేఖలు మొలిచాయి. 'నేనంటే ఇంత అభిమానంఎందుకు సుమిత్రా' జాలిగా అడిగాడు సారధి.

'అభిమానమే కాదు సారధీ. అనిర్వచనీయమైన ప్రేమ కూడా ఉన్నది. చదువుకుంటున్న రోజుల్లో నిన్ను గురించి ఆలోచించని రోజంటూ లేదు. ఎందుకులే. అదంతా.'

చలించిపోయాడు సారధి. మనిషికి మనిషికి బంధాలు పెనవేసుకపోయి, అర్ధం లేకుండా కాలం పరిగెత్తుతున్నది. ఆరాటపడ్డ మనస్సును సుమిత్ర మాటలు సేదదీర్చినాయి. పాదరసంలా జారుతున్న వెన్నెట్లో సుమిత్రను చూసి వుద్రేక పడ్డాడు. తలను వంచి పెదిమల్ని చుంబించాడు. చెంప చెళ్ళుమంది. సారధి బిత్తరపోయి చూచాడు. కళ్ళలోంచి నిప్పులు దూకుతున్నాయి. 'ఏమిటి నీ ఉద్దేశ్యం. ప్రేమించాననే సరికల్లా నీ దృష్టిలో లోకువైపోయాను.' సుమిత్ర కోపంగా అంది.

సారధి సిగ్గుపడ్డాడు. 'క్షమించు సుమిత్రా.'

మాట్లాడకుండా సుమిత్ర ముందుకు దారితీసింది.

నిశ్శబ్దంగా భోజనాలు చేశారు. జాలిగా చూసిందతనివైపు. పాపం బెదిరిపోయాడు. ఫాల భాగంమీద నిల్చిన చెమటబిందువుల్ని మృదువుగా తుడిచి వేయాలనుకుంది. మనస్సు సంతృప్తిగా ఉంది. అతనికి

భోజనం పెట్టటం వల్లనా ? ఇన్నాళ్లు ఆ రకమైన ఉత్తేజం కల్గలేదు. సుమిత్ర ఏమిటో ఆలోచించ సాగింది.


పదకొండు గంటలు కొట్టింది గడియారం. సుమిత్ర పక్క వేసింది. సారధి పక్క మీద వరిగాడు. 'ఇంకేం ఆలోచించకు. జానకిని రమ్మంటూ ఉత్తరం రాయి' అని వెళ్ళిపోయింది.

ఆశ్చర్యంగా ఉందతనికంతా. సుమిత్రను అర్థం చేసుకోలేదు తను. జానకి తనను ప్రేమించుతున్నాదా ? ఏమో ? ప్రేమించుతునే ఉండాలి. అనుభవించిన తపన అర్ధ్రంగా అనునయించుకోవటం. ఇదంతా ఎలా మర్చిపోగలడు.

పెళ్ళయిన ఈ రెండు సంవత్సరాలు ఎంత హాయిగా గడిచి పోయినాయి. ఆ వంద రూపాయల నోటుతో చల్లగా సాగుతున్న సంసారంలో విషబిందువు చిలికింది. జానకి వెళ్ళిపోయింది. నిర్లక్ష్యంగా. కనీసం వెళ్ళిపోతున్న సమయంలో కూడ తనను చూడకుండా వెళ్ళిపోయింది. ఇందులో తన పొరబాకేం లేదు.

అసలిన్ని గొడవలకు మూల కారణం ఆ వంద రూపాయలనోటు. అది మాయమవటంతో వచ్చింది. అలసిపోయి ఆ రోజు ఆఫీసునుండి వచ్చాడు. చెల్లెలు అర్జంటుగా వంద రూపాయలు పంపమని టెలిగ్రాం పంపితే చేబదులు తెచ్చాడు. ఆ రాత్రి సినిమాకు వెళ్ళాలంది జానకి. డబ్బు లేదన్నాడు.

మర్నాడు ఉదయం పొరపాటున నోటు టేబిలుమీదవుంచి స్నానానికి వెళ్ళాడు. తిరిగొచ్చిచూస్తే కన



వళ్ళేట. దానికోసం ఇల్లంతా గాలించాడు. కాని ఆ నోటు పోనే పోయింది. జానకిపైన అనుమానమొచ్చినా నోటు తియ్యవల్సిన అవరస మేముంటుందనుకున్నాడు.

ఆఫీసుకు అలస్యంగా వెళ్ళి ఆఫీసర్ చేత నాల్గు చీవాట్లుపడి అర్జెంట్ కాగితాలు కట్ట కట్టి ముందు వేసుకొని కూర్చున్నాడు. మొత్తం కాగితాలు డిస్‌పోజ్ చేసేసరికి రాత్రి ఏడయింది. నీరసంగా ఓ పక్క ఆకలి దహించి వేస్తూంటే ఇంటికి చేరుకున్నాడు. అందరూ సినిమాకు వెళ్ళారు. తాళంకప్ప తలుపుకు వేళ్ళాడుతూ తనను వెక్కిరించింది. సారధికి పట్టరాని ఆగ్రహం కలిగింది భార్యపైన. ఆ వందరూపాయలు ఆమే తీసివుంటుందని నిశ్చయానికొచ్చాడు.

సినిమానుంచి రాగానే పరామర్శించడానికి వచ్చింది. సిగ్గులేక పోతేసరి. మనస్సులోఉన్న కోపాన్నంతా కక్కాడు. ఎదురుతిరిగి సమాధానాలు చెప్పింది. చేయిచేసుకొన్నాడు. ఆ రాత్రికి రాత్రి పుట్టింటికి వెళ్ళిపోయింది.

తొందర పడ్డాను అనుకున్నాడు సారధి. నిజంగా ఆ వంద రూపాయల నోటు తియ్యలేదేమో. తప్పకుండా ఉత్తరం రాసేయాలి, అనుకున్నాడు.

రాత్రి చాలా భాగం ఆలోచనలతో గడిచిపోయింది. ఉదయం ఎనిమిది గంటలకు మెలకువ వచ్చింది. ఇంట్లో ఎవరివో కంఠస్వరాలు విన్పించాయి. అనుమానంగా వెతికాయి అతని కళ్ళు గదంతా. పెట్టెలు, హోల్డాలు కన్పించాయి. బహుశా జానకివచ్చి ఉంటుంది. మనస్సు తేలికపడ్డట్టయింది. కిటికీలోంచి చల్లటిగాలి వీస్తున్నది. మంచు పొగ మెల్లమెల్లగా కరిగిపోతున్నది.

టీపాయిమీద ఉన్న ఉత్తరాన్ని చదివాడు.

జానకి,

చాలా తొందరపడ్డావు సుమా. నీ తప్పేమీ లేకపోవచ్చు. అన్ని వేళలా పరిస్థితులు మనకూ అందుబాటులో ఉండవు. సారధి విసుగువల్ల, ఏదో అన్నాడని పెళ్ళిపోయావుగాని, నిజం తెలుసుకొనటానికి ప్రయత్నించలేదు. సహనంతో సారధిని సముదాయించి ఉంటే ఇంత ధాకా రాకపోవును.

ఆ వంద రూపాయలనోటు శాస్త్రి, శంకరం, అవధాని కల్సి దొంగిలించారు. ఆశ్చర్యపడకు. సంవత్సరంనుంచి వాళ్ళలో వస్తున్న మార్పులు నేను గమనించక పోలేదు. ఇన్ని గొడవలకు కారణం నువ్వు.

అవును. నువ్వే. మనమంతా కాలేజీ చదువుకుంటున్న రోజుల్లో ఆ నల్గురూ నిన్ను ప్రేమించారు. అప్పట్లో నీకు వచ్చిన ప్రేమలేఖలు శాస్త్రి, శంకరం, అవధాన్లు కలిసి రాసినవే. వాళ్ళను కాదని నువ్వు సారధిని పెళ్ళిజేసుకున్నావు.

చదువులు పూర్తయి సంసారాలతో వక్క ఇంట్లో కలుసుకోగల్గాం. వాళ్ళ హృదయాల్లో మరుగుపడిన ఈర్ష్యాసూయలు తిరిగి తలలెత్తాయి. మీ సంసారం పొరపొచ్చాల్లేకుండా సాగుతుండడం వాళ్ళకు సుతరామూ ఇష్టంలేదు. కలతలు లేపడానికి కారణాలు వెతికారు. ఎదురు చూసిన సమయం చిక్కింది. కళ్ళబడ్డ వంద రూపాయల నోటును గపుచిప్పుగా దాచేశారు. ఆనాడు అనుకోకుండా సినిమా ప్రోగ్రాంవేసి తీసుకెళ్ళారు.

ఆ విషయాలేం తెలియక పోవడంతో మీరు గొడవపడ్డారు. స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకోవడం కష్టం అంటారుగాని మగవాడి మనస్తత్వం ఏమిటో ఎవ్వరూ గ్రహింపలేరు.

ఈ సంగతులన్నీ అప్పుడే చెప్పవల్సింది నేను. నువ్వు వినకుండా వెళ్ళిపోవడంతో ఇలా ఉత్తరం రాస్తున్నాను. సారధి బాధపడుతున్నాడు త్వరగా వచ్చేయ్.


సెలవు—

నీ


సుమిత్ర.

ఉత్తరం పూర్తిజేసి బల్లమీదపడేశాడు. జానకి గదిలోకి అడుగుపెట్టింది. 'తెల్లారిందా దొరగారికి' అంది చిలిపిగా. చిన్నగా నవ్వాడు. విచ్చిన కలవరేకులా తళతళ్ళాడుతున్నది. తలంటి పోసుకొని జడ వదులుగా వేసుకొంది. ముంగురులు నిగనిగలాడుతూ ముఖంమీద పారాడుతున్నాయి. 'ఇలా రా జానకీ' అన్నాడాప్యాయంగా. జానకి నవ్వుతూ సమీపించింది. అతడు మళ్ళీ హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

□□□







వాన వెలిసింది

త్రై. రఘునాథరావ్

విజయనగరం ప్లాట్‌ఫారం మీద మెడ్రాసునుంచి కలకత్తా పోయే మెయిలు ఆగింది. సంధ్యాసమయం అయినా దట్టంగా మేఘాలు ఆకాశంలో అల్లుకొనివుండడం మూలాన్ని చీకటిగా ఉంది. వర్షం జోరుగా కురుస్తోంది. చినుకులు నీటితో చేసిన గునపాల్లా పొడుస్తున్నాయి. ప్లాట్‌ఫారంమీద ఒకరి మాట లొకరికి వినిపించడం లేదు. ఒకటువ తరగతి పెట్టెలోంచి అతను దిగేడు. చేతిలో ఒక సూట్‌కేసు ఉంది. వర్షంకోటుతో చలిగాలికి వణుకుతున్నాడు. తడిసిన చేతి రుమాలుతో వాన జల్లుకి తడిసిన ముఖాన్ని తుడుచుకుంటూ స్టేషన్‌వైపు నడిచేడు. 'ఆ సూట్‌కేసు నే నట్టుకొస్తా. నాకో పావలా కాసు పారెయ్యండి' అన్నాడొక రైల్వే కూలీ అతని చేతిలోంచి దాన్ని లాక్కుంటూ. ఓవర్ బ్రిడ్జి దాటి ఇద్దరూ బయటికి వచ్చేక—

'రిక్షా కేకెయ్యనా బాబూ!' అన్నాడు కూలీ.

'వొద్దు. జయపురం బస్సేదీ?' అన్నాడతను.

'ఇయ్యాళ రాలేదండి. దోవలో యక్కడో ఆగిపోయుంటది. ఈ వొరషానికి గజపతినారం కాడున్న గడ్డ పొంగిపోయుండాల'

అతడు ఒక్క క్షణం ఆలోచించి 'అయితే డాక్ బంగళాకి పద' అన్నాడు. డాక్ బంగళా హాల్లో సూటుకేసు దింపేసి అతడిచ్చిన రూపాయి తీసుకొని ఒక సలాం కొట్టి రైల్వేకూలీ వెళ్ళిపోయేడు. రూపాయినోటు చూడగానే డాక్ బంగళా దర్వాను తడిసిపోయిన సూట్‌కేసుని పైమీద తువ్వాలుతో జాగ్రత్తగా తుడిచేడు. అతడి వర్షంకోటునీ, టోపీని, అతి భక్తితో అందుకొని దులిపి, మూలనున్న కొయ్యకు తగిలించేడు.

'చా తాగుతారా బాబూ?' అన్నాడు వినయంగా.

'తీసుకురా' అన్నాడతను నీరసంగా ఒక వాలుకుర్చీలో చేరబడి. టీ తాగుతున్నప్పుడు వణుకుతున్న చేతిలోని కప్పు సాసరుమీద టకటకమని కొట్టుకుంది. టీ తాగి జేబులోంచి తాళంచెవి తీసి దర్వానుకిచ్చేడు. 'ఆ సూట్‌కేసులో మీదనే ఒక శాలువ ఉంది. తీసుకురా' అన్నాడు. దర్వానుఇచ్చిన శాలువని కప్పుకొని కళ్ళు మూసుకున్నాడు.

అతడు మళ్ళీ కళ్ళు తెరిచేసరికి వరండాలో ఏవో మాటలు వినిపిస్తున్నాయి. 'గది ఖాళీలేదు బాబూ' అది దర్వాను గొంతు.

'పోనీ లేవోయ్. సావిట్లో నే ఈ రాత్రి గడిపేస్తాం.'

'ఎందుకు చిట్టిబాబూ? ఏదేనా హొటలుకు పోదాం పద'

"హోటలుకి వెళితే మరి దీని సంగతి ?"

వరండామించి రెండు గొంతుకలు నవ్వేయి.

"నిజమే సుమా! అయితే లోపలికిపద"

ముగ్గురూ హాల్లోకి వచ్చేరు. వాలుకుర్చీలోని మనిషితో అందులో ఒకాయన "సార్! మేం కొంచెం భోజనం చేస్తాం. మీకేమీ అభ్యంతరం ఉండదుకద ?" అని అడిగేడు.

"నా అభ్యంతరమేముంది ? కానివ్వండి"

దర్వాను ఒక టిఫిన్ కారియర్ని టేబిలుమీద పెట్టేడు. రెండు గ్లాసుల మంచినీళ్ళు తెచ్చేడు. వాళ్ళిద్దరూ టిఫిన్ కారియర్లోని గిన్నెల్ని వేరుచేసేరు. "మీరు భోజనం చేసేరా ?" అన్నాడు యింతక్రితం మాట్లాడినాయన వాలుకుర్చీవైపు తిరిగి.

"లేదు." "మా దగ్గర వేడి వేడి పూరీలూ, కూరలూ ఉన్నాయి. కొంచెం సాయం పట్టండయితే" అన్నాడతను చిరునవ్వుతో.

"క్షమించండి సార్! నాకు వొంట్లో బాగులేదు."

"అరెరె! వంట్లో బాగులేక పోతే ఈ దిక్కుమాలిన వర్షంలో డాక్ బంగళాలో ఏం చేస్తున్నారు ఊళ్ళోకి పోక ?"

"నేను జయపురం వెళ్ళాలండి. మెడ్రాసు నుంచి మెయిల్లో వచ్చేను. బస్సు రాలేదు. ఇక్కడ ఉండిపోవాల్సి వచ్చింది." అతి భారంగా ఆయాసంతో అన్నాడీ మాటల్ని.


"బాగుంది. దురదృష్టవంతులం ముగ్గురం ఒక్క దగ్గిరే కూడేమన్నమాట. మేమూ జయపురం పోదామని విశాఖపట్నం నుంచి కారులో వస్తూంటే ఈ ఊళ్ళో శుభవార్త చెప్పేశారు గజపతి నగరం ఏరు పొంగులో ఉందని. అదేమిటి బుచ్చీ! అలా దిక్కులు చూస్తావేం? మొదలుపెట్టూ, ఆలస్యం అయితే పూరీలు చల్లారిపోతాయ్!"

వాళ్ళిద్దరూ భోజనం పూర్తిచేసి సిగరెట్లు ముట్టించేరు.

"ఇక నువ్వు పో" అన్నాడు చిట్టిబాబు దర్వానుతో. వాడు బయటకి వెళ్ళేక తలుపులు గడియవేసి వాలుకుర్చీ దగ్గరకి వొచ్చేడు.

"నిందాకలనుంచి చూస్తున్నాను. తెగ వణుకుతున్నారు దీనికి బయటుశాలువ కప్పుకుంటే ఆగుతుందా ? లోపల వేడిపుట్టాలి సార్! ఘాటైన మందు ఒక మోతాదిస్తాను. ఆ దెబ్బతో మీ వణుకూ, ఉష్ణం బలాదూర్! ఏమంటారు ?"

వాలుకుర్చీలోని వ్యక్తి ఏమీ అనలేదు. నీరసంగా నవ్వేడు. చిట్టిబాబు పాంటు జేబుల్లోంచి రెండు చిన్నగ్లాసులు తీసి టేబిలుమీద ఉంచేడు. "బుచ్చీ! ఏదీ, ఆ మంచి నీళ్ళ గ్లాసందుకో" కోటు జేబులోంచి ఒక సీసా బయటకి తీసి



అందులోని ద్రావకం మూడు గ్లాసుల్లోనూ కొంచెం కొంచెం పోసేడు చిట్టిబాబు. బుచ్చి మంచి నీళ్ళతో గ్లాసులు నింపేడు. ఒక గ్లాసు ఇతడికి అందిస్తూ "స్మగల్డ్ సార్! హార్బరు ఏరియాలో ఏభైకి చవగ్గా కొట్టేసేను. ఇదే లేబిలు హైదరాబాదులో కొంటే డెబ్భైఅయిదు. ఒక సిప్ లాగిచూడండి. దీని మజా మీకు బోధపడుతుంది." అన్నాడు చిట్టిబాబు. ముగ్గురూ గ్లాసులు తగిలించేరు.

"టు ద స్పీడీ రికవరీ ఆఫ్ అవర్ న్యూ ఫ్రెండ్!" అన్నాడు చిట్టిబాబు. వాలుకుర్చీలోని వ్యక్తి నీరసంగా నవ్వేడు.

"థేంక్స్. కాని నాకా అదృష్టం లేదుసార్"

"అదేమలా అంటున్నారు?"

"నాకున్న జబ్బు ఒన్ వే ట్రాఫిక్ దీనికి మరి రికవరీ అంటూ లేదు. వాళ్ళిద్దరూ ఒకరి మొఖా లొకరు చూసుకున్నారు, గ్లాసులు ఖాళీ

అయేదాకా ఎవరూ మాట్లాడలేదు. అతను వాలు కుర్చీలోంచి లేచేడు.

'నాకు మీరు అనుమతి ఇస్తే ఇక పోయి పడుకుంటాను' అన్నాడు.

'ఎంతమాట! ఎంతమాట!' అన్నారిద్దరూ

అతను పోయి గదిలో పడుకున్నాడు.

'పాపం! ఏం జబ్బో ఏమిటో బుచ్చీ! ఓ పని చేద్దాం. వీడుగాని బస్సులో వెళితే తోవలోనే చస్తాడేమో. నా కారులో తీసుకపోదాం' అన్నాడు చిట్టిబాబు.

'నీ ఇష్టం' అన్నాడు బుచ్చి.

మర్నాడు ఉదయం డాక్ బంగళా నుంచి బయలు దేరిన కారు సాలూరు వైపు బయలుదేరింది. బుచ్చి డ్రైవ్ చేస్తున్నాడు. చిట్టిబాబూ తనూ వెనకసీటులో కూర్చున్నారు.

'ఇంతవరకూ మన పరిచయాలు కాలేదు.'

'నా పేరు సుధాకరరావు. అయిదు సంవత్సరాల క్రిందట మీ జయపురం వాడినే. ప్రస్తుతం నా మకాం మద్రాను. ఉద్యోగం తండ్రి తాతలు గడించిన ఆస్తి తగలేస్తూ ఉండడం. ఇంటర్మీడియట్ చదువుతూ చదువు మానేసేను.'

'భేష్! బాగుంది. ఇంకేం? నా పేరు చిట్టిబాబు. మా ఫ్రండు పేరు బుచ్చి. నేను సివిల్ ఇంజినీర్ని. వీడు ఆటోమొబైల్ ఇంజినేరు. రెండూ ఆనరరీ డిగ్రీలే లెండి. నాటు భాషలో మీకు చెప్పాలంటే నాది కలప వ్యాపారం. మా బుచ్చికి ఒక షెడ్డు ఉంది. అందులో లారీలూ, కార్లూ మరమ్మత్తు చేస్తూ వుంటాడు. నా స్వస్థలం అనకాపల్లి. అక్కడ బెల్లం వ్యాపారంలో దెబ్బతిని జయపురం నాలుగు సంవత్సరాల క్రితం చేరుకున్నాను. ఇక్కడ చిన్న చిన్న కంట్రాక్టర్లతో ప్రారంభించేను. ఏదో ఇప్పుడిప్పుడే కొంత దారినిపడింది నా బండి. ఇక మా బుచ్చి సంగతా? ఇంజను శబ్దం వింటేచాలు. ఎక్కడ డిఫెక్టుందో పట్టేస్తాడు. ఈ చుట్టుపట్ల వీడిలాంటి మెకానిక్కే లేడు.'

'తగ్గు, తగు' అన్నాడు బుచ్చి నవ్వుతూ.

'అయితే యిక్కడో చిన్న తిపిరీ ఉంది. అదేమిటంటే అస్తమానం ఆ గారేజీలో పని చేస్తూ ఉంటే ఎక్కడ డబ్బు గడించేస్తానో అని మనవాడికి భయం. అందుచేత నాలుగురాళ్ళు చేతులో పడగానే దుకాణం కిందివాడికి అప్పజెప్పి నాలాంటి ముక్లెసుగాళ్ళతో ఇలా అటూ ఇటూ చక్కర్లుకొడుతూ ఉంటాడు.' బుచ్చి పకపక నవ్వేడు.

సుధాకరరావు అన్నాడు 'మీరు చాలా అదృష్టవంతులు. ఏ చీకూ చింతా లేకుండా హాయిగా కాలం గడుపుతున్నారు.'

'అలా అంటే నే నొప్పుకోను సార్! మా కంట్రాక్టర్ల బతుకులు మీకేం తెలుసు? నిన్న రాత్రి మీరేమిటన్నారు? మీకున్న జబ్బు వన్ వే ట్రాఫిక్ అని. మాది టూ వే ట్రాఫిక్. అంటే మేం నిత్యం చస్తూ బతుకుతూ ఉంటాం, ఎప్పుడు తేల్తామో తెలీదు.' కారుకి అడ్డంగా ఓ రెండెడ్లబండి వచ్చింది. కారు ఆపేడు బుచ్చి. రెండెడ్లబండి వాడిని నాలుగు బూతులు తిట్టేడు చిట్టిబాబు. బండీ తప్పుకుంది. కారు మళ్ళీ స్టార్టు చేస్తే అవలేదు. గుర్ గుర్ మని రెండు మూడుసార్లు గొణుక్కొని ఆగిపోతోంది శబ్దం.

'ఏమయిందిగురూ?' అన్నాడు చిట్టిబాబు.

'బాటరీ డౌనయి పోయింది.' అన్నాడు బుచ్చి.

'నేనేం చెప్పేను నిందాకల?' అన్నాడు చిట్టిబాబురావువైపు తిరిగి: 'నా బ్రతుకు ఎలాగో నా కారు బతుకూ అలాగే ఉంది. మొన్న విశాఖపట్నం ఒక వారం రోజుల ప్రోగ్రాం వేసుకొని వెళ్ళేం. ఏమయింది? అవతల పార్టీ ఏదో అర్జంటు పనుండి హైదరాబాదు వెళిపోయేట్టు బస్! ప్రోగ్రాం ఖతమ్! ఇంత పెట్రోలు ఖర్చూ దండగ. అయితే ఈ ట్రిప్పులోని ఒక్క బ్రైట్ స్పాట్ ఏమిటంటే ఇది!' అని కోటు లోపలి జేబులోంచి క్రితం రాత్రి బుడ్డీ మళ్ళీ బయటకి తీసేడు. జేబులోంచి ఒక గ్లాను తీసి రావుకి అందించేడు.

'వద్దుసార్! మరి మొహమాట పెట్టకండి' అన్నాడు రావు

'బుచ్చీ! గ్లాసందుకో'

'మనం మరి జయపురం వెళ్ళక్కర లేదా?' అన్నాడు బుచ్చి.

'ఒక్క చుక్క కేమీ అయిపోలేదులేవోయ్! ఈ దిక్కుమాలిన మునురులో ఇది లోపల పడితేనే గాని హుషారుండదు గురూ!'

ఎదురుగా ఒక లారీ వస్తోంది. బుచ్చి చెయ్యి అడ్డంగా పెట్టేడు. లారీ ఆగింది. బుడ్డీ, గ్లానులు చప్పున చిట్టిబాబు జేబుల్లోకి వెళ్ళిపోయేయి.

'ఏటయింది గురూ?'

● వెనకటికి దశరథుడు వేటకి వెళ్ళి పొరపాటున ఒక ముని కుమారుణ్ణి చంపేశాడు. వాడి తల్లిదండ్రులు దశరథునికి నువ్వుకూడా మాలాగానే పుత్రవియోగం భరించలేక మరణిస్తావని శాపమిస్తారు. అంత ఘోరశాపం విన్న దశరథుడికి భయంబదులు నవ్వొచ్చిందట. ఎందుకంటే 'పుత్రులే లేక ఏడుస్తున్న నాకు మీ శాపం మూలంగానైనా పుత్రులు కలగడం, వారి వియోగంతో నేను మరణించడం జరిగితే అది శాపం కాదు, వరమే' అన్నాట్ట.

'బాటరీ డౌనయిపోయింది. కొంచెం ఎత్తియ్యి!'

కారు మళ్ళీ బయలుదేరేసరికి వర్షం జోరుతగ్గి జల్లుగా కురుస్తోంది. చిట్టిబాబు బుడ్డీ మళ్ళీ బయటకి లాగి రెండు చుక్కలు లోనికి పోనిచ్చేడు. రావు కునికిపాట్లు పడుతున్నాడు. అతడి నుదుటిమీద చెయ్యి వేసేడు చిట్టిబాబు. నుదురు కాలుతోంది.

ఏటివొడ్డుకి వొచ్చింది కారు.

'అదుగో జయపురం బస్సు!' అన్నాడు చిట్టిబాబు.

బస్సు గడ్డమధ్యలో ఉంది. బస్సులోని జనమంతా ఇవతలి వొడ్డున నిల్చున్నారు. బస్సులో డ్రైవరొక్కడే కూర్చున్నాడు. దాన్ని తాళ్ళు వేసి లాగుతున్నారు కొందరు. వెనకనుంచి మరి కొందరు తోస్తున్నారు. అక్కడున్న ప్రతిమనిషి తాడు లాగుతున్నవాళ్ళకి డ్రైవరుకి ఏదో ఒక సలహా

ఇస్తూనేఉన్నాడు. కొందరు గట్టిగా అరుస్తున్నారు. ఆ జాగా అంతా చాలా హడావిడిగా ఉంది. ఎలాగైతేనేం బస్సు ఇవతలి తీరానికి చేరింది. అందరూ మళ్ళీ బస్సెక్కేరు.

'కరెంటెలాగుంది గురూ?' అడిగేడు బుచ్చి.

'నీరు తీసేసింది. ఇక ఫరవా లేదు.' అన్నాడు బస్సులోని డ్రైవరు. బస్సు విజయనగరం వైపు వెళ్ళిపోయింది. కారు స్టార్టు చేశేడు బుచ్చి. ఏట్లో సగం దూరం దాకా బాగానే వెళ్ళింది కారు. అక్కడినుంచి మరి ముందుకి వెళ్ళలేదు. ప్రవాహం పక్కకి నెట్టుతోంది కారుని చిట్టిబాబుకి ముచ్చెమటలు పోసేయి. రావు తాపీగా అడిగేడు; 'ఒకవేళ కారు ముందుకి పోలేక ఈ ప్రవాహం జోరు ఎక్కువైపోతే ఏమవుతుంది?' 'ఏమవుతుంది? మీరూ నేనూ ఛస్తాం. బుచ్చికి ఈత వొచ్చు కాబట్టి వాడెలాగో ప్రాణాలతో బయట పడతాడు.' అన్నాడు చిట్టిబాబు. రావు సంతృప్తిగా నవ్వుకొని వెనక్కి చేరబడ్డాడు.

'అవును, మీకు చావంటే నవ్వులాటగా వుంది. నాకు మాత్రం అప్పుడే చావాలని లేదు' కారు మరి కొంచెం పక్కకి జరిగింది.

'బుచ్చీ! నా కొంప ముంచకు. ఆ గాడిద కొడుకులు చూడు, వొడ్డున కూర్చుని ఎలా

చూస్తున్నారో! ఒరే! మీ అమ్మ కడుపు కాల! ఇరవైరూపాయలిస్తాను రండి.' గట్టిగా అరిచేడు చిట్టిబాబు

ఏటివొడ్డున తీరిగ్గా చుట్టకాల్చుకుంటున్న ముసలాడు 'ఏభైకి తక్కువైతే లాగమండి. కరెంటు మా జోరుగా ఉంది.' అన్నాడు.

కారు మరికొంచెం పక్కకి జరిగింది.

'ముప్పై తీసుకో' అన్నాడు చిట్టిబాబు

ముసలాడు దీనికి జవాబే ఇవ్వలేదు. పక్కనున్న వాడితో 'అల్లదుగో ఆ పెద్ద కెరటం చూసేవా? మరో నిమిషానికి కారూ, బాబులూ ఖలాస్!' అని చుట్టలోంచి మరో దమ్ము లాగేడు.

'నీ ఏభై మండిపోను! అలాగే ఇస్తాను రండి.'

కారు ముందుకి జరిగింది. చిట్టిబాబు సంతోషంతో కేకలేశాడు. 'కదిలింది కదిలింది. ఎడంవేపుకి కొయ్! అన్నాడు బుచ్చితో. బుచ్చి సమాధానం ఇవ్వలేదు. కారు మరి కొంచెం ముందుకి జరిగింది. మరో కొన్ని క్షణాల్లో అవతలి తీరం చేరుకుంది.

'మూసేవా ముసలోడా! అత్యాశకి ఎప్పుడూ పోతు! అన్నాడు చిట్టిబాబు కసిగా. ముసలాడు చుట్టతీసి కోపంతో నేలకి కొట్టేడు. 'చెప్పేను కదండీ. మా బుచ్చి అంటే ఏమి

అనుకున్నారు? ఈ జిల్లాలో మా వాడిలా డ్రైవ్ చెయ్యగలవాడేడీ?' అన్నాడు రావుతో చిట్టిబాబు.

గజపతినగరం వచ్చింది 'రావుగారూ! వర్షం తగ్గింది, దిగండి. ఇక్కడ నాకు తెలిసిన డాక్టరొకాయన ఉన్నారు. ఒక్క పెన్సిలిన్ మీకు పడితేనేగాని ఈ టెంపరేచరు తగ్గదు.'

'మీకు చాలా థేంక్స్, కాని నాకేమీ అక్కరలేదండీ. నన్నిలాగే చావనివ్వండి. నాగురించి మీరేమీ శ్రమపడొద్దు. నన్ను జయపురం చేరిస్తే చాలు. మీ రుణం వచ్చే జన్మలో తప్పక తీర్చుకుంటాను.'

చిట్టిబాబు, బుచ్చి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. బుచ్చి కారుని ముందుకు పోనిచ్చేడు. సాలూరులో బుచ్చి, చిట్టిబాబు భోజనాలు చేసేరు. రావు కాఫీ తాగేడు. సాలూరు దాటి కారు కొండ ఎక్కడం ప్రారంభించింది.

'ఇంతకీ మీ జబ్బేమిటో చెప్పేరుకాదు.' అడిగేడు చిట్టిబాబు.

రావు నిట్టూర్చేడు. 'ఏమని చెప్పమంటారు? ఇది ప్రపంచలో ఏ డాక్టరూ కుదర్చలేని జబ్బు. దీనికి మందులేదు. దీనిని మనోవ్యాధి అంటారు' అన్నాడు.

అలా కొన్ని క్షణాలు రావువేపు నోరుతెరిచి చూసి గల్లున నవ్వడం మొదలుపెట్టేడు చిట్టిబాబు. పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వేడు.

'హారినీ! నువ్వుగాని కథలూ కవిత్వాలూ రాసేవాడివి కావు గద!'

'నవ్వండి. నా బ్రతుకే నవ్వుల పాలయింది. మీ కేమిటి? రేపు నేను చచ్చేక నా శవాన్ని చూసి లోకమంతా నవ్వాలి. నా వంటి పాపాత్ముడికి ఈ శాస్తి జరగవలసిందే!' అన్నాడు రావు ఘోరంగా తలని రెండు చేతులతోనూ పట్టుకుంటూ.

'చూడు తమ్ముడూ! మంచి వయస్సులో ఉన్నావు. నీకు చావాల్సిన ఖర్మేం? నువ్వు మరోలా అనుకోకపోతే నీ కథేమిటో నాకు చెప్పు. జీవితంలో బాగా ధక్కా మొక్కీలు తిన్నవాణ్ణి నీ జబ్బుకి మందు నే నిస్తాను.'

చాలా సేపటివరకూ రావు మాట్లాడలేదు. చివరికి ప్రారంభించేడు.

'చిట్టిబాబుగారూ! నేనో అమాయకురాలికి అన్యాయం చేసేను ఒక అమ్మాయిని బలాత్కారంగా చెరిచేను. ఇది ఐదు సంవత్సరాల క్రిందటి మాట. వాళ్ళు ఊరవతల చక్కటి బంగళాలో ఉండేవారు. నేనూ ఆ అమ్మాయీ కాలేజీలో చదువుతూ వుండేవాళ్ళం. వాళ్ళ కుటుంబం చాలా ఫార్వర్డ్‌గా ఉండేది. నేను వాళ్ళ యింటికి వస్తూ పోతూ ఉండేవాణ్ణి. ఒకనాడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒకానొక మానసిక దౌర్బల్యంలో, కామోద్రేకంలో ఆ అమ్మాయి శీలాన్ని నేను మంటగలిపేను. ఆ వేడి చల్లారిన మరుక్షణంలో నాకు పోలీసులూ జైలూ కళ్ళకికట్టి స్పృహతప్పి పడివున్న ఆ అమ్మాయిని అక్కడ వొదిలి మద్రాసు పారిపోయేను. అలా పారిపొమ్మని సలహా యిచ్చినవాడు మా నాన్న. మద్రాసులో ఈ అయిదు సంవత్సరాలూ అజ్ఞాతంగాగడిపేను. కాని అనాడు జరిగిన సంఘటన మాత్రం నన్ను పిశాచంలా వెంటాడింది. అది మర్చిపోవాలని ఎన్ని ప్రయత్నాలు చేసేనో ఆ భగవంతుడికి తెలుసు! అకలి వెయ్యదు. నిద్ర

- రాబర్ట్ సథే అని ఒక ఇంగ్లీషు కవి వుండేవాడు. అతడు తను షేక్‌స్పియర్, మిల్టన్‌లంత గొప్ప కవినని తను అనుకోవడమే కాక, ఆ విషయం ఇతరులతో కూడా చెప్పేవాడు. అతని స్వోత్కర్ష వినలేక బోరుకొట్టిన ఒక విమర్శకుడు 'అయ్యా, నిజంగా మీరు గొప్ప కవులే. షేక్‌స్పియర్, మిల్టన్‌ల కవిత్వాన్ని మరచిపోయిన తరవాత మాత్రం జనం మీ పద్యాలు చదువుతారు. సరేనా?'

పట్టుడు. అలా క్రుంగి కృశించి చివరకి ఈ స్థితికి వొచ్చేను. ఈమధ్య మా నాన్న పోయేడు. దానితో ఇన్ని సంవత్సరాలూ నన్ను నీడలా అంటి ఉన్న అతడి సంరక్షణ వదిలిపోయింది. అప్పుడు జయపురంలోని ఒక ఆప్తమిత్రుడికి ఉత్తరం ఒకటి రాసేను. ఆ అమ్మాయి ప్రస్తుతం ఎక్కడుందో కనుక్కొని రాయమని. ఆవిడ ఇంకా ఈ ఊళ్లోనే ఉంది. అతడామెను రహస్యంగా కలుసుకుని నా ఉత్తరం అందించేడు. ఆమె నాకు జవాబు రాసింది. ఆ జవాబు రాసిన తర్వాత నా గుండెలు పగిలేలా ఏడ్చేను. నేను పారిపోయిన తర్వాత వాళ్ళ నాన్న పోలీసుకి రిపోర్టు ఇవ్వలేదు. కుటుంబ గౌరవానికి భంగం వస్తుందని ఆయన భయపడ్డాడు. ఆ అమ్మాయికి గుట్టుచప్పుడు కాకుండా పైఊరినుంచి ఒక బీద కుర్రాణ్ణి తీసుకొచ్చి పెళ్ళి చేసేసేడు. వాళ్ళిద్దర్నీ మరో ఊరులో కాపురం పెట్టించేడు. కాని విధి చాలా క్రూరమైంది. ఆ అమ్మాయికి పెళ్ళయిన ఆరు నెలలకి ఒక మొగ శిశువు పుట్టేడు. ఆమె భర్త ఆమెను నిలదీసేడు. ఆమె జరిగిన యథార్థం చెప్పింది. కాని అతడు నమ్మలేదు. యవ్వనపుమైకంలో ఆమె పూర్తిగా కళ్ళు తెరిచిచేసిన పాపం అని నిర్ధారణ చేసుకున్నాడు. తండ్రితో కలిసి ఆమెకూడా తనని మోసం చేసిందనుకున్నాడు. అప్పుడతడామెకు విధించిన శిక్ష ఏమిటో తెలుసా? ఆమెను తీసుకొని జయపురం వచ్చేడు. ఈ ఊళ్ళో కాపురం పెట్టేడు. ఆమెను బొట్టు పెట్టుకోనివ్వడు. గత అయిదు సంవత్సరాలూ ఆమె భర్త ప్రేమకి దూరమై జీవచ్ఛవంలా తయారయింది. ఆమె తండ్రిమీద అతను తీర్చుకున్న పగ అది. అల్లారుముద్దుగా పెరిగిన ఒకే ఒక కూతురు బ్రతుకిలా బూడిదపాలవడంచూసి ఆమె తండ్రి గుండెజబ్బుతో మంచమెక్కేడు. ఇప్పుడామెకు జీవితం మీదే విరక్తి పుట్టింది. ఈ నరకంనుంచి విముక్తి పొందాలంటే ఒకటే మార్గం. ప్రాణత్యాగం చేసుకోవడం. కాని ఏ పాపమూ ఎరుగని తన కుర్రవాడి గతిఏమిటి? అందుచేత చేసిన పాపానికి నేను నిజంగా పశ్చాత్తాపపడితే ఈ ఆఖరి ఉపకారం తనకి చేసిపెట్టమంది. అదేమిటంటే నా వెంట ఆ కుర్రవాణ్ణి తీసుకొనిపోవడం. అప్పుడామె నిశ్చింతగా ప్రాణాలు వదలగలదు." ఆయాసంతో రావు వెనక్కి చేరబడ్డాడు. కాస్సేపు పోయేక మళ్ళీ మొదలుపెట్టేడు.

"నాకీ జీవితం మీద ఏనాడో రోత పుట్టింది. అందుచేత ఇప్పుడు ఆ కుర్రవాణ్ణి మద్రాసు తీసుకొనిపోతాను. వాడికి నా ఆస్తి అంతా రాసేసి అప్పుడు తేలిగ్గా నా ప్రాణాలు వదుల్తాను. నాకిప్పుడొక్కటే భయం పట్టుకుంది. అంతవరకు నేను బ్రతికి ఉండగలనా లేదా అని! చూడండి. నా కళ్ళు అప్పుడే

తిరుగుతున్నాయి. కడుపులో ఏదో బాధగా ఉంది."

"బుచ్చీ! కారు సైడుకి తీసుకెళ్ళి ఆపు" అన్నాడు చిట్టిబాబు. కారు ఆగింది.

"చూడు తమ్ముడూ! ఘాటీ ప్రయాణంవల్ల నీకు తిప్పుతోంది. అంతేగాని నీ ప్రాణం ఏమీ పోవడం లేదు. కిందకి దిగి శుభ్రంగా వాంతి చేసుకో. అంతా సర్దుకుంటుంది." అని రావుని కిందకు దింపేడు చిట్టిబాబు. పది నిమిషాల తర్వాత రావు తిరిగి వచ్చేడు. కారులోంచి వాటర్ బాటిల్ తీసి "ఇందులో నీరు పుక్కిలించి మొహం కడుక్కో" అన్నాడు చిట్టిబాబు. తర్వాత "ఎలాగుంది?" అన్నాడు.

"కాస్త సర్దుకుంది" అన్నాడు రావు.

"ఇహ లోపలికి పద. లేకపోతే ఈ జల్లుకి జలుబు చేస్తుంది."

రావు నుదుటిమీద చెయ్యి వేసేడు. చల్లగా ఉంది.

"చూసేవా? టెంపరేచరు కూడా తీసేసింది. నీకు చావేం వొచ్చిందయ్యా? పూలరంగడిలా ఉన్నావు. ఆ గుంటు చూపుకెలా ఉంటుంది? అదే! నీ అమ్మాయి!"

"గులాబి పువ్వు ఎలా ఉందంటే ఏమిటి సమాధానమివ్వమంటారు?"

"భేష్! ఇంకేం? మరేమీ ఆలోచించకు. ఆ అమ్మాయినీ, కుర్రాణ్ణి తీసుకొని మెడ్రాసు ఉడాయించేయి. ఇదుగో! కావలిస్తే నేనూ బుచ్చి మిమ్మల్ని విజయనగరం దాకా దిగబెట్టి మెడ్రాసు మెయిలెక్కించేస్తాం. ఏమంటావు బుచ్చి?"

"ఓ అలాగే!" అన్నాడు బుచ్చి.

"ఏమన్నారు?" అన్నాడు రావు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి.

"ఏం నీకు చెముడా?" అన్నాడు చిట్టిబాబు,

"మరి ఆమె భర్త సంగతి?"

"ఆ దౌర్భాగ్యుడి గొడవనీకెందుకు? అయిదు సంవత్సరాలు దాన్ని సుఖపెట్టలేని చవట నా పెళ్లాం ఎవడితోనో లేచిపోయిందోయ్ అని ఏడుస్తూ కూచుంటాడా దీని పీడ

● రాబర్ట్ బ్రౌనింగ్ కవిత్వమంటే చెవికోసుకునే కొందరు మిత్రులు ఒకసారి అతనిదగ్గరికెళ్ళి ఒక పద్యంలో కొన్ని లైన్లు తమకు అర్థం కాలేదని, వివరించమని కోరారు.

బ్రౌనింగ్ ఆ పద్యం మళ్ళీమళ్ళీ చదివి "సారీసార్. ఆ లైన్లు రాసినప్పుడు నాకూ, దేవుడికే అర్థం తెలుసు, ఇప్పుడు దేవుడికొక్కడికే తెలుసు" అన్నాడు.

విరగడై పోయిందనుకుంటాడు. ఏమంటావు బుచ్చీ?'

'కరెక్ట్!' అన్నాడు బుచ్చి

రావుచప్పున లేచికూర్చున్నాడు. 'మీ కోటు జేబులోని మందు ఏమైనా మిగిలిందా?' అన్నాడు.

'ఇదుగో!' అని సీసా అందించేడు చిట్టిబాబు. సీసా ఎత్తి రెండు గుక్కలు లోనికి పోనిచ్చేడు రావు. చిట్టిబాబు ఇచ్చిన సిగరెట్టు ముట్టించి లోపలికి దమ్ము పట్టి ముక్కు లోంచి పొగ వదిలేడు. కారు హుషారుగా ముందుకు సాగింది. చలి బాధకి తట్టుకోలేక చుట్టూఉన్న కొండలు దట్టమైన మేఘాల్ని కప్పుకున్నాయి. కొండ మీద వాగొకటి యవ్వనపు పొంగుతో గంతులేస్తూ గలగలమని నవ్వుతోంది.

'అహా! ఈ ప్రకృతి సౌందర్యం ఎంత రమణీయంగా వుంది!' అనుకున్నాడు సుధాకరరావు.

కొండల్లోంచి కిందికి దిగి జయపురం ఊరి పొలిమేరల్ని సమీపించింది కారు. 'డిపోలోకి పోనియ్' అన్నాడు చిట్టిబాబు. మధ్యాహ్నం రెండుగంటల సమయం. కాని కారు మబ్బులమూలంగా కాలం తెలియడంలేదు. చిట్టిబాబు కలప డిపోకి ఒకవైపున అవుట్‌హౌస్ ఒకటుంది. అక్కడ కారు ఆపేడు బుచ్చి. ముగ్గురూ కారుదిగేరు. జేబులోని తాళం చెవితో అవుట్‌హౌస్‌కి వేసి

ఉన్న తాళం తీసేడు చిట్టిబాబు. ఒక చావడి, గది, బాత్ రూం వున్నాయి ఆ యింట్లో. ముగ్గురూ చావడిలోఉన్న కుర్చీలలో కూర్చున్నారు.

'ఆ బాత్‌రూంలోకి వెళ్ళి గడ్డం గీసుకో. తర్వాత రెస్టు తీసుకో. చీకటిపడ్డాక మొఖం కడుక్కొని, బాగా ముస్తాబై టిప్‌టాప్‌గా తయారైవెళ్ళు. ఆ మొగుడి సంగతి ఏమని రాసింది ఉత్తరంలో?' రావు నడిగేడు చిట్టిబాబు.

'అతను ఊళ్ళో ఇవాళ ఉండడు అని ఉత్తరంలో రాసింది' అన్నాడు రావు.

చీకటి పడింది. రావు వెళ్ళి సుమారు ఒక గంట కావస్తోంది. కాలుకాలిన పిల్లిలాగు అటూ ఇటూ తిరుగుతున్నాడు చిట్టిబాబు. సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తున్నాడు. 'ఏడీ మనవాడు? ఇంకా రాడేం? కొంపతీసి వీళ్ళిద్దరూ వస్తూంటే తోవలో ఎవరైనా పసికట్టి పట్టుకున్నారా ఏమిటి?'

బుచ్చి ఒక సోఫాలో తీరికగా కూర్చొని ఈ హడావిడంతా చూస్తున్నాడు 'నువ్వెందు కలా మధ్య కంగారు పడతావ్? చీకటి! పైగా చిటపటమని చినుకులు. ఎవరు పోలుస్తారు లెద్దూ! అదుగో వస్తున్నాడు' అన్నాడు రోడ్డు వైపు చూసి.

కాని రిక్షాలో సుధాకరరావు ఒక్కడే ఉన్నాడు. రిక్షాడబ్బులిచ్చి తలవంచుకొని తాపీగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చేడు.

'ఏమయింది?' అన్నారిద్దరూ ఒక్కసారిగా. అతడొక వేడి నిట్టూర్పు విడిచి 'రానంది' అన్నాడు ఒక సోఫాలో కూలబడుతూ.

"నా కా ఉత్తరం రాసేక తన తెలివి తక్కువ తనానికి విచారించిందట. జీవితానికి ఎన్నడూ భయపడి పారిపోకూడదంది. తన ఆత్మహత్య ప్రయత్నం మానుకుంది. ఏనాడైనా తనభర్త తనవైపు మొగ్గుతాడేమో అన్న ఒక్క ఆశతోనే జీవితం అంతా గడిపేస్తానంది. ఇంకో విషయం చెప్పింది. అతణ్ణి ఎంతో గాఢంగా ప్రేమించిందట. అతడామెను ఈ కారణంచేత తృణీకరించినా, మనిషిలో ఉదాత్తత ఉందంటుంది, నేనంటే అసహ్యం తప్ప మరో భావన లేదంది. కాని నా స్థితినిచూసి జాలిపడింది. నన్నూ వెర్రి మొర్రి ఆలోచనలు పెట్టుకోక ఎవరినైనా పెళ్ళి చేసుకొని సుఖపడమంది' కన్నీరు రుమాలుతో ఒత్తుకున్నాడు రావు.

'మరి కుర్రవాడి సంగతి?'

'తను బ్రతకదలచుకున్నప్పుడు కుర్రవాడి ప్రసక్తి మరి ఎక్కడుంది? మేమిద్దరం మాట్లాడుతున్నంతసేపూ వాడు తల్లిని చుట్టుకొని కూర్చున్నాడు. అప్పుడే అనుకున్నాను, వీళ్ళిద్దరూ వేరు కావడం అసాధ్యం అని.'

చాలా సేపటివరకు ఎవరూ మాట్లాడలేదు. చివరకి చిట్టిబాబు అన్నాడు. 'అయితే మీ రిప్పుడేం చేస్తారు?'

'భయపడకండి. నేను మరి చావను. ఈ ఒక్కరోజు పరిచయం లోనూ మీరు నాకు జీవితం మీద ఆశ మళ్ళీ కలిగించేరు. ఆమె జీవితం లోని అర్థాన్ని నాకు బోధపరిచింది. మీ ఇద్దరికీ ఆజన్మాంతం కృతజ్ఞుణ్ణి. రేపే తిరిగి మద్రాసు వెళ్ళిపోతాను.'

'సరే రేపటిదాకా మీ రిక్కడే ఉండండి. మేం ఇళ్ళకి పోతాం. మళ్ళీ రేపు పొద్దున్న కలుద్దాం' అన్నాడు చిట్టిబాబు.

'అలాగే థేంక్ యు వెరిమచ్.'

'దానికేం లెండి! పద బుచ్చీ!'

ఇద్దరూ కారులో కూర్చున్నారు. 'నన్ను మార్కెట్టులో దింపేయ్' అన్నాడు బుచ్చి. బుచ్చిని మార్కెట్టులో దింపేసి కారులో వెళిపోయేడు చిట్టిబాబు. చినుకులు ఆగిపోయేయి. మబ్బులు చెదిరి వెన్నెల ఊరంతా చల్లగా పరుచుకుంది. నీటి గాలి గిలిగింతలు పెడుతోంది. సంపెంగ పువ్వుల దండొకటి మార్కెట్టులో కొని ఇంటివైపు దారితీసేడు బుచ్చి.

తలుపు తట్టేడు. అతడి భార్య తలుపుతీసి బుచ్చిని చూసి నిర్ఘాంతపోయింది. 'మీరా! వారం రోజుల తర్వాత వస్తానన్నారు?' అంది ఆశ్చర్యంగా.

'విశాఖపట్నం ప్రోగ్రాం కేన్సిల్ అయిపోయింది. తిరిగి వచ్చేసేం. అదేమిటి, మొగుడింటికొస్తే ఇలాగే నేమిటి స్వాగతం ఇవ్వడం? మదుటను బొట్టేదీ? అ మాసిన చీరేమిటి? తలేనా దువ్వుకున్నావు కావు, నీకోసం సంపెంగ పువ్వులు తెచ్చేను. మన బాబేడీ? అరె! ఏడుస్తున్నావా? ఎందుకూ?'

□□□

(గత సంచిక తరువాయి)



యద్దనపూడి సులోచనారాణి

పెళ్ళి నాలుగురోజుల్లోకి వచ్చింది. కాని యింట్లో యెవరికీ సంతోషమే లేదు. ఎవరని చూసినా ఏదో ముంచుకుపోయినట్టు వుండే వాళ్ళు. చివరికి ఆరోజు గోపాలానికి అక్క సంగతి యేదో తెలిసిపోయిందిట. ఈ పెళ్ళి చేసుకోను, మీరు నన్ను మోసం చేశారు అని పేచీ పెట్టాడు. నాన్నగారు అక్కని పిలిచి గోపాలాన్ని ఒంటరిగా కలుసుకుని ఇదంతా అబద్ధం అని బుకాయించమని, మంచిమాటల్తో లొంగతీసుకోమని చెప్పారు. అక్క గోపాలాన్ని కలుసుకుంది. కాని నాన్నగారు చెప్పినట్టు చేయలేదు. నిజం ఒప్పుకుని అందులో తన తప్పేం లేదని, అర్థంచేసుకుని వివాహం చేసుకుంటే ఆజన్మాంతం అతనికి కృతజ్ఞురాలిగా వుంటానని, యీ అవమానం నుంచి రక్షించి పుణ్యం కట్టుకోమని చెప్పిందిట. గోపాలం అప్పటికి సరేనని తలూపి సరాసరి నాన్నగారి దగ్గరకివచ్చి అక్క యేం చెప్పింది— ఏమి అడిగింది అంతా బైటపెట్టి ఈ పెళ్ళిచేసుకోను అని ఖచ్చితంగా తిరస్కరించి వెళ్ళిపోయాడు. నాన్నగారు ఇది విని మండిపడిపోయారు. ఆగ్రహం పట్టలేక అక్కడే హాల్లో ఉన్న హంటర్ తీసుకుని అక్క గదిలోకి పెద్దపెద్ద అంగ లేసుకుంటూ వెళ్ళారు. నేను కూడా వణికిపోతూ నాన్న వెనకే పరుగెత్తాను. అక్క గదిలో కిటికీ దగ్గర నిలబడి బైటకి చూస్తోంది.

'సంధ్యా! గోపాలంతో నువ్వేం చెప్పావు?' అన్నారు.

వులిక్కిపడి వెనక్కు తిరిగిన అక్క నాన్నగారిని చూస్తూ నిలబడిపోయింది.

'చెప్పు. నేను చేయమన్నది యేమిటి? నువ్వు చేసింది యేమిటి?' దగ్గరగా వెడుతూ అన్నారు.

'నాన్నగారూ! నన్ను-నన్ను-క్షమించండి-' సంధ్య వాక్యం పూర్తి కాకముందే కెవ్వుమంది. నాన్నగారి చేతిలో హంటర్ సంధ్య ఒంటిమీద ఛెళ్ మంది. నేను భయంతో కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

'నిన్ను-నిన్ను క్షమించాలా?

నా పరువు ప్రతిష్ఠ గంగలో కలిపి నందుకా ?-"

మాటల్తోపాటు వెంట వెంట దెబ్బలు కూడా సంధ్య వీపుమీద పడ్డాయి. అక్క నిలబడలేక ప్రక్కగా వున్న మంచంమీద కూలబడి వెంటనే బోర్లా పడిపోయింది.

నేను బిగ్గరగా నన్ను కొట్టినట్టే యేడవటం ప్రారంభించాను. ఆయా, దాదా పరుగెత్తుకొచ్చారు. ఆయా నన్ను తీసుకుంది. దాదా నాన్నగారిని తోసేసి లోపలికి అక్క దగ్గరికి పరుగెత్తాడు. నేను ఆయాకి కరుచుకుపోయాను. నాన్నగారు యింకా సంధ్యని యేవేవో అంటూ కొడుతూనే వున్నారు. దాదా అడ్డువచ్చాడు. నాన్నగారు ఆ కోపంలో దాదాని కూడా కొట్టారు. దాదా యేడుస్తూ "కొట్టండి సాబ్. కొట్టండి. మీ కసి తీరా కొట్టండి - కాని అమ్మాయిని మాత్రం-"

ఆయా నన్ను వదిలించుకుని లోపలికి వెళ్ళి నాన్నగారి చెయి గట్టిగా పట్టుకుని "సంధ్య మీ కూతురుకాదు ఇకనుంచి మా కూతురు. అమ్మాయి ఒంటిమీద మరో దెబ్బ పడితే నేనుకూడా వూరుకోను. మీ కిష్టం లేకపోతే సంధ్యని తీసుకుని మేం మా ఊరు వెళ్ళిపోతాం" అంది బిగ్గరగా. నాన్నగారు ఏమనుకున్నారో ఏమో హంటర్ విరిచి అక్కడ పారేసి వెళ్ళిపోయారు.

ఆయా అక్కదగ్గర కెళ్ళి పక్కన కూర్చుని "సంధ్యా! నా తల్లీ-" అని పిలుస్తూ ఒళ్ళోకి తీసుకుంది. సంధ్య నోట్లోంచి ముక్కులోంచి రక్తం కారుతోంది. స్పృహకూడా వున్నట్టు లేదు. దాదా పరుగెత్తికెళ్ళి నీళ్ళు తెచ్చాడు. ఆయా గుడ్డ నీళ్ళతో తడిపి రక్తం అదీ తుడిచింది.

"డాక్టర్ని పిలవమంటావా ?" అన్నాడు దాదా.

"వద్దు. నువ్వెళ్ళి అయనేమయారో చూడు-" అంది ఆయా. దాదా గదిలోంచి నాన్నగారిని చూడటానికి వెళ్ళిపోయాడు.

నాన్నగారు యెక్కడికి వెళ్ళారో తెలియదు. ఆ రాత్రి అంతా యింటికి రాలేదు. మర్నాడు పగలల్లా రాలేదు. దాదా, ఆయా యిద్దరూ ఖంగారుపడ్డారు. కానీ ఆ సాయంత్రానికి యింటికి తిరిగి వచ్చారు. మనిషి మామూలుగానె వున్నారు. అలగ్నానికే యెవరినైనా తీసుకొచ్చి పెళ్ళిచేయాలని విషయం అంతా చూశారు. కానీ సాధ్యంకాలేదు. పెళ్ళి ఆగిపోయింది. విషయం అంతా బైటికి పొక్కిపోయింది. అందరూ మమ్మల్ని వెలివేసినట్టు చూడసాగారు. అక్క పూర్తిగా తన గది వదిలిరావటం మానేసింది. ఒకటి రెండుసార్లు చచ్చిపోవటానికి ప్రయత్నిస్తే వెంకేసీడలా ఉన్న

ఆయా ముందే కనిపెట్టేసి కేకలేసి తిట్టింది. నాన్నగారు తర్వాత సంధ్యని యేమీ అనలేదు. కాని మాట్లాడేవారు కాదు, పిలిచేవారు కాదు. నాన్నగారు తనతో మాట్లాడటం లేదని, పిలవటంలేదని అక్క కుళ్ళి యేడ్చేది. రాను, రాను అక్క ఆరోగ్యం బాగా దెబ్బతింది అసలు బ్రతకదనే అనుకున్నాం. చివరికి హాస్పిటల్లో వదిలేము, ఇరవై రోజులుండి వచ్చింది. తర్వాత కూడా ఆయా కంటికి రెప్పలా కాపాడటం వల్ల కాస్త కాస్త కోలుకోసాగింది. ఈలోగా రజాకార్ మూమెంట్ వచ్చింది. అందులో నాన్నగారు, దాదా, చనిపోవడం ఇదంతా జరిగింది."

వాసు ఆగి బుగ్గలమీదికి జారుతున్న కళ్ళనీళ్ళను తుడుచుకున్నాడు. మాధవ్ రెప్ప వాల్చకుండా వాసువైపు చూస్తున్నాడు. దృష్టి అక్కడున్నా అతని మనసు అక్కడలేదు. చెవులు ఆలకిస్తున్నా అర్థం గ్రహించడం మానేశాయి. మ్రాన్పడిపోయి నిలబడ్డాడు కాని మాధవ్‌లో యీ మార్పేమీ గ్రహించని వాసు యింకా చెబుతూనే వున్నాడు.

"తర్వాత—మా పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయినాయి. నాన్నగారు వున్నప్పుడు మేము బాగా స్థితిమంతుల్లా బ్రతికాం. కాని ఆయన పోయిం తర్వాత కొంత గవర్నమెంట్ లాగేసుకుంది. మిగతాది అప్పులాళ్ళు చుట్టేసి లాక్కుపోయారు. మా కన్ని అప్పులున్నాయని మా కంతవరకూ తెలియదు.

జరిగిన కథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష తరవాత స్వగ్రామం తిరిగి వస్తున్న మాధవ్, త్రోవలో బండి ఖరదలో కూరుకుపోగా నిస్సహాయంగా ఉన్న ఒక యువతికి సహాయం చేస్తాడు. ఆమె అతన్ని అపార్థం చేసుకుని, కొట్టి అవమానిస్తుంది. ఆ తరువాత కొన్నేళ్ళకు అదే యువతి అతనికి రైల్లో ఒంటరిగా తారసిల్లుతుంది. తల్లి మరణం, ప్రేమించిన సుధ మరొకరిని వివాహమాడడం మొదలైన సంఘటనలతో వికలమనస్కుడై ఉన్న మాధవ్ ఆ యువతిపై పూర్వపు కసితో మానభంగం చేస్తాడు. మరికొన్నేళ్ళకు ఒక పల్లెటూరులోని తన భవనానికి వెళ్ళిన మాధవ్‌కు ఆ యువతే మళ్ళీ తటస్థపడుతుంది. అనుకోకుండా తిరిగి తిరిగి ఎదురవుతూ తనపై విపరీత ద్వేషం చూపుతున్న ఆమెను ఎలాగైనా తనను ప్రేమించేలా చెయ్యాలని అతను ప్రయత్నిస్తాడు. వికలాంగుడైన ఆమె తమ్ముడు వాసుతో స్నేహం చేస్తాడు. ఒకనాడు వాసు తమ కథంతా చెబుతాడు.

'ఆయన పోయారు. మీ అప్పులతో మాకు సంబంధం లేదని' ఆయా అక్కని దబాయించమని చెప్పింది. కాని అక్క వినకుండా అన్నీ తీర్చేసింది. అక్క వంటిమీద కాస్తో కూస్తో మిగిలిన బంగారం మా తిండికి, నా మందు ఖర్చుకి సరిపోయింది. తర్వాత ఉద్యోగ ప్రయత్నం చేసింది. అక్కడ కూడా యీ సంగతి యెలా తెలిసిందో ఆఫీసులో వాళ్ళు నీచంగా ప్రవర్తించే వాళ్ళు. పరుషంగా మాట్లాడేవాళ్లు. తేలికగా చూసే వాళ్ళు. అక్క ఇది భరించలేక పోయినా ఎలాగో దిగమ్రింగుకుని వెళ్ళేది. చివరికి ఓ సారి అఫీసులో అక్కతోబాటు పనిచేసే అతను తనని పెళ్ళి చేసుకోమని, లేకపోతే ఇదంతా బైట పెట్టి ఉద్యోగం పోయేలా చేస్తానని బెదిరిస్తూ ఉత్తరం వ్రాశాడు. అక్క మర్నాడు ఉదయం వెళ్ళి తనే రిజైన్ చేసి వచ్చేసింది. ఇంకోసారి ప్రయివేట్ కంపెనీలో, అక్క చేరి రెండు నెలలన్నా కాకముందే కంపెనీ మానెజరు ఫైల్స్ తీసుకుని అక్కని గదిలోకి రమ్మని అసహ్యంగా ప్రవర్తించాట్ట. అప్పటికెలాగో తప్పించుకుని బైటపడి ఇంటికి పారిపోయి వచ్చి అక్క యేడుస్తూ కూర్చుంది. ఆయా బుజ్జగించి సంగతేమిటని అడిగితే జరిగిందంతా చెప్పింది. ఇలాంటి సంఘటన జరిగినప్పుడల్లా అక్క యెలాగో అయిపోయేది. మళ్లీ మామూలు మనిషి కావటానికి కనీసం వారం, పదిరోజు లయినా పట్టేది. ఈ సారి ఆయా అక్క యిక ఉద్యోగం చేయనవసరంలేదనిగట్టిగా చెప్పింది. మేం పుట్టి పెరిగింది హైద్రాబాదే. అప్పుడప్పుడు నాన్నగారితో, వెళ్ళి బొంబాయి మద్రాసు నాలుగు రోజులు చూసిరావడం తప్ప మాకెవ్వరూ తెలియదు. మాకు బంధువులు కూడా లేరు. నాన్నగారు నిజాం ప్రభుత్వం తరఫున పనిచేశారని తర్వాత తర్వాత మమ్మల్ని అందరూ అదోలా చూసేవారు. ఆయన వున్నప్పుడు కాస్త స్నేహంగా వుండే కుటుంబాలు కూడా తర్వాత ఆయన పోగానే వేలెత్తి చూపించి వెక్కిరించేవారు. చివరికి యెటూ తోచక ఆయా బలవంతం మీద యీ వూరు వచ్చి పడ్డాం. ఈ కూరగాయల వ్యాపారం గురించిన ఆలోచన కూడా ఆయాదే.

ఈ వూళ్ళో జోగులు కుటుంబం ఆయాకి దూరపుబంధువు లవుతారు. మా పరిస్థితులు సరిగ్గా వున్నప్పుడు మా దాదా వాళ్ళకి యేదో సాయం చేశాడట. అది మనసులో వుంచుకుని వాళ్లు ఆయా అడిగిన వెంటనే వాళ్ళకి వీలయినంతగా మాకు సాయపడటానికి ఒప్పుకున్నారు. మొదట మొదట్లో మమ్మల్ని విచి

త్రంగా, అసక్తిగా చూసేవాళ్ళు. ఆయా వాళ్ళని మంచి మాటలతో, చిన్న చిన్న సలహాలతో, బాగా కలుపుకుంది. అక్క అంటే వాళ్ళకి యెలాంటి అభిప్రాయం వుందో తెలియదు కాని గౌరవాభిమానాలు మాత్రం బాగానే వున్నాయి. వాళ్ళకి అవసరమైన ఉత్తరాలు వ్రాసి పెట్టడం, సాలెవాళ్ళకి చీరెల రంగుల్లో, డిజైన్లలో సలహాలు యివ్వటం చేయటం మొదలు పెట్టిన అక్క క్రమేపీ వాళ్ళతో కలిసిపోయింది. మమ్మల్నికూడా ఇప్పుడు వాళ్ళలో ఒకళ్ళగా ఆదరిస్తున్నారు. మంచి చదువు సంధ్యలు వచ్చునని మేమంటే గౌరవంతో కూడిన భయంకూడా కాస్త వుంది.'

వాను చివరి చివరి మాటలు మాధవ్ చెవులకి యెక్కనేలేదు. అతను హఠాత్తుగా, సిగ్గుతో, అభిమానంతో, యేం చెయ్యలేని అశక్తతో అఖాతాల్లోకి జారిపోసాగాడు. భగవాన్! అనుకోకుండా ఒక్క క్షణం తను పశువులా మారి బలహీనతకి బానిస అయితే దాని పరిణామం సంధ్య జీవితం మీద ఇంత భయంకరంగానా? ఇంత వరకూ కేవలం ఆర్థిక స్థితి చితికి పోయిందని, ఒకవేళ పెళ్లిచేసుకున్నా ఆ రాబోయే అతను అవిటి వాడయిన వానుని అపేక్షగా చూస్తాడా, తనని చూడనిస్తాడా అనే భయంతో విరక్తి కల్పించుకుని, సంధ్య యీ మారుమూల గడుపుతోంది అనుకుంకున్నాడే కాని, దీని వెనక యింత భయంకరమైన గాథవుందని, దానికి మూలం తానని ఒక్కసారి కూడా ఆలోచించలేకపోయాడు. సంధ్యకి తనమీద ద్వేషం వుంటే వుండనీ! మాధవ్‌కి ఆ సమయంలో రెక్కలు కట్టుకుని యెగిరివెళ్ళి సంధ్య ముందు మోకాళ్ళమీద కూలబడి 'సంధ్యా! నన్ను క్షమించు. నా కేదయినా శిక్ష విధించు. ఈ పాపం అంతా నాది. ఈ దోషం నాది సంధ్యా' అని వేడుకోవా లనిపించింది.

'అక్క అప్పటినుంచి పూర్తిగా మారిపోయింది అప్పుడప్పుడు నన్ను దగ్గరకు లాక్కుని 'కేవలం నీ కోసం బ్రతుకుతున్నాను. వానూ! అది కూడా నువ్వు మామూలు మనిషివి కావుగాబట్టి' అంటూ యేడుస్తుంది. నాకూడా యేడుపువస్తుంది. మీరే చెప్పండి. జీవితంలో తన తప్పేమీ లేకుండా అన్యాయంగా యింత క్రూరమైన శిక్ష అనుభవించిన యే ఆడపిల్ల మనసయినా యింకెలా వుంటుందో! ఇంకా మా సంధ్య చాలా నయం. 'అంతా నా దురదృష్టం' అని యేడుస్తుంది తప్ప యెవర్నీ వల్లెత్తి మాట అనదు. ఇదంతా మీ కెందుకు చెప్పానంటే మీరు చాలా మంచివారు. అది గుర్తించకపోవటం అక్కతప్పే కాని దాని కారణం యిది. అక్క మిమ్మల్ని నిర్లక్ష్యంగా చూస్తోందని బాధపడకండి. అభిమానంతో ఎప్పు

రైనా దానిమీద కోపంతో మా యింటికి రావటం మానేస్తారేమో నని భయం నాకు. సంధ్యని మీ చెల్లెలిగా చూడండి. చూసి మన్నిస్తారు కదూ!—' కళ్ళెత్తి దీనంగా చూస్తూ అడిగాడు వాను. మాధవ్ చప్పున మొహం తిప్పేసుకున్నాడు. అతని మనసు వేయి రంపాలతో కోసినట్టుగా వుంది.

'చెప్పండి అక్కమీద ఎప్పుడూ కోపం తెచ్చుకోరుగదూ!' జాలిగా అడిగాడు.

'తెచ్చుకోను వానూ! తెచ్చుకోను. నువ్వు నా కళ్లు తెరిపించావు.'

'సంధ్యమీద మీరు చెడ్డ అభిప్రాయం ఏర్పరుచుకోవటం నేను భరించలేను.' వాను కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'లేదు వానూ! ఇంకెప్పుడూ యికమీదట అలా ఆలోచించను అని చెప్పాగా. కానీ నువ్వు కూడా ఒకటి వాగ్దానం చేయాలి నాకు.'

'ఏమిటది? చెప్పండి'.

'నువ్వుకూడా సంధ్యని బాధపెట్టే పనులు చేయగూడదు. కనీసం మాటలు కూడా అనకూడదు. మనిద్దరం కలిసి సాధ్యమైనంత వరకూ సంధ్యని సంతోషపెట్టే మార్గం ఆలోచిద్దాం'


వాను కళ్ళు సంతోషంతో మెరిశాయి.

'ఒట్టు. నే నింకెప్పుడూ అక్కని యేమీ అనను' అన్నాడు చెయి చాచుతూ.

'ఒకవేళ-ఒకవేళ సంధ్య కిష్టం లేకపోతే మీ యింటికి రావటం కూడా మానేస్తాను.'

వాను ఆదుర్దాగా చూశాడు. మాధవ్ వాను తలని దగ్గరకు తీసుకుని జుట్టు సరి చేస్తూ 'ఇంకోటి కూడా నువ్వు మర్చిపోవద్దు. ఎలాంటి పరిస్థితులలోనూ నా దగ్గర సహాయం తీసుకోవటం మానకూడదు. సాధ్యమైనంత వరకూ సంధ్యకి మెల్లిగా మంచి మాటలతో నచ్చచెప్పటానికి ప్రయత్నించు.'





వాసు అలాగే అన్నట్టు చూశాడు.

"నేనీసారి వూరు వెళ్ళినప్పుడు మంచి డాక్టర్ని తీసుకొచ్చి నిన్ను చూపిస్తాను. ఆపరేషన్ వల్ల యేదయినా నీకు ఉపయోగం వుంటుంది అంటే, యెంత డబ్బయినా సరే నేను చేయిస్తాను."

వాసు కృతజ్ఞతని అణచుకోలేక మాధవ్ గుండెల్లో ముఖం దాచుకున్నాడు. అతని కళ్ళనిండా నీళ్ళు వుబుకుతున్నాయి. మాధవ్ లాటి మానవోత్తములు యెక్కడైనా ఉంటారా అసలు!

"ఈ సంగతులన్నీ మన మధ్యనే వుండిపోవాలి. ఈరోజునుంచి నీ కేలోటూ రాకుండా చూసే బాధ్యత నాది. సరేనా?" వాసు తల నిమురుతూ అన్నాడు.

పూర్తిగా చీకటి పడిపోయింది. ఆకాశంలో అప్పుడే వుదయిస్తున్న చంద్రుడు అభాగ్యుడు అందుకోలేని స్వర్గంలా వున్నాడు. ఇంటికి వెళ్ళబోయేముందు, వెళ్ళగానే సంధ్యని పిలిచి క్షమాపణ కోరుకునేట్టు, వుత్తరం సంగతి యెత్తకుండా వుండడానికి వాసుదగ్గర మాధవ్ వాగ్దానం తీసుకున్నాడు.

ఆ రాత్రి అతనికి నిద్రే పట్టలేదు. గదిలో అటూ యిటూ తిరుగుతూ గడిపాడు. వాసు నోటినుంచి విన్న విషాదగాధ అతన్ని వెర్రివాడిని చేస్తోంది. బాధతో ముక్కలవుతున్న అతని మనసు శక్తి అంతా కూడదీసుకుని శూన్యంలోకి చేతులు జాపి "సంధ్యా! సంధ్యా నా దగ్గరకురా! కూలదోసిన నీ జీవితసౌధాన్ని నన్ను సరిచేయనీ! నాకి అవకాశం కల్పించి నన్ని నరకంనుంచి తప్పించు. నన్ను నీ దగ్గరకు రానీ!" అని ఆక్రోశించసాగింది. ఎన్నిరోజులు పట్టనీ! ఎన్ని యుగాలుకానీ - సంధ్య జీవితంలోకి యెలాగైనా ప్రవేశించి మళ్ళీ బ్రతుకుమీద మమకారాన్ని కల్పించాలి. ఇందులో విజయం లభించనీ, లభించకపోనీ. కంఠంలో వూపిరి వున్నంతవరకూ ప్రయత్నంచేసి తీరాలి. ఈ ప్రయత్నంలో తన జీవితకాలం అంతా సరిపోయినా సరే! వృథాగా గడిచిపోయినా సరే! మాధవ్ లెఖ్ఖచేయదల్చుకోలేదు. తన వ్యక్తిత్వానికి యిది సవాలుగా తీసుకున్నాడు.

24

మాధవ్ యెప్పుడో యధాలాపంగా మాటవరసకి యిచ్చిన ఆహ్వానాన్ని పురస్కరించుకుని ఓ రోజు ఉదయం సుధ, భాస్కరం వూడిపడ్డారు. ఇద్దరు పిల్లలతల్లి అయిన సుధ పచ్చటి రంగుతో మిసమిసలాడుతూ వుంది.

"మావారు ఓ కేస్‌ని గురించి స్టడిచేయాలి బావా! అక్కడవాళ్ళు, వీళ్ళు రావటంతో క్షణం తీరిక చిక్కడంలేదు. ఇక్కడైతే ప్రశాంతంగా ఉంటుందని బలవంతంగా నేనే లాక్కొచ్చాను" అంది సుధ.

"పల్లెటూరిళ్ళు అంటే యే గబ్బిలాల కొంపో అనుకున్నాను. ఇల్లు బాగానే ఉందే!" విశాలంగా వున్న గదుల్ని పరిశీలనగా చూస్తూ అన్నాడు భాస్కరం.

మాధవ్ వాళ్ళున్న రెండు రోజులూ వాసూ వాళ్ళింటికి వెళ్ళలేదు. బంధువులు వచ్చారని, బిజీగా వున్నానని వుత్తరం వ్రాసి నౌకరు చేత వాసుకి తెలియజేశాడు. అతను అక్కడికి వెడితే యెవరు యేమిటి అని ఆరా వస్తుందని అతనికి భయం వేసింది.

మూడోరోజు మధ్యాహ్నం-నిద్ర లేవగానే బద్ధకంగా అన్పించి ఆ మత్తు వదలటం కోసం మామిడి చెట్లమధ్య తిరగడానికి వెళ్ళాడు. మాధవ్ ఆవరణకు, సంధ్యా వాళ్ళింటికి సరిహద్దుగా అడ్డుగా చిక్కగా ముళ్ళకంప వుంది. దాన్ని పత్తుగా అల్లుకున్న అడవితీగెలున్నాయి. పరధ్యానంగా నడుస్తున్న మాధవ్ మాటలు విన్పించడంతో ఆగిపోయాడు. ఇద్దరు మనుష్యులు యేకాంతంగా మాట్లాడుకుంటున్నారు అంటే వంటరితనం అభిలషిస్తున్నారన్నమాట. దానిని తెలిసి కూడా భంగపరచటం మర్యాదస్తుల లక్షణం కాదు. మాధవ్ వెళ్ళిపోదామని రెండడుగులు వెనక్కు వేశాడు. అయినా యిక్కడ అంత వంటరిగా మాట్లాడుకునే వాళ్ళు యెవరు? సరిగ్గా అతని అనుమానం తీర్చటానికే అన్నట్టు "నా మాట విను సంధ్యా? నీకీ ఖర్మమేమిటి? నాతో వచ్చెయ్యి. కంటికి రెప్పలా చూసుకుంటాను." అని విన్పించింది. అది భాస్కరం గొంతు. మాధవ్ చటుక్కున ఆగిపోయాడు. భాస్కరానికి సంధ్యకి యెలా పరిచయం? అతను ఊపిరి బిగబట్టి వినసాగాడు.

"ఏమంటావ్?" రెట్టించాడు భాస్కరం.

"క్షమించు భాస్కరం! ఇప్పటికిది నువ్వు నాలుగోసారి అలా అడగటం. నేనక్కడికి వచ్చి ఏం చెయ్యాలి? యెక్కడుండాలి?"

"అది బొత్తిగా అర్థం లేని ప్రశ్న. నా దగ్గరుండువుగాని. నాయింట్లోనే వుంచుకుంటాను."

"భాస్కర్!"

"నా భార్య ఏమైనా అనుకుంటుందనేగా నీ భయం! అవన్నీ

● ఒక ఇంగ్లీషువాడికి బట్టతల వచ్చింది. అతడు తిరిగి శిరోజాలు రాబట్టుకోడానికి ఆస్తంతా ఖర్చు పెట్టాడట.

ఒక స్కాటిష్ వాడికి బట్టతలరాగా దువ్వెన కాస్తా అమ్మేశాడట.

— కాశీప్రసాద్.

నాకు వదిలేయ్... ...పెళ్ళిచేసుకుని యిద్దరు పిల్లలు పుట్టినంత మాత్రాన నేను సుఖంగా వున్నాననుకోకు. సుధ వచ్చిం తర్వాత నాకు బాగా కలిసి వచ్చిన మాట నిజమే. కాని సుధని నేనెప్పుడూ ప్రేమించలేదు. కాలేజీలో చదువుకునే రోజుల్లో నిన్ను యెలా ఆరాధించేవాడినో యిప్పుడు కూడా అలాగే ఆరాధిస్తున్నాను.'

'ఆ మాట అనేందుకు నువ్వు సిగ్గుపడాలి.'

'సిగ్గెందుకు? యథార్థం చెప్పినందుకా! అయినా సుధకి నేనేం లోటు చెయ్యటంలేదే! భర్తగా యివ్వవలసినవన్నీ యిస్తూనే వున్నాను.'

'అన్నీ అంటే?—'

'అంటే యేముంది? డబ్బు - హోదా, సుఖపడటానికి అన్ని విధాలా వసతులు - సంఘంలో పేరు ప్రతిష్ఠలు—'

'అంతకంటే ఆడదానికి యింకేమీ అవసరం లేదని నీ ఉద్దేశమా —'

'ఉన్నాయి. కాదనను. కాని ఆడవాళ్ళలో కూడా రకాలున్నారు. సుధ వాటితో తృప్తిపడే మనిషి—'

క్షణంసేపు నిశ్శబ్దం.

'నే వెడతాను. ఎవరైనా చూస్తే బాగుండదు.'

'ఇక్కడెవరు చూస్తారులే! మా ఆవిడ వాళ్ళ బావతో సరసాలుఆడుతూ వుండి వుంటుంది. ఆయనగారిని చూస్తే యీవిడగారికి ఒళ్ళు తెలియదు. నిజం చెప్పాలంటే-నీ దగ్గర దాపరికం యేమిటికాని, మా ఆవిడకి అసలు నా మీద ప్రేమలేదు. బావ మరదళ్ళిద్దరూ చిన్నప్పుడే పెళ్ళి చేసుకోవాలనుకున్నారట. ఈయనగారు జైలుకి వెళ్ళి కూర్చోవటంతో సుధ గాలివాటుగా నా దగ్గరకి కొట్టుకువచ్చింది.'

'జైలుకా?!'

'అవును. అతను చాలా గ్రంథసాంగుడు. నీకు తెలియదేమో!'

మాధవ్ పళ్ళు పటపట లాడినాయి. గుప్పెట్లుబిగించి బలవంతంగా ఉద్రేకం అపుకున్నాడు. రాస్కెల్! ఈ పాటునవెళ్ళి పళ్ళు రాలకొడితే!

'నేను వెడతాను భాస్కర్!'

'నా మాట విను. కాస్త ఆలోచించి చూడు.'

చాలా బాగా ఆలోచించుకున్నాను. ఈ పల్లెటూళ్ళో ఈ మారుమూల నాకు ప్రశాంతంగా వుంది. పెళ్ళి చేసుకోవాలి అనే కోర్కె లేదు నాకు. పదిమందిలో తిరగాలన్న ఉబలాటం అంతకంటే లేదు. ఈ మాత్రంగా యింకే ఒడిదుడుకులు లేకుండా నా జీవితం వెళ్ళిపోతే చాలు.'

'నువ్వు కావాలని యింత వైరాగ్యం తెచ్చిపెట్టుకోవాల్సిన ఖర్మమేమిటో నా కర్థంగాదు.'

'జీవితంలో యింకోసారి దెబ్బతింటే తట్టుకోలేనేమోననే భయం వల్ల.'

'బాగుంది. మనిషి అన్న తర్వాత కష్టసుఖాలనేవి అనేక రూపాల్లో వస్తూంటాయి.'

'నాకు వచ్చినటువంటి కష్టం ప్రపంచంలో యెప్పుడూ యే ఆడపిల్లకి వద్దు.' సంధ్య కంఠం వణికింది.

'ఎక్కడో పిచ్చిదానిలా వున్నావే! ఇప్పుడు బ్రతుకుతున్న వాళ్ళంతా హాయిగానే ఉన్నారంటావా? ఏదయినా ఒడిదుడుకు వస్తే ధైర్యంగా దాటాలి కానీ.'

'ఆ రెండూ నాకు లేవు.'

'జీవితాన్ని అసహ్యించుకుంటూ బ్రతకటంవల్ల ప్రయోజనం?—'

'అదే నాకూ తెలియదు. ఒక్కోసారి ఆలోచిస్తే నేనెందుకు బ్రతుకుతున్నానో నాకే తెలియదు. వాను లేకపోతే - వాడికి నా అవసరమే లేకపోతే—'

'వాడొకడు మధ్య. మెడకి గుదిబండ నీకు.'

'పొరబడుతున్నావు. ఈ ప్రపంచంతో నాకున్న ఒకే ఒక బంధం వాను.'

'ఏమిటో! నీ మాటల ధోరణే మారిపోయింది. చురుగ్గా తిరిగే ఆ మెరపుతీగె సంధ్యేనా అన్పిస్తుంది.'

'ఇప్పటికైనా అది అర్థం చేసుకుంటే సంతోషిస్తాను. వస్తాను భాస్కరం.'

'సాయంత్రం అలా యింటికేసి రావా?-'

'రాను.'

క్షణంసేపు నిశ్శబ్దం. మళ్ళీ సంధ్య గొంతుక వినిపించింది. 'భాస్కర్! ఒక్కటి మాత్రం నిన్ను వేడుకుంటున్నాను. మన పరిచయాన్ని గురించి దయవుంచి ఇక్కడెక్కడా బైటపెట్టవద్దు.'

'ఏం? అభిమానులెవరైనా యీర్ష్యపడి దూరం అవుతారని భయమా?'

'సరే నీ యిష్టం.' సంధ్య వెళ్ళిపోయినట్టు యెండుటాకుల గలగల వినిపించింది.

మాధవ్ చప్పున వెనక్కు తిరిగి యింటివైపు మళ్ళాడు.

25

తనంటే యెంత అసహ్యం వున్నా వానుకోసం సంధ్య రాజీ పడక పోదని మాధవ్‌కి తోచింది. సంధ్యలో పేరుకున్న యీ కాఠిన్యాన్ని సడలించాలంటే వాను ఒక్కడే ఆధారం. అందుకే మాధవ్ ఆ ఆధారాన్ని గట్టిగా పట్టుకున్నాడు. అతని పట్టుదల మహా చెడ్డది. ఏదయినా అనుకుంటే సాధించి పొంది తీరేవరకూ నిద్రపోడు. ఆశించింది లభించటం ఆలస్యం అయితే నిరాశతో కాళ్ళు బారచాచి ఆ ప్రయత్నంనుంచి విరమించుకునే మనిషి కాడు అతను. మాటికి మారు పాళ్ళు దృఢమైన

నమ్మకంతో చివరివరకూ ప్రయత్నం చేస్తూనే వుంటాడు. అందులో అలసటకాని విసుగుకాని వుండదు విరామం అసలే వుండదు తెలిసో తెలియకో తన మూలంగా సంధ్యకి తీవ్రమైన అన్యాయం జరిగింది. దాన్ని సరిదిద్దవలసిన బాధ్యత తనది అనుకున్నాడు. పరిస్థితులు వక్రించి వాడిపోయి నేలరాలి యెండిపోవటానికి సిద్ధంగావున్న సంధ్య జీవన లతని సరిచేసి ఆధారం అందిచ్చి నీళ్ళుపోసి మళ్ళీ అది కలకలలాడుతూ చిగురుతొడిగి పూలు పూసేలా చేయడం తన ధర్మం అని నమ్మాడు. దానికోసమే తీవ్రంగా ప్రయత్నం చేయసాగాడు. సంధ్యకి ఆనందం కలగాలంటే యే విషయం చేపట్టాలో సూక్ష్మగ్రహి అయిన అతని మనసు యిట్టే గ్రహించింది. యేనాటికైనా వాను ద్వారానే తను సంధ్యని గెలుచుకోగలగాలి.

వారం పదిరోజులు తిరగకముందే హైద్రాబాద్‌లో తనకు తెలిసిన వాళ్ళద్వారా ప్రయత్నించి స్పెషలిస్ట్‌ని తీసుకువచ్చి చూపించాడు. ఆయన వానుని పరీక్షచేసి అపరేషన్ చేస్తే తనకు కాలు సరిఅవచ్చునని, కానీ ఆరు యేడు వారాలు పూర్తిగా హాస్పిటల్‌లోనే చికిత్స కోసం వుంచాలని చెప్పాడు. సంధ్య ఆయా లిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

వాను అపరేషన్ గురించి ఒక నిశ్చయానికి రావటానికి దాదాపు నెలరోజుల పాటు తర్జన భర్జనలు జరిగాయి. అపరేషన్‌కి కావల్సిన ఖర్చు అంతా ప్రస్తుతం తను భరిస్తానని, తర్వాత వీలు వెంబడి తనకి తీర్చమని మాధవ్ సూచించాడు.

"అక్కా నీ యిష్టం. నువ్వు కాదంటే నేనేమీ అనుకోను." అన్నాడు వాను దిగులుగా, ఆయా కూడా వాను పక్షం వహించి వాదించటంతో చివరికి సంధ్య బలవంతాన "ఊఁ" అని అంగీకారం తెలపటం కంటే మరో గత్యంతరం లేక పోయింది.

ఆరోజే వాను వెళ్ళేది. మాధవ్ తనే స్వయంగా కారులో తీసుకు వెడుతున్నాడు. వెనక సీటులో వాను కోసం మెత్తని దిండ్లు పరిచి జాగ్రత్తగా తయారు చేశారు.

కారు వచ్చి యింటి ముందు ఆగింది, మాధవ్ దిగి లోపలికి— వచ్చేసరికి సంధ్య పాలిపోయిన ముఖంతో వానుచెయ్యి గట్టిగా పట్టుకుని నిలబడి వుంది ఆయా వానుకి కావాల్సిన ముఖ్యమైన సామానులు కారులో పెడుతోంది. మాధవ్ మెల్లగా మంచం దగ్గరకి వచ్చాడు.

"అక్కా! వెళ్ళనా?—" వాను సంధ్య ముఖంలోకి చూస్తూ అడిగాడు. సంధ్య నిశబ్దంగా వంగి వాను రెండు బుగ్గలమీద,, నుదురు మీద ముద్దు పెట్టుకుంది.

"ఛ! యేడవకు. నువ్వు ఏడుస్తే నాకు వెళ్ళాలనిపించదు." అక్కగారి చెంపలమీదకి జారుతున్న కన్నీళ్ళని తుడుస్తూ అన్నాడు

"అపరేషన్‌కి భయపడవుగా!—"

"ఉహూ! నీ కెందు కాభయం?"

"నువ్వు ఒకవేళ భయపడితే ధైర్యం చెప్పటానికి దగ్గర నేనుండనుగా! అందుకని—"

"నువ్వు లేకపోతేనేం?— మాధవ్ వున్నారుగా—!"

సంధ్య ముఖం ఈర్ష్యతో ముడుచుకుపోవటం వాను గమనించలేదు.

"అయినా చూడు. నేను నెల రోజుల్లో పరుగెత్తుకుంటూ రాకపోతే—" వాను వుత్సాహంగా అన్నాడు.

"నెల రోజులు!" సంధ్య మనసు బరువుగా మూలిగింది.

మాధవ్ 'టైమయింది' అంటూ వానుని రెండు చేతుల్తో లేపి కారు దగ్గరకి తీసుకు వెళ్ళాడు.

"నొప్పిగా వుందా?—" వాను నుదుటమీద పట్టిన చెమటను తుడుస్తూ అడిగాడు.

"ఉహూ. అయినా ఫర్వాలేదు." వాను మాధవ్ మెడచుట్టు చెయి వేస్తూ బలవంతంగా నవ్వాడు. అతను చూపుతున్న ధైర్యానికి, ఓర్పుకి అందరి కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి.

కారు బయలుదేరబోయేముందు మాధవ్ సంధ్యవైపు చూశాడు. సంధ్య చూపులు వాను ముఖంమీద నిల్చివున్నాయి. ప్రియాతి ప్రియమైన వస్తువునేదో దూరం చేసుకుంటూ ఆఖరిసారిగా మనసారా చూస్తున్న బాధ మనసులో మెలిదిరుగుతున్నట్టు కళ్ళు విషాదంగా వున్నాయి.

"రమ్మంటే రాలేదు. తను వచ్చినా బాగుండేది." అన్నాడు మాధవ్ బాధగా.

"ఎవరు? అక్క సంగతేనా మీరు చెప్పేది. రాకపోవడమే మంచిదిలెండి. ఒకవేళ నేను బాధ భరించలేక కేకలుపెట్టి ఏడుస్తే అది అసలే చూడలేదు." అన్నాడు వాను.

కారు దూరం అయిపోగానే శూన్యంలోకి చూస్తూ శిలాప్రతిమలా నిలబడిపోయింది సంధ్య. ఈ ప్రపంచంలో తనకు మిగిలిన కాస్త అనుబంధాన్ని మాధవ్ బలవంతంగా దూరంగా లాక్కుపోయి తనని ఒంటరిదాన్ని చేసేస్తున్నట్టు అన్పించసాగింది.

26

వానుని అపరేషన్ టేబిల్ మీదకి తీసుకు వెళ్ళటానికి సిద్ధం చేశారు. పైకి చెప్పకపోయినా భయంతో వాను ముఖం తెల్లగా పాలిపోయింది.

ప్రక్కనేఉన్న మాధవ్ వాను చేతిపట్టుకుని ప్రేమతో చూస్తూ "భయపడటంలేదుగా!—" అన్నాడు

'ఉహు, భయం దేనికి? అంతా సవ్యంగా ముగిస్తే మీ అందరిలా నేనూ బ్రతుకుతాను. లేకపోతే–లేకపోతే–ఇవిటి వాడిగా క్షణం క్షణం చస్తూ ఆ మంచంలో బ్రతికేకంటే ప్రాణం పోవటం–'

'హుష్ ఆలా అనకూడదు. ధైర్యంగా ఉండాలి.' వాసు నుదుటి మీద పడిన జుట్టుని సరిచేస్తూ అన్నాడు.

వాసు మాధవ్ చేతిని రెండు చేతుల్లో గట్టిగా పట్టుకుంటూ 'కాని ఆపరేషన్ టేబిల్ మీదకి వెళ్ళబోయేముందు మిమ్మల్ని ఒకటి అడుగుతాను మీరు వాగ్దానం చేయాలి.' అన్నాడు.

'ఏమిటది చెప్పు. ఎప్పుడన్నా నేను నీ మాట కాదన్నానా? –'

'అనలేదనుకోండి. కాని.' వాసు సందేహించాడు.

'చెప్పు వాసూ! –'

'ఒకవేళ – ఒకవేళ–నాకేదయినా అయితే–అయితే–అక్కని చూసే బాధ్యత మీది.'

మాధవ్ చేతివేళ్ళు ఆ మాటలు వింటూనే బిగుసుకున్నాయి.

వాసు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'మా సంధ్య ఒట్టి అమాయకురాలు. మీరు దాని కఠినత్వమే చూశారు కానీ–దాని మంచితనం చూడలేదు భగవంతుడు దాన్ని అన్ని విధాలా అన్యాయం చేశాడు. నాకేదయినా అయితే–సంధ్యని వంటరిగా నేను వూహించుకోలేను. దానికి ఏ లోటు రాకుండా మీరు చూస్తారా? –'

'ఇప్పుడవన్నీ యెందుకు వాసూ? –'

'చెప్పండి. నాకు నిశ్చింతగా వుంటుంది.'

'సరే అయితే–'

'ఊరికే అంటే కాదు. నా తల మీద చెయిపెట్టి చెప్పండి.'

'సరే. సరే–'


'కాదు ఒట్టు వేయాలి.'

'నీ మీద ఒట్టు. సరేనా?' వాసు తలమీద చెయిపెట్టి నవ్వబోయి కళ్ళు తడి అవటంతో చప్పున వాసు తలని గుండెల దగ్గరకు లాక్కుని ముఖం కన్పించకుండా చేసుకున్నాడు.

'మీ రెంత మంచివారు! సంధ్య ఎప్పటికైనా గుర్తించి తీరుతుంది మిమ్మల్ని.' వాసు అస్పష్టంగా అన్నాడు.

నర్స్ వాసుని తీసుకెళ్ళటానికి వచ్చింది. వాసు–మాధవ్ ఒకళ్ళని ఒకళ్ళు చూసుకుంటూండిపోయారు. వున్నట్టుండి వాసు హఠాత్తుగా మాధవ్ మెడ చుట్టూ చేతులు వేసి అతని గుండెల్లో ముఖం దాచుకుంటూ 'ఒకవేళ అంతా – అంతా సవ్యంగా జరిగితే నాకు మళ్ళీ స్పృహ రాగానే మొట్టమొదట మీరే కన్పించాలి' అన్నాడు.

(సశేషం)



"ఇకనేం! ఇంక ఆ అన్నయ్యగారు కాస్తా వచ్చిన తరవాత మేం కన్పించనే కన్పించం!"

భానుమూర్తి మాటలతో ఈ లోకంలోకి వచ్చిపడింది సుగుణ.

వెంటనే తన పరధ్యానానికి సిగ్గుపడి,

'ఇప్పుడే కాఫీ తెస్తానుండండి'

అంటూ వంటింట్లోకి పరుగెత్తింది.

● ● ●

పరంధామయ్యగారు ఆ ఊర్లో బ్రతికిచెడ్డవాడు. ఒకానొకప్పుడు ఒక్క వెలుగు వెలిగినా, పరంధామయ్యగారి భార్య మహాలక్ష్మమ్మ ఆ యింటినుండి ఎప్పుడైతే శాశ్వతంగా వెళ్ళిపోయారో అప్పుడే ఆ యింటి లక్ష్మికూడా ఆమెని అనుసరించింది. వెళ్ళుతూ వెళ్ళుతూ మహాలక్ష్మమ్మగారు పసికందులు రమణని, సుగుణని పెంచి పెద్దచేసి అభివృద్ధిలోకి తీసుకురావల్సిన భారాన్ని పరంధామయ్యగారికి విడిచి మరీ వెళ్ళారు.

ఆ పసికందుల పోషణలో భార్యా వియోగాన్ని మరవడానికి ప్రయత్నించేవారు పరంధామయ్యగారు. వారికేలోపం రాకుండా తల్లీ, తండ్రీ తానే అయి పెంచారు. వారు అడిగినదాన్ని ఎప్పుడూ కాదనలేదు. వారు కోరినదాన్ని తెచ్చివ్వడంలో ఒక్కొక్కప్పుడు తాహతుకు మించిన ఖర్చులే చేసేవారు. దాంతో పరిస్థితి మరింత చితికింది.

పిల్లలు పెరిగి పెద్దవారయ్యారు. ఆ అన్నా చెల్లెళ్ళ అన్యోన్యత చూసి పరంధామయ్యగారు తెగ మురిసిపోతూండేవారు. వారిద్దరు చెట్టాపట్టాలేసుకుని స్కూలుకు పోతూంటే, చనిపోయిన భార్య తనకు వప్పచెప్పిన పనిని సక్రమంగా నిర్వర్తించగల్గుతున్నాననే ఆత్మ సంతృప్తితో కళ్ళు తుడుచుకునేవారు పరంధామయ్యగారు.

పరంధామయ్యగారిల్లు ఊరిచివర్న ఉంది. అందుచేత రమణ, సుగుణలతో ఆడుకుందుకు జతగాళ్ళు ఎవ్వరూ వచ్చేవారుకాదు. వారిద్దరే ఒంటిగా ఆడుకునేవారు. రమణ కొద్దిగా బాధపడితే సుగుణ మనస్సు విలవిలలాడిపోయేది. వాడికి ఏదైనా దెబ్బ తగిలితే తనకే తగిలినంతగా బాధపడేది. ఒక్కొక్కప్పుడు రమణే దురుసుగా సుగుణని చీదరించుకునేవాడు కాని సుగుణమాత్రం రమణని వదిలి వుండేది కాదు.

పరంధామయ్యగారు పిల్లల పెంపకంలో చాలా జాగ్రత్త తీసుకున్నారనే చెప్పాలి. వారికి దురలవాట్లేవీ అబ్బకూడదనే ఉద్దేశంతో సాయంకాలాలు వారికి గొప్ప గొప్ప వారి జీవిత చరిత్రలన్నీ కథలుగా చెప్పేవారు. ఏవేవో ఆదర్శాలంటూ నూరి పోసేవారు.

వాటి ఫలితంగానే రమణ కాలేజీలో చేరిన సంవత్సరమే అతి గారాబంగా పెరిగిన పిల్లలకి సహజంగా అబ్బే దురలవాట్లేమీ అబ్బకపోయినా, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఒక ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఏవో పగటికలలు కంటూండేవాడు.

ముందు అది వేపకాయంత వెర్రి అనుకున్నారు కాని అదే పెరిగి పెద్దదై రమణ మెదడంతా ఆక్రమించుకుంది. తత్ఫలితంగానే ఒక శుభముహూర్తాన చదువుకు స్వస్తి చెప్పి ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు రమణ. వెళ్ళుతూ వెళ్ళుతూ,

'తనకేవో ఆశయాలున్నాయని, వాటి సాధనకు తగిన అవకాశాలు ఈ బీదరికంలో లభ్యం కావని, వాటిని సాధించుకుని ఒక ఆదర్శమూర్తిగా తిరిగిరమ్మని తనని ఆశీర్వదించమని' ఒక వుత్తరం పరంధామయ్యగారికి విడిచి వెళ్ళాడు.

ఊహించని ఈ అఘాతానికి పరంధామయ్యగారు తట్టుకోలేకపోయారు. దాని నుంచి కోలుకోకుండానే పెళ్ళికి ఎదుగుతూన్న సుగుణని ఈ లోకంలో విడిచి తను పరలోకానికి దారి చూసుకున్నారు.

ఏం చెయ్యాలో ఏమిటో దిక్కు తెలియని స్థితిలో ఉన్న సుగుణని చేరదీసి ఆదరించారు, పరంధామయ్యగారి ప్రాణస్నేహితులు, రిటైర్డు హెడ్‌మాస్టరు రాఘవయ్యగారు. ఏ బంధాలు లేని రాఘవయ్యగారికి ఈ క్రొత్త అనుబంధం ఒక వింత అనుభూతిని కలిగించింది. 'రామా! కృష్ణా!' అనుకుంటూ తన జీవితపు చివరి దశలో భగవంతుని పిలుపుకోసం ఎదురుచూస్తూ నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చుతూన్న రాఘవయ్యగారు, ఇప్పుడు భగవంతుడే దిగవచ్చినా పెళ్ళీడు కొచ్చిన సుగుణని ఒక అయ్య చేతిలో పెట్టేవరకు ఒక్క అంగుళం కూడా కదలకూడదనుకుని, మంచి సంబంధంకోసం ప్రయత్నాలు చెయ్యడం ప్రారంభించారు.

వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు ఆయన్నే వెదుక్కుంటూ వచ్చాడు భానుమూర్తి ఒక రోజు. ఆ రోజు రాఘవయ్యగారు ఉదయమే చెప్పులు తొడుక్కుని, భుజంమీద కండువా వేసుకుని ఎక్కడికో బయల్దేరబోతూండగా ఆయన ఇంటిముందు ఒక రిక్షా ఆగింది.

• • •

'సుగుణా! నువ్వట్లా ఆలోచిస్తూ కూర్చుంటే అయినట్లే. త్వరగా

గడికావాలి. అవతల ట్రెయినువచ్చే వేళ అయింది.'

భానుమూర్తి మాటలతో మళ్ళా ఈ లోకంలోకి వచ్చింది సుగుణ.

'ఇప్పుడే వస్తున్నానండి!'

అని కొద్ది క్షణాల్లో డ్రెస్ చేసుకుని వచ్చి కారులో కూర్చుంది.

కారు డ్రైవు చేస్తున్న భాను



మూర్తి మనస్సు కూడా సుగుణ మనసులాగే గతాన్ని త్రవ్వుతూంది! జరిగిన సంఘటనలన్నీ కళ్ళ ముందు తిరుగుతున్నాయి.

ఆరోజు భానుమూర్తికి బాగా జ్ఞాపకం. అదే సుగుణని చూడ్డానికి వెళ్ళినరోజు. ఆ రోజు ఉదయమే అతడు రాజమండ్రిలో బయల్దేరాడు. గోదావరిమీద ప్రయాణం చేయడం అతనికదే మొదలు. లాంచీ కేబిన్లో కూర్చుని బయటకు చూస్తూండిపోయాడు. దూరంగా ఏటిగట్టు వంకర్లు తిరుగుతూ వయ్యారంగా వెనక్కి వెళ్ళిపోతూంది. దాని వెనుకగా దట్టంగా ఉన్న కొబ్బరిచెట్లమధ్య నుంచి మేమూ ఉన్నామన్నట్టు అక్కడక్కడ గుడిసెలు తొంగి చూస్తున్నాయి. గోదావరి నీటిలోంచి చేపలు అప్పుడప్పుడు ఎగిరి పడుతున్నాయి. అప్పుడే లోకసంచారానికి బయల్దేరుతున్న బాలభానుని అరుణ కిరణాలలో ఉండుండి మెరుస్తున్న ఆ మత్స్యకన్యలు అతనికి ఏవేవో వింత అనుభూతులు కల్గించాయి.

అతడు ఒంటరిగా చేసిన ప్రయాణాలు వేళ్ళపై లెక్కపెట్టవచ్చు. పుట్టినప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన భానుమూర్తి మేనమామ అండదండలలో పెరిగాడు. యుక్తవయస్సు వచ్చిన తరువాత, అతడి ఆస్తిపాస్తులన్ని అతనికి వప్పచెప్పి తన దారిని తను చూసుకున్నాడు అతని మేనమామ.

అతడికి కూడా రమణలాగే ఉన్నత ఆశయాలున్నాయి. దానికి కారణం అతడి సంపద, వెనుక తన గురించి అనుకునేవారెవరూ లేకపోవడమే కారణాలు. రమణ గాథ వంతటిని విన్న తరువాత అతని హృదయం జాలితో నిండిపోయింది. సుగుణ అందచందాలను గుణగణాలను రమణ ద్వారా విన్నాడు. తత్ఫలితంగానే సుగుణని చూడ్డానికి రాఘవయ్యగారి ఎడ్రసు తీసుకుని బయల్దేరాడు. తన జీవితంలో ఒక మంచి పని చేయబోతున్నాననే భావన కల్గగానే అతడికి మొట్టమొదటిసారిగా కించిత్ గర్వం కల్గింది.

బొబ్బర్లంకలో బయల్దేరిన బస్సు పొదలాడ వచ్చేసరికి ఇంజను చెడిపోయి ఆగిపోయింది. అక్కడ ఒకే ఒక రిక్షాలో సోంపల్లి చేరుకున్నాడు. సోంపల్లి వచ్చేసరికి తొమ్మిదయింది.

సోంపల్లి చాలా చిన్న ఊరు. అడపాతడపా పట్నంలో డాక్టరు కోర్సు చదువుతున్న ఆ ఊరి కరణంగారి అబ్బాయి శలవులకు యింటికి వచ్చినప్పుడు తప్ప ఆ ఊళ్లో రిక్షా బెల్లు వినబడడం చాలా అరుదు. అందులోను రిక్షా తనయింటిముందు ఆగేసరికి రాఘవయ్యగారికి మరింత ఆశ్చర్యం కల్గింది. 'రాఘవయ్యగారిల్లు ఇదేనాండి?' అంటూ రిక్షా దిగాడు భానుమూర్తి.

"అవును బాబూ! ఇదే; లోపలికి రండి" అంటూ రాఘవయ్యగారు లోపలికి నడిచారు.

సూటుకేసు హాలులో పెడుతూ,

'నా పేరు భానుమూర్తి, నేనూ రమణా స్నేహితులం' అన్నాడు భానుమూర్తి. ఆ మాటతో ఆ ఇంట్లో కలగబోయే పరిణామం ఊహించుకుంటూ.

'సుగుణా! ఇల్లారా!'

అంటూ గావుకేక పెట్టారు రాఘవయ్యగారు.

వంటింట్లోంచి సుగుణ హాల్లోకి పరిగెత్తుకు వచ్చింది. ఆమెకు భానుమూర్తి మాటలు వినిపించాయి. హృదయం ఒక్కమాటు కొట్టుకోవడం ఆగినట్లయింది. తన చెవులను తానే నమ్మలేకపోయింది.

రాఘవయ్యగారు ఏదో అడుగుతున్నారు.

'చెప్పు నాయనా! రమణ ఎట్లా ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడు? ఏం చేస్తున్నాడు?'

ఆయన ఇక మాట్లాడలేకపోయాడు. కంఠం పూడుకుపోయింది.

భానుమూర్తికి మాత్రం ఇవేమీ వినిపించడం లేదు. సుగుణ ముఖంలోకి చూస్తున్నాడు.

వెల్లువలు వెల్లువలుగా వస్తున్న కన్నీటికి ఆనకట్ట కట్టడానికి విఫల ప్రయత్నం చేస్తూంది సుగుణ. ఆమె ముఖంలో ఎన్నెన్నో ప్రశ్నలు, ఏదో ఆరాటం.

ప్రాణానికి ప్రాణంగా పెరిగిన అన్నయ్య ఇల్లు విడిచి వెళ్ళగా, ఉన్న ఒక్క ఆధారమయిన తండ్రి శాశ్వతంగా దూరం కాగా, అనాథగా పరుల పంచన పెరుగుతున్న ఆ ముద్దుల చెల్లెలి అప్పటి హృదయాంతర్గత భావాల్ని భానుమూర్తి స్పష్టంగా ఆమె ముఖంలో చదువగలిగాడు.

"సుగుణంటే మీరే ననుకుంటాను. నా పేరు భానుమూర్తి. మీ అన్నయ్య రమణ, నేను ప్రాణస్నేహితులం."

కన్నీళ్ళతో సుగుణ బుగ్గలు తడిసిపోతున్నాయి.

"నేను రాజమహేంద్రవరం నుంచి వస్తున్నాను. రమణకి మొన్ననే ట్రాన్స్ఫరయింది. ఇప్పుడు ఏలూరులో వుంటున్నాడు. అతడి ఆఫీసు—"

"అన్నయ్య ఎట్లావున్నాడు?"

● ఏదో వుత్తరం దొరక్క ఇంట్లో అందరిమీద విసుక్కుంటూన్న తండ్రి :

"నిన్న వచ్చిన వుత్తరం ఇవాళ కనపడదు. ఈ ఇల్లు మరీ ఆఫీసులాగా తయారయింది."

— ఎస్. రాధాకృష్ణమూర్తి

ఎక్కడున్నానరే, ఏం చేస్తున్నానరే! పుట్టినప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి, ఒంటరిజీవితం గడుపుతూ అక్కచెల్లెళ్ళ అనురాగానికి, అన్నదమ్ముల అభిమానానికి నోచుకోని భానుమూర్తి హృదయాన్ని కలచివేసింది ఆ ప్రశ్న.

అక్కడికి వచ్చేముందు రమణ తమ అన్నాచెల్లెళ్ళ తీయని అనుబంధాన్ని కమ్మని జ్ఞాపకాలతో వర్ణించినా అంతగా నమ్మలేకపోయాడు, కాని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాడు. భానుమూర్తి కళ్ళు చెమర్చాయి.

రాఘవయ్యగారు కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకుంటూ సుగుణ వైపు తిరిగి అన్నారు.

"అమ్మా! సుగుణా! అతడు ఎప్పుడనగా బయల్దేరాడో. ఏమో! ముందు వంట ప్రయత్నాలు చూడు. తర్వాత సావకాశంగా మాట్లాడుకోవచ్చు. ఈ లోపుగా స్నానం చేసి వస్తాడు."

"అట్లాగే బాబయ్యా!"

అంటూ కళ్ళు తుడుచుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది సుగుణ.

"పిచ్చిపిల్ల! అన్నయ్యగూర్చి పలవరించని క్షణమే లేదు."

ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిట్టూర్చారు రాఘవయ్యగారు.

సుగుణ ఏ పనీ సరిగ్గా చెయ్యలేకపోయింది. అన్నయ్య గురించి తెలుసుకోవాలని ఆమె మనస్సు తహ తహ లాడిపోతూంది. దాన్ని భానుమూర్తి గమనించాడు.

భానుమూర్తి స్నానంచేసిన తరువాత రాఘవయ్యగారితో భోజనానికి కూర్చున్నాడు. ఒక ముద్దనోట్లో పెట్టుకుని, "ఏమండీ రాఘవయ్యగారూ! మీకు అన్నిట్లోనూ ఉప్పు ఎక్కువగా ఉండాలాండీ?"

అన్నాడు భానుమూర్తి.

రాఘవయ్యగారు అర్థంచేసుకుని నవ్వేరు. సుగుణ తన పరధ్యానానికి సిగ్గుపడింది.

భోం చేసిన తరువాత భానుమూర్తి ప్రక్క మీద వ్రాలాడు. అలా కళ్ళుమూసుకోగానే అతని మనస్సును ఆలోచన్లు చుట్టుముట్టాయి.

"తను ఇక్కడకు వచ్చింది సుగుణని చూడటానికి. కాని ఈ పరిస్థితిలో తను పెండ్లిచూపులకు వచ్చినట్లు చెప్పడమెట్లాగో తెలియడం లేదు. అందుకనే వచ్చేటప్పుడు రమణ దగ్గర నుంచి 'కాండక్టు సర్టిఫికేట్' లాంటి ఒక ఉత్తరం, వామిద్దరు కలిసి తీయించుకున్న ఒక ఫోటో కూడా తీసుకువచ్చాడు. కాని వివాహ ప్రసక్తి తీసుకురావడానికి బిడియ పడుతున్నాడు.

అయినా వారేమంటారో! అంతకు ముందు పరిచయం లేని, ముక్కూ ముఖం ఎరుగని ఒక వ్యక్తిని వివాహమడడానికి సుగుణ ఒప్పుకుంటుందో లెదో!

తిన ఆలోచనలు ఒక దరికి రాకుండానే ఆ మర్నాడు, ధైర్యం చేసి రాఘవయ్యగారి ఎదుట అసలు విషయం కదిపాడు. రాఘవయ్యగారు ముందు ఆశ్చర్యపోయారు. ఆ తరువాత సుగుణతో సావకాశంగా ఆ విషయాన్ని ప్రస్తావించారు

సుగుణ బిత్తరపోయి చూసింది రాఘవయ్యగారి వైపు. కొన్ని క్షణాలు ఇద్దరూ మాట్లాడలేదు.

"ఆలోచించుకో అమ్మా! బాగా ఆలోచించుకునే నీ నిర్ణయం చెప్పు"

అని రాఘవయ్యగారు బయటకు వచ్చెయ్యబోయారు.

"లేదు బాబయ్యగారూ! పెద్దలు మీరు. మీ కంటే నా బాగోగులు చూచేవారు ఎవరు? మీ అభిప్రాయమే నా అభిప్రాయం" అంది సుగుణ.

రాఘవయ్యగారు సుగుణ తల నిమురుతూ కాస్సేపుండిపోయ్యారు.

"నాకు తెలుసమ్మా నీ వట్లా అంటావని. కాని అతడితో జీవితాంతం సుఖదుఃఖాలలో పాలు పంచుకోవలసిన దానివి నువ్వు. నిన్ను ఒక అయ్యచేతిలో పెట్టడం వరకే మా బాధ్యత. అందుచేత జాగ్రత్తగా ఆలోచించి మరీ నిర్ణయించుకో. నిన్న మొన్నటివరకు అతడెవరో మనకు తెలియదు. అతడి స్వభావమెటువంటిదో మన కెటువంటి అభి(యిం లెదు. మనకు అతడు యోగ్యుడుగానే కన్పించవచ్చు. కాని లోకులు కాకులమ్మా!"

అంటూ ఆగారు రాఘవయ్యగారు.


"బాబయ్యగారూ! అన్నయ్య అభిప్రాయంమీద, మీ నిర్ణయం మీద విశ్వాసం, గురి నాకెప్పుడూ ఉన్నాయి." అంది సుగుణ దృఢంగా.

ఆ తర్వాత కొన్నాళ్ళకే భానుమూర్తి సుగుణని రిజిస్టరు మారేజి చేసుకున్నాడు.

వివాహానికి రమణ రాలేకపోయాడు ఏదో ఆఫీసు పనుల మీద. తమా రాలేనందుకు విచారాన్ని వ్యక్తపరుస్తూ సుగుణకు ఒక ఉత్తరం వ్రాశాడు.

"చెల్లీ! సుగుణా!"

భానుమూర్తిని నేను బాగా ఎరు



గుడును. కడు యోగ్యుడు. అతడి ఆశయాలకు అభిరుచులకు అనుగుణంగా నడుచుకుంటూ, సహన శీలత్వాలకు మారుపేరుగా, పుట్టినింటికి, మెట్టిన ఇంటికి పేరు ప్రతిష్ఠలు తీసుకురా తల్లీ! అంతకంటే నే కోరేదేమీ లేదు. నే నెక్కడ ఉన్నా, ఎట్లా ఉన్నా నీకు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి.

మీ దాంపత్యం కలకాలం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోవాలని భగవంతుని ప్రార్థిస్తూ,

ఆశీస్సులతో,

మీ అన్నయ్య రమణ"

ఆ ఉత్తరాన్ని పదే పదే చదువుకుని అన్నయ్యకు మనస్సులోనే నమస్కరించింది సుగుణ.

మరికొన్నాళ్ళు ఆ ఊర్లోనే ఉండి, ఇక శలవు లేదంటూ సుగుణని తీసుకుని రాజమహేంద్రవరం ప్రయాణమయ్యాడు భానుమూర్తి.

కాపరానికి వచ్చిన తరువాత చాలామార్లు రమణకి ఉత్తరాలు వ్రాసింది ఒక్కమారు వచ్చి చూచి పొమ్మని. ఎప్పుడూ ఏదో పని ఉందనో, తీరిక చిక్కడం లేదనో, ఇన్‌స్పెక్షన్ అనో ఏదో సాకు చెబుతూ రాసేవాడు.

చాలామార్లు భానుమూర్తిని కూడా అడిగింది ఒక్కసారి ఏలూరు వెడదామని. అతడు కూడా అవే సాకులు చెప్పి తప్పించుకతిరిగేవాడు. పెళ్ళయి రెండేళ్ళయినా రమణ ఒక్కమారయినా రాలేదు. బాబు పుట్టినప్పుడు కూడా ఏవేవో ప్రెజెంట్సు పంపిస్తూ తను ఏదో క్యాంపుకు వెళ్ళవలసి ఉందని అందుచేత రాలేనని వ్రాశాడు. సుగుణకి చాలా కోపం వచ్చింది. అందుకనే బారసాలకైనా రాకపోతే తనమీద మీద ఒట్టేనని గట్టిగా వ్రాసింది. అనుకున్నట్లుగానే జవాబు వచ్చింది. ఆ రోజు పదిగంటల బండిలో వస్తున్నట్లు.

• • •

కారు స్టేషన్ సమీపించడం, రైలుకూత వేసి ఆగటం ఒక్కసారే జరిగాయి. సుగుణకు అన్నయ్యను చూడాలన్న ఆతృత ఎక్కువై పోతూంది. గబగబా కారు దిగి ప్లాట్‌ఫారం మీదకు యించుమించుగా పరుగెత్తింది. కారు పార్కు చేసి తనుకూడా స్టేషనులోకి వెళ్ళాడు. భానుమూర్తి గుంపును తోసుకుంటూ సుగుణని అందుకోడానికి ప్రయత్నిస్తూనే పెట్టెలలో నుండి దిగుతున్న జనాన్ని ఒక కంట గమనిస్తున్నాడు. అతని మనస్సులో అనేక అనుమానాలు మొలకెత్తుతున్నాయి. వాళ్ళన్నయ్యని చూసి సుగుణ ఏమనుకుంటుంది? ఎంతో వైభవంగా ఊహించుకున్న అన్నయ్యను మాసిన బట్టల్తో అతి సామాన్యుడుగా చూసి తట్టుకోగలదా?

ఎంతో ఆతృతగా పెట్టెలన్నీ వెతుకుతున్న సుగుణని

"సుగుణా! ఏమిటి, మీ అన్నయ్యని యిక్కడ పెట్టుకుని ఎక్కడకు పోతున్నావు?"

అని భానుమూర్తి కేక వేశాడు.

సుగుణ గిరుక్కున వెనక్కు తిరిగి అటు పరుగెత్తింది.

"ఏడీ అన్నయ్య! వచ్చాడా!"

ఆమె కళ్ళల్లో సూటు బూటులో దర్జాగా ఠీవిగా ఒక చేత్తో సూట్‌కేసుతో రమణ మెదులుతున్నాడు.

"ఏమిటల్లా చూస్తున్నావు? ఇడుగో" అంటూ ప్రక్కనే ఉన్న రమణని చూపించాడు భానుమూర్తి. సుగుణ నిశ్చేష్టయైపోయింది.

ఈ లోకంలో భానుమూర్తిని మినహాయించి తన శ్రేయస్సును కోరే ఒకే ఒక వ్యక్తి, తన సుఖ సౌఖ్యాలను కాంక్షించి భానుమూర్తి వంటి సద్గుణాల ఖనిని తనకు భర్తగా ప్రసాదించిన ఆరాధ్య దైవం, ఉన్నత ఆశయాలతో ఇల్లు విడిచి పట్టుదలతోను, కృషితోను, వానిని సాధించి తిరిగి వచ్చిన ఆదర్శమూర్తి, చకోర పక్షిలా కొన్నాళ్ళుగా ఎదురు చూసిన తన అన్నయ్య రమణ ఇప్పుడు తన ఎదుటే నిలబడి ఉన్నాడు.

కాని తను ఊహించినట్లుగా సూటు బూట్లలో కాదు, చింపిరిబట్టలలో, మాసిన గడ్డంతో సంస్కార రహితమైన జుట్టు సర్దుకుంటూ నిలబడ్డాడు రమణ.

సుగుణ స్తంభించిపోయింది. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. ఆలోచించడానికి, ఊహించడానికి నిరాకరించింది.

"కులాసాగా ఉన్నావా అమ్మా!"

అని అడిగిన రమణకేం సమాధానం చెప్పిందో ఏమో!

కారు ఇల్లు చేరింది.

ఇంట్లోకి వస్తూనే,

"మీ రిద్దరూ మాట్లాడుకుంటూండండి. నే నిప్పుడే స్నానం చేసి వస్తాను."

అంటూ భానుమూర్తి సబ్బు తువ్వాలు తీసుకుని బాత్‌రూం వైపుకు వెళ్ళిపోయాడు.

కొద్ది క్షణాలు ఇద్దరూ మాట్లాడలేదు. రమణే ముందు మాట్లాడాడు.

"అమ్మా! పెద్ద ఆఫీసరుగా ఊహించుకున్న నీ అన్నయ్యను ఇట్లా చూడడానికి సిగ్గుపడుతున్నావా అమ్మా!"

దుఃఖంతో అతడి కంఠం బొంగురుపోయింది.

"అన్నయ్యా!"

బావురుమంటూ రమణ గుండెల మీద వ్రాలిపోయింది సుగుణ.

"ఎంతమాట అన్నావు అన్నయ్యా! నీకున్న ఉన్నత ఆశయాలు లేకపోయినా, ఒక స్త్రీకి వుండవలసిన మమతా మమకారాలు, నీ చెల్లెలనిపించుకుందుకు తగిన మానవత ఇంకా చచ్చిపోలే దన్నయ్యా!"

వెక్కుతూ రమణ భుజాలు తడిపేస్తూంది సుగుణ.

"నాకు తెలుసమ్మా! నీ హృదయం నాకు పూర్తిగా తెలుసు."

అంటూ సుగుణ తల నిమురుతూ కన్నీళ్ళు కార్చాడు రమణ.

భానుమూర్తి స్నానం చేసి వచ్చాడు.

హాలులో అపూర్వమైన ఆ దృశ్యం చూచి అతడి కళ్ళు చెమర్చాయి.

జ్ఞానం తెలిసొచ్చిన తర్వాత అంతో ఇంతో ఉన్నస్థితిలో, తనంటే ప్రాణాలిచ్చే తండ్రిని చెల్లెలిని విడిచి, ఏవో ఆదర్శాలంటూ ఉప్పి గంతులేసి జీవితంలో ఓడిపోయి ఇప్పుడు బీదరికం చవి చూస్తున్న రమణ, తనకు లోకజ్ఞానం తెలిసొచ్చే సరికి ఏమీ లేని స్థితి అయినా అప్పటివరకు అజపజా లేని అన్నయ్య పంపిన మాటమీద మంచి ధైర్యంగా జీవితంలో ముందడుగు వేసి. ఇప్పుడు ఐశ్వర్యం చవిచూస్తున్న సుగుణ, ఈ ఇద్దరే తనకు బంధువులైనా మిత్రులైనా.

కళ్ళు తుడుచుకుంటూ,

"సుగుణా! ముందు వంటసంగతి చూడు." తర్వాత మాట్లాడుకో వచ్చు."

అన్నాడు భానుమూర్తి.

"అట్లాగేనండి!" అంటూ రమణ చేతిలో నుండి సంచీ తీసుకుని ఇంట్లోకి వెళ్ళింది సుగుణ.

"ముందు మేనల్లుణ్ణి చూపించండి."

అంటూ ఉయ్యాలవైపుకు నడిచాడు రమణ.

భోజనాలయిన తరువాత అందరూ హాల్లో కూర్చున్నారు

కొద్ది క్షణాలు ముగ్గురూ ఏవో ఆలోచనల్లో మునిగిపోయి ఎవ్వరూ మాట్లాడలేదు. సుగుణకంతా అయోమయంగా ఉంది. నిజమే తను రమణను పెద్ద ఆఫీసరుగా ఊహించింది. భానుమూర్తి కూడా అట్లాగే చెప్పాడు. మరి ఇదేమిటి!

సుగుణ మనసులోని భావాల నర్థంచేసుకున్న రమణే మొదలుపెట్టాడు.

● "మొన్నెగా పనిలో చేరావ్. అప్పుడే నిన్నెందుకు తీసేశాడు మీ మేనేజరు ?"

"అంతా పనిచేస్తుంటే మా మేనేజరు కూచ్చుని కర్రపెత్తనం చేస్తుంటాడు."

"చేస్తే నీకేం ?"

"ఏంలేదు. అంతా నేనే మేనేజర్ని అనుకుంటుంటే ఆయనికి కోపంవచ్చి నన్ను పొమ్మన్నాడు."

'ఎన్నెన్నో సినిమాలు చూశాను కాలేజీలో చేరిన సంవత్సరం, ఎన్నో కథలు చదివాను. అన్నిటిల్లోను ఏదో ఒక ఆదర్శం. ఒక కథలో ధనవంతుడైన ఒక యువకుడు ఒక పేద యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు, ఒక సినిమాలో ఒక ధనవంతుడు బీదసాదలకు ఎన్నో సహాయాలు చేస్తాడు. ఇంకో సినిమాలో ఒక గొప్పడాక్టరు ఉచితంగా వైద్యంచేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటాడు. ఇంకో దాంట్లో ఇంకోటి. మరో దాంట్లో మరోటి. ఇట్లా ఎన్నెన్నో.

ఇవన్నీ తారకలుగా మినుకు మినుకుమంటూ నా ఊహాపథంలో నిల్చిపోయాయి. వాటి ఫలితంగా నయితేనేం, నాన్నగారి ఉద్బోధల ఫలితంగా నైతేనేం, ఒక లక్ష్యమంటూ లేకుండా ఏదో చెయ్యాలని గ్రుడ్డిగా ఇల్లువిడిచి వెళ్ళాను.

ఎన్నో ఊర్లు తిరిగాను. ఆ ఉద్యోగం ఈ ఉద్యోగం చేసి మెల్లిగా కూడబెట్టటం మొదలెట్టాను. చేతిలో ఉన్నంతకాలం, ఎంతమందికో చిన్న చిన్న సహాయాలు చేశాను. ధనరూపంగా నైతేనేం, వస్తురూపంగా నైతేనేం, నాకు చేయగల్గినంత చేసేవాణ్ణి. ఎందరినో కష్టాల్లో ఆదుకున్నాను.

ఊళ్ళో ఎక్కడ తోరణం కట్టినా నేనే తయారు. ఒక సభ అవనీ, ఒక పండగఅవనీ, ఒక ఊరేగింపవనీ నాకు తోచిన సహాయం నేను చేసేవాణ్ణి. ఎవరింట్లోనైనా ఏ రైనా పెళ్ళి అయితే నాకే సంబంధం లేక పోయినా వెళ్ళి నా నెత్తిన వేసుకుని తిరిగేవాణ్ణి.

ఇంతా చేస్తే, దీనివల్ల ప్రతిఫలమేమీ ముట్టకపోగా, అంత పని చేయించుకుని, నా వెనకనే నన్నొక అమాయకుడి క్రింద జమకట్టి...

"పాపం ఒకి గాడిదలా పని చేస్తాడు." అని హేళనగా పకపకా నవ్వేవారు.

నేనొక మంచి పని చేశానని కొంత సంతృప్తి కలిగినా, ఈ మాటలతో నా మనస్సు చివుక్కుమనేది.

చేసే పనులన్నీ నేను పొందే సత్కారాలు సన్మానాలు మరొకరు. ఇవన్నీ చూసి నా గుండె తరుక్కుపోయేది. తిరిగి ఇంటికి వెళ్ళిపోదామనిపించేది. కాని వెంటనే, సమాధాన పడేవాణ్ణి.

'నా మనస్సుకు సంతృప్తిగా ఉంటే అంతేచాలు. ఏదో ప్రతిఫలం ఆశించి కాదుకదా ఇదంతా చేస్తూంట.'

కాని రోజులు గడుస్తున్నకొద్దీ నాలో నైరాశ్యం పేరుకపోసాగింది. ఒక వ్యక్తి ఒక మంచిపని చేసినా, లేక ఏదో ఒక పని కష్టపడిచేసినా, దానికి ప్రతిఫలం ఏదో ఒక రూపంగా, మాట రూపంగానైనా సరే ఆశిస్తాడు. ఎదుటి వ్యక్తి, 'నువ్వు చేసిన పని మంచిపనోయ్' అన్నా, 'పాపం కష్టపడి పని చేశావోయ్!' అన్నా ఒక్కమాట చాలు మనస్ఫూర్తిగా అంటే ఆ వ్యక్తి ఏనుగెక్కినంత సంబర పడతాడు. పొగడ్తగాగాని సానుభూతిగాగాని అన్న ఆ ఒక్క మాట చాలు, అదే లభ్యంగానినాడు ఆ వ్యక్తిలో నిరాశ నిస్పృహలు పేరుకపోయి ఇంకేపని చేయడానికైనా ఉత్సాహం చూపడు.

నా విషయంలో అదే అయింది. ఆ రోజుల్లోనే విన్నాను నాన్నగారు పోయినట్లు అప్పుడే మొట్టమొదటి సారిగా. నేను ఇల్లు విడిచి రావడం ఎంత అవివేకము, అనాలోచితమైనదో తెలిసొచ్చింది.

రాఘవయ్యగారు నిన్ను చేరదీశారని విని ఆయన సహృదయతకు మనస్సులోనే జోహార్లర్పించాను. తిరిగి ఇంటికి రావాలనిపించినా, ఉద్యోగం సద్యోగంలేని నేనుకూడా ఆయనకొక బరువు కావడం ఇష్టం లేక ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

తిరిగి తిరిగి చివరకు భానుమూర్తిగారి కంపెనీలో గుమాస్తాగా చేరాను.

భానుమూర్తిగారు సత్ప్రవర్తనులు, ఉత్తమ ఆశయాలు కలవాడు. ఆయన ఆఫీసులో తరతమ భేదాలు లేకుండా అందరూ కలసి మెలసి పనిచేసేవారు కొద్ది రోజుల్లోనే నాకు భానుమూర్తిగారికి పరిచయం అయింది.

సాధించడానికి అవకాశాలు లేని ఆశయాలున్న నాకు, ఆశయాలతో బాటు వాటి సాధనకు కావలసిన అవకాశాలున్న భానుమూర్తిగారికి పరిచయం అయి, అభివృద్ధి కావడంలో ఆశ్చర్యం లేదు. ఆఫీసరు, గుమాస్తా అనే భేదం లేకుండా కలసి మెలసి తిరిగేవాళ్ళం. మనసులు విప్పి మాట్లాడుకునే వాళ్ళం. ఆయనకి అప్పుడే చెప్పాను నా గురించి. మన కుటుంబగాథ అంతా వినిపించాను. ఆయన అంతా శ్రద్ధగా, ఆసక్తిగా విన్నారు. పూర్తిగా విని సానుభూతి చూపించారు.

ఆ తరువాత కొన్నాళ్ళవరకు మేము ఎప్పుడు కలుసుకున్నా మన కుటుంబం గురించి, ముఖ్యంగా నీ గురించి అడుగుతూ వచ్చారు. ఒకరోజు సాయంకాలం ఎప్పటిలాగే మేము గోదావరి గట్టుకు షికారుకు వెళ్ళాము. నేను ఏవో ఆఫీసు విషయాలు మాట్లాడుతున్నాను. ఆయన పరధ్యాన్నంగా వింటున్నారు. అట్లా నడుస్తూ

వెంపరాల కామేశ్వరీదేవి

పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ, విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచనలే పంపించాలి.

3. పమ పూర్తిపేరు. చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందిన రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరంలేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు పరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా "ఎడిటర్," జ్యోతి, సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2".

8. రూ. 50 లు ప్రథమ బహుమతి, రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

లాంఛీలు రేవుదాకా వచ్చాము. ఇక వెనక్కి తిరుగుదా మనుకున్నంతలో భానుమూర్తిగారు హఠాత్తుగా అన్నారు,

'ఒక్క విషయం అడుగుతాను రమణా! ఆలోచించి చెప్పు. సూటిగా అడుగుతాను మరేమనుకోకు.'

ఒక్కక్షణం ఆగి తిరిగి అన్నారు

'నేను మీ సుగుణని వివాహం చేసుకోవా లనుకుంటున్నాను. నీ అభిప్రాయం ఏమిటి?'

నేను దిమ్మెరపోయాను. ఆయన వేళాకోళంగా అన్నారేమోనని తేలికగా నవ్వెయ్యబోయాను కాని ఆయన,

'లేదు రమణా! నేను సీరియస్‌గానే చెబుతున్నాను.'

అనేసరికి నాకు మతిపోయినంత పనయింది. నా అంతస్థెంత? ఆయనతో బాంధవ్యం నాకు కలలో కూడా ఊహించలేనిది. నేను మన గాథ నంతటినీ ఆయనకు వినిపించినది ఆయననుండి జాలి, సానుభూతి ఆశించే తప్ప మరే ఉద్దేశం మనసులో ఉంచుకుని కాదు. ఆయన ఆశయాలు నాకు తెలుసు. అయినా, నేను జీవితంలో ఒకసారి ఓడినవాణ్ణి కావడం మూలాన ఆయనకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. మనది చాల బీదకుటుంబమనిన్నీ, ఏదో సానుభూతితోను, ఉదారతతోను ఈ నిశ్చయానికి రావద్దనిన్నీ, ఆశ

సిద్ధించిన తరువాత కూడా వాటిని నిలబెట్టుకోడానికి తగిన చిత్తశుద్ధి మనోదార్ఢ్యం లేకపోతే అది మూణ్ణాళ్ళ ముచ్చటే అవుతుందనిన్నీ, అందుచేత మరొక్కమారు ఆలోచించమనీ చెప్పాను.

కాని ఆయన 'చాలా ఆలోచించిన తరువాతనే ఆ నిశ్చయానికి వచ్చానని, ఇంక దాన్ని మార్చుకోననీ చెప్పాడు. నేను ఏదైతే అది అవుతుందని భగవంతునిపై భారంవేసి రాఘవయ్యగారి ఇంటి ఎడ్రసు ఇచ్చి పంపాను.

వెళ్ళేముందు ఈ విషయాలేమీ నీతో చెప్పవద్దని చెప్పాను. నీది సున్నితమైన హృదయం. దీనికి తట్టుకోలేకపోవడమే కాకుండా ఒకవైపు నేను బీదరికంతో బాధపడుతూ ఉంటే నీవు వివాహం చేసుకుని సుఖించడానికి ఏమాత్రం ఒప్పుకోవని నాకు తెలుసు. అందుకనే ఏదో సాకు కల్పించి నేనిక్కడ సుఖంగానే ఉన్నట్లు నీకు నచ్చచెప్పమని చెప్పి పంపాను.

నీకు ఒక అనుమానం రావచ్చు. అంత ఉదారత కలవాడు భానుమూర్తి, నాకు ఏదైనా ఒక పెద్ద ఉద్యోగం యిచ్చి తన సహృదయతను చూపలేక పోయాడా అని.

నిజమే ఆయన దానికి ప్రయత్నం చేయబోయారు. కాని నేనే అడ్డు చెప్పాను. అప్పటికే ఆఫీసులో గుసగుసలు ఎక్కువ అయినాయి. అదికాక, నేను ఎన్నెన్నో అనుకున్నాను. అనుకున్న వేవీ సాధించలేకపోయాను. ఈ విషయంలోనైనా నన్ను ప్రయత్నించ నివ్వమన్నాను. మన బంధుత్వరీత్యా కాక నా స్వయం కృషివల్ల అభివృద్ధిలోకి రానివ్వమని కోరాను. ఆయన కూడా అర్థం చేసకుని మౌనం వహించారు.

వివాహం అయిన తరువాత కూడా నీకు నా ముఖం చూపడానికి ఇష్టంలేకనే ప్రయత్నపూర్వకంగా ఏవేవో సాకులు కల్పించాను. భానుమూర్తిగారు ప్రయత్నించి, ఏలూరులో ఉన్న బ్రాంచి ఆఫీసుకు బదిలీ చేయించారు. ఎక్కడున్నా నీవు క్షేమంగా ఉండాలనే నా కోరిక. అంతకన్నా నా కొక్కావల్సింది లేదు.'

చెప్పుతూ చెప్పుతూ ఆగాడు రమణ.

సుగుణకి ఏదో కథ వింటున్నట్లుంది. మూగదానిలా కూర్చుండి పోయింది.

రమణ మళ్ళా అన్నాడు.

"చెల్లీ! ఉట్టి కెగరలేని అవ్వ స్వర్గాని కెగుర్తానందిట!" నావి అన్నీ తాహతుకు మించిన ఆశయాలు. ఆశయాలుండడం మానవ సహజం. కాని ఆశయ సాధనకి తగ్గ అవకాశం కోసం ఎదురు చూడడం కాకుండా, కలిసి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం వివేకవంతుని లక్షణం.

ఆశయాలతోబాటు అన్నీ అవకాశాలు కల భానుమూర్తిగారిని నా బావగారిగా పిల్చుకుందుకు సిగ్గు పడుతూనే గర్వపడుతున్నాను."

"ఏమండోయ్ బావగారూ! మీరట్లా ఉబ్బేశారంటే ఈ గుమ్మాలు పెద్దవి చేయించాలి! అది అట్లా ఉంచి, ఇది మన ఇల్లు. ఆఫీసు కాదు. అందుచేత గార్లు, గీర్లు అనవసరం."

అంటూ నవ్వేశాడు భానుమూర్తి.

కళ్ళలో ఆనందబాష్పాలు తొణికిసలాడగా కృతజ్ఞతా పూర్వకంగా భానుమూర్తివంక చూశాడు...... సాధారణ మానవుడు రమణ.

□□□

(గత సంచిక తరువాయి)

చదువుకున్న కమల

ముప్పాళ రంగనాయకమ్మ

అత్తవారింట కాపురం చేసుకుంటున్న ఆడపడుచు దగ్గర్నుంచీ రెండు నెల్లకో వుత్తరమైనా వస్తుంది పదో పరకో కావాలని — "పిల్ల ఉత్తరం రాసిందిరా! దాని పని ముందు చూడు. అక్కడేం ఇబ్బంది పడుతోందో! ఉన్నది ఒక్కతీ! ముద్దూ ముచ్చట్లు ఇంకెవరికి జరపాలీ?" అంటూ వూదర కొట్టేసి— ముందర కాళ్ళకు బంధం వేసేసి— మొత్తానికి పని జరిపించేస్తుంది శేషమ్మ. కూతురి దగ్గర్నుంచి తిరుగు వుత్తరం వచ్చినప్పుడుగానీ నిజంగా తమ్ముడు అప్పగారికి డబ్బు పంపాడూ అంటే నమ్మదు.

ఓసారి కమల అడిగేసింది మూర్తిని—"అస్తమానూ ఆవిడకి డబ్బు పంపటం ఎందుకూ?"

"ఏదో అడిగింది. పుట్టింటివాళ్ళం కాబట్టి పంపుతున్నాం. కొత్త చీరలో—కొత్త చెప్పులో – కొత్త గాజులో ఏవో కొంటుంది. ఆడవాళ్ళకి ఖర్చులకేం తక్కువ? అందరూ నీలా మడికట్టుకు కూర్చోలేరుగా?"

"హాయిగా సంపాదించి పెడుతోన్న భర్త వుండగా పుట్టింటి వాళ్ళని దేవిరించటం ఎందుకో నాకేం అర్థం కావటంలేదు."

"అదే మీ ఆడబుద్ధి. అష్టైశ్వర్యాలతో తులతూగుతోన్న పుట్టింటినుంచి అందినంత ఒడుక్కుపోదామనే చూస్తూంటారు."

"అవును. మాటలు అనుభవాల్లోంచి వస్తాయి. నానా తిప్పలూ పడి ఠిక్కురు మనకుండా అక్కగారికి మనియార్డర్లు కడుతోన్న మీరు ఇంకెలా మాట్లాడగలరు?"

తనకంటే చిన్నవాడైన తన తమ్ముడిమీద ఆడబిడ్డ పెత్తనం చెలాయించటానికి ఆమె నిలువెల్లా వెలగబెట్టి-కష్టార్జితంతో పొట్ట పోసుకుంటోన్న తమ్ముడి పెట్టుపోతల కోసం వేధించుకు తినే కాంతంలో మధుమూర్తికి ఎలాంటి సోదర ప్రేమా లభించలేదు. అందుకే అతని మాటలు అంత కర్కశంగా గ్రహించగలిగింది కమల.

"చూడండి. తనకు మించిన ధర్మం ఎన్నడూ వుండదు. కష్టసుఖాల్లో తప్పుకోమని నేనూ అనను. పోయిన పొడుగునా ఆవిడ ముద్దు ముచ్చటలు జరిపేశక్తి మనకి

లేదు. మన సంసారం - మన భవిష్యత్తు - మనం చూసుకోవాలి. ఏదైనా అత్యవసరమైతే చూద్దాం. నిన్న వచ్చిన వుత్తరానికి అవిడకేం పంపనవసరం లేదనే నా అభిప్రాయం" అంటూ తేల్చి చెప్పేసింది కమల.

"అక్కయ్య మళ్ళా రాస్తుంది కమలా. అమ్మ వూరుకోదు."

"చేతిలో డబ్బు లేదమ్మా! ఇప్పుడు నేనేం పంపలేను. అని ఖచ్చితంగా చెప్పెయ్యండి."

"ఛ! బావుండదేమో కమలా! పోనీలే. పది రూపాయలైనా పంపుతాను. అమ్మ బాధపడుతుంది" అనేశాడు మూర్తి.

కమల తిరస్కారంగా మౌనం వహించింది.

రంధ్రంపడ్డ బుడగలో గాలికొట్టి పూరించడం ఎలా సాధ్యమౌతుంది? బలహీనతల వ్యక్తికి సుఖజీవితం నేర్పటం అంతే అవుతుంది

కాంతం—ఒక్క డబ్బు విషయంలోనేకాదు. అన్నింటా అలాంటి సంకుచితమైన ధోరణే వెల్లడిస్తుంది.

ఓ రోజు కమల కొత్తచీరతీసి పరుపుమీద పెట్టుకుని స్నానానికి వెళ్ళింది. కాంతం మరదలు గదిలోకి వెళ్ళి కొత్తచీర మడతలన్నీ విప్పి తెగ చూసి చూసి — వుండలా చుట్టి అక్కడ పడేసింది. కమల స్నానంచేసివచ్చి తీరా చీర కట్టుకోబోతే - "ఒసే! ఈ చీర నాకు చాలా బావుంది. ఓ సారి కట్టుకుంటాను. ఇవ్వాళ్టికి నా చీర యిస్తాను నువ్వు కట్టుకో." అంది చొరవగా.

ఆడబిడ్డ వుద్దేశ్యం కమలకి నచ్చలేదు. వదినగారి చీర కట్టుకుని మొగుడిదగ్గర ఎలా తిరుగుతుంది?

"కావాలంటే ఈ చీర మీరే కట్టుకోండి. నేను మరోటి కట్టుకుంటాను."అంటూ పెట్టెతీసి గులాబీ రంగు యిస్త్రీ చీర తీసుకొంది.

"ఏంఁ నా చీర కట్టుకోకూడదా?"

"ఏమో! నా కలా బావుండదు."

"అయితే నీ చీర మాత్రం నేనెందుకు కట్టుకుంటానూ? ఓ రోజు యిద్దరం మార్చుకుందామని అడిగానుగాని ..."

"ఆ చీర నేనసలు వాడనేలేదు. మీరు కట్టుకోటానికి తప్పేంలేదు. మీరే వుంచేసుకోండి, నేను మరో సారి కొనుక్కుంటాను."


కాంతం బాగా ఆశ్చర్యపడింది- ఎరువు కట్టుకుంటానని అడిగినంత మాత్రాన పూర్తిగా తీసేసుకోమని యివ్వగలిగింది మరదలు.

"అబ్బే! నీ చీర నాకెందుకూ?" అంటూ గునిసిందో క్షణం. ఆ ముక్కలు మూతి చివర్నించే వూడిపడ్డాయని కమలకి తెలుసు.

కాంతం మళ్ళా చీరవిప్పి పరీక్షలుచేస్తూ—"ఎంతపెట్టి కొన్నావూ? పదిహేనా? పన్నెండా? చూడబోతే పైడాకేగానీ నాలుగు నెలలు మన్నేలా లేదు. సరేలే! వుంచుకుంటాను. మావాడొచ్చాక డబ్బడిగి నీ కిచ్చేస్తాను. నీ చీర వుత్తినే నా కెందుకూ?"

కమల ఆశ్చర్యంతో తల మునకలైంది. తన మొగుడి డబ్బు తనకిచ్చి చీర కొంటుందా పెద్దమనిషి?

కాంతం తమ్ముడు రాగానే డబ్బు అడిగి తీరుతుంది. మూర్తి ఎలాగో తెచ్చి యిస్తాడు. అవి



ఒకటో రెండో మినహాయించేసుకుని కమల చేతిలో పెడుతుంది. కమల ఆ డబ్బు మళ్ళా మూర్తికి యిచ్చెయ్యొచ్చు. అయితే కాంతం మాత్రం డబ్బు యిచ్చి మరీ చీర కొనుక్కున్నట్టు అవుతుంది. అహా! ఏం చాతుర్యం! కమల ఖచ్చితంగానే అంది — 'అబ్బే! డబ్బు ప్రసక్తి తెచ్చేలావుంటే చీర తీసుకోవద్దు. ఆయన డబ్బయితే ఏమిటి? నా డబ్బయితే ఏమిటి?' మరదలి మాటల్లో అంతరార్థాన్ని పట్టించుకోకుండా చీర తీసుకు తల్లి దగ్గరికి పోయింది కాంతం.

'అమ్మా! కమల నన్నే చీర తీసుకోమందే!' అంది సంబరంగానే.

శేషమ్మ ఓ ఘడియ చీర విప్పి చూసి - 'దానికేం భాగ్యం లే. ఒక్కగానొక్క ఆడబిడ్డవి. ఆ మాత్రం చెయ్యలేయా?' అంది గొంతు తగ్గించి.

చిన్నప్పట్నుంచీ ఘనంగా చూసి పెంచిన కొడుకుని - కోడలిరాకతో ఒక్కసారిగా ఈసడించుకోవటం ప్రారంభించి చివరికి శత్రువులాగే చేసుకొంటుంది - తల్లి

'ఆడముండవి. నువ్వెందుకు పుట్టావే నా కడుపున?'

అంటూ శాపనార్థాలతో పెంచిన కూతుర్ని అపురాల్ని చేసుకుని- ఎక్కడలేని అభిమానమూ ఒలకబోసి - కష్టసుఖాలు ఏకరువు పెట్టుకుని - కొడుకూ కోడలూ సుఖపడిపోతారన్న భయంతో - వాళ్ళకి కంట్లో నలుసులాగా ఆడబిడ్డని తయారు చేస్తుంది.

శేషమ్మ వంతపాట లేకపోతే కాంతం మరీ అంత దిగజారిపోక పోయేదే ఏ విషయంలోనైనా.

కమల ఇస్త్రీచీర కట్టుకుని తల దువ్వుకుని వరండాలోకి వచ్చి నిలబడితే ఎగాదిగా చూడ్డం మొదలెట్టింది కాంతం.

'నువ్వుకూడా స్నానం చేసి ఆ కొత్తచీర కట్టుకోవే అమ్మాయ్.' అంది శేషమ్మ.

కాంతం వినిపించుకోకుండా ఆ చీర కాస్తా పెట్లో దాచి నచ్చింది. ఉన్న నెల్లాళ్ళలోనూ కట్టనేలేదు. పెట్టెనిండా బట్టలుంటాయి. అయినా ఏవో పాత చీరలు చుట్టుకుని కాలక్షేపం చేసేస్తూ వుంటుంది. అలాంటి మనిషి అత్తారింట్లో మాత్రం శుభ్రంగా వుంటుందంటే నమ్మకం ఏమిటి?

వీధిలోకి సరుకులు అమ్మరావటం ఆలస్యం— గాజులో— పూసలో — సవరాలో—కుచ్చులో — చెంప పిన్నులో—సిడిజల్లెడో — అప్పడాలకర్రో—జంతికల గిద్దలో— ఏదో ఒకటి ఓ గంట బేరంచేసి— వాడితో జగడంవరకూ తెచ్చుకుని— చివరికి కొంటుంది. తీరా వాడు వెళ్ళాక ఆ వస్తువు నచ్చనే నచ్చదు. అయిష్టంగానే దాన్ని బుట్టలో కుక్కుతుంది. బయల్దేరేసరికి బుట్ట నిండించుకుని మరీ వెళ్తుంది.

ఓ సారి మరదలి గదిలోకివచ్చి కూర్చున్నప్పుడు డెస్క్ లాగి ఉత్తరాలవీ తీసి చదువుతూ—'ఒసే కమలా! మీ వదినె నీకు తేశరంగానే రాసిందే ఉత్తరం! నిజమేనా? పైపై మెహర్బానీలేనా?' అంది.

చూడగా చూడగా ఆడబిడ్డ లేకితనానికి అసహ్యమూ — తెలివి తక్కువకి జాలీకూడా కల్గుతూంటాయి కమలకి.

ఉత్త మట్టితోడి కన్నాలుపెట్టే ఎలకలాగా ఆడబిడ్డ దాడి వుండనే వుంది ఆ యింటికి.

• • •

మధ్యాన్నం ఒంటిగంట వేళ ఎవరో కూలిమనిషి కొత్త మేదర బుట్ట మోసుకొచ్చాడు. 'మూర్తి గారిల్లేదేనా?' అంటూ వాకబు చేయటం ప్రారంభించాడు.

శేషమ్మ హడావుడిగా వాణ్ణి లోపలికి ఆహ్వానించింది. కమల లేచి వెళ్ళేసరికే బుట్ట విప్ప దీసి అన్నీ పరిచి పెట్టింది — మిఠాయీ పంచదార జీలేబి — అమృతపాణీ అరటిపళ్ళూ—ఓ అట్టపెట్టిలో ఎర్రటి టెర్లిన్ చీరా — నైలాన్ జాకట్టు గుడ్డా.

'ఏమిటివన్నీ?' కమల విస్తుపోయింది. కూలి మనిషి వుత్తరం అందించాడు.

ఆ బహుమానాలన్నీ స్వీకరించమనీ—

ఆ పని కాస్త తొరగా చేసిపెట్టమనీ—

చేసిన సాయానికి ఋణం వుంచుకోననీ—ఎవరో అప్పలాచారి మధుమూర్తి పేర రాసిన ఉత్తరం అది—

షుగ్రుమంటూ వుత్తరం చించేసింది కమల. శరీరమంతా అసహ్యంతో కోపంతో జలదరిస్తోంటే— 'తీసుకెళ్ళవయ్యా! తీసుకెళ్ళు, ఇలాంటివి ఎన్నడూ పంపించవద్దన్నారని చెప్పు.'

'అదేవిఁటీ? ఏమైంది?' శేషమ్మ!

'ఇంకేమవాలి? లంచం తిని తప్పుడు పనులు చేసే ఖర్మ మనకేమిటి?'

'ఓస్! ఇవేనా? ఇంకేంముంచుకు పోయిందో అనుకున్నాను. ఏం ఫర్వాలేదు. ఈ రోజుల్లో అంతా చేస్తోన్నదే యిది.'

విస్తుపోయింది కమల - అంతా గడ్డితింటారు. మనం తినక్కర్లేదు. ఇలాంటి విషయాలు కాస్తా బయట పడితే కొడుకు వుద్యోగం వూడుతుందో - జైల్లోకే వెళ్ళి కూర్చుంటారో మీకేమన్నా తెలుసా?'

శేషమ్మ ముఖంలో ఏ మాత్రమూ సంశయం కన్పించలేదు — "నీ చోద్యంగానీ—ఇలాటి వాళ్ళని ఎంతోమందిని ఎరుగుదును నేను. చేసిన పనులన్నీ చేసినట్టే కప్పెట్టుకుంటున్నారుగానీ జయిళ్ళల్లోకి వెళ్ళి కూర్చుంటున్నారా? ఇన్నాళ్ళకి కాస్త బాగుపడే బుద్ధి పుట్టిందేమో వాడికి. వాడు చెప్పిందే అవతల మనిషెందుకు పంపుతాడూ? వాణ్ని రానీ, కనుక్కోవచ్చు."

అదేం విన్పించునే విధంగా లేదు కమల.

"ఏమయ్యా? ఎందుకలా చూస్తావు? కిక్కురుమనకుండా తీసుకువెళ్లు. మూర్తిగారి భార్య చెప్పారని చెప్పు. మరోసారి యిలాంటిపని జరిగితే పోలీసులకి పట్టిస్తామన్నారని చెప్పు. వెళ్ళు, వెళ్ళు" అంటూ వాణ్ని వూపిరి సలపనివ్వకుండా జేసి వెళ్ళగొట్టేసింది కమల. అప్పటికిగానీ గుండెలు తేలికపడలేదు.

"వాణ్ని రానియ్యకూడదటే? వాడేం చేసుకునేవాడో!" అంటూ అరుస్తోనే వుంది శేషమ్మ.

"నాలుగు తిడితే నేను భరిస్తాను. అంతేగానీ ఇలాంటి వెధవ పనులు చేస్తోంటే చూస్తూ వూరుకుని... రేపు మిన్నువిరిగి మీద పడ్డప్పుడు నెత్తీనోరూ బాదుకుంటానా?"

"అయినా నీ పిచ్చిగానీ — మొన్న పండక్కి వాయిదాలమీద టెర్లిన్ చీర కొనుక్కోమంటే విన్నావుకాదు. పోనీ వ్హాడెవడో దేవుళ్ళా పంపించాడు. నువ్వు తీసుకోకపోతే కాంతానికైనా వుంచుదామనుకున్నాను. పాపం అదిఅలాంటి చీర కావాలని తెగ దేవుళ్ళాడింది. వెనకాముందూ చూడకుండా వాణ్ని వెళ్ళగొట్టావు."

కమల ఒళ్ళు మండిపోయింది — "మొగవాళ్ళు వెధవపనులు చేస్తున్నారంటే కారణం ఎవరో కాదు. మనమే. పండక్కి టెర్లిన్ చీర కోసమని నేను కూర్చుంటే ఆయన గడ్డి కరవటంతప్ప మరో దారేవుంది?

"మీరు పెద్దవారు కూడాను. మంచి చెడ్డలు తెలుసుకోవాల్సిన వాళ్ళు. ఉన్నంతలో నీతిగా నిజాయితీగా బ్రతకాలని బిడ్డలకి బోధించాలిగానీ..." అక్కడికి ఆపేసి— ఈవిడతో వాదనేమిటన్నట్టు లోపలికి పోయింది కమల.

కమల ఆలోచనలు చాలా గాఢరాగా సాగాయి. మధూ మారిపోతున్నాడా? డబ్బు చిక్కుల్లోపడి ఇలాంటి పనులేమైనా ప్రారంభించాలనుకున్నాడా? లేకపోతే అవతలివాడికెంత సాహసం—లంచం తినిపించటానికి?

సాయంత్రం ఐదు గంటలవేళ మధుమూర్తి రానే వచ్చాడు. శేషమ్మ అంతా ఏకరువు పెట్టింది— "వాడు తీసుకుపోయేవరకూ వూరుకుందిగాదు నీ పెళ్ళాం. అక్కడికీ నేను చెప్తోనే వున్నాను వాణ్ణి రానివ్వవే అని."

"ఆ ఉత్తరం ఏమైంది."

"చదివిందో లేదో ఫర్రుమంటూ ముక్కలు చేసింది."

"కమలా!" అంటూ కేకపెట్టాడు మూర్తి—"వుత్తరం చించటం ఏమిటి? నేను చూసేవాణ్ణిగా?" అన్నాడు కోపంగానే.

కమల తెల్లబోయినా తమాయించుకొంటూ—"నాకా కోపంలో ఏమీ తెలీలేదు. చించేశాను." అంది.

"అదే వుంటే దాన్ని కోర్టులో పెట్టి వాడికో వార్నింగు యిప్పించేవాణ్ణి."

కమల మొహం వికసించింది—

"దొంగ రాస్కెల్! పొద్దున్న ఆఫీసుకి వచ్చాడు. ఏదేదో వాగాడు. ఆ పనేదో అయినప్పటికే అవుతుందని ఖచ్చితంగా చెప్పేశాను. ఇంటికిపోయి వాడు చేసిన పనియిదన్నమాట. అందితే జుట్టూ, అందకపోతే కాళ్లూను. ఏ గుమాస్తాచేతో రాయించి వుంటాడు ఉత్తరం. కోర్టుకు కూడా దొరకళ్ళే."

కమలకి ఆనందం ముంచుకువచ్చింది. "అత్తయ్య తీసుకుందామని చాలా గొడవ చేశారు. నేనే వద్దన్నాను."

"మంచిపని చేశావు కమలా! నిజంగా మనం చాలా అల్లరి పడిపోయేవాళ్ళం. కలో — గంజో తాగుదాంగానీ—ఆ పాపిష్టి సంపాదన మనకి వద్దు. శాంతి వుండదు."

మధుమూర్తి మాటలు వింటోన్నకొద్దీ కమల నోటంట మాటే రాలేదు.

శేషమ్మ ఆ చుట్టుపట్ల లేదు.

• • •

జేబులోంచి నలభై రూపాయలు తీసి తండ్రికి అందించాడు మధుమూర్తి పెళ్ళికి వెళ్ళటానికి—పెళ్ళికూతురి చేతిలో పెట్టడానికీను.

వచ్చి చదువుకుంటోన్న కమల పక్కన కూర్చున్నాడు. ఆ మొహంలో కొత్తరకం దైన్యం - వేదనా కన్పించాయి.

నెమ్మదిగా పుస్తకం తెరుచుకుని తన చదువులో నిమగ్నం కాబోయింది కమల.

"కమలా!" అపదలో పిల్చినట్టే పిల్చాడు నీరసంగా.

కమల విస్మయంగా తలెత్తింది. మధుమూర్తి చేతిని ఒడిలోకి తీసుకుంది — "ఎందుకలా వున్నారు?" అంది ఆప్యాయంగా.

"నాలుగు రోజుల నుంచీ ప్రయత్నిస్తోంటే ఇవ్వాళ డబ్బు పుట్టించేసరికి తాతలు దిగివచ్చారు. ఎలాగో అయిందిగానీ, ఇలా ఇంకెంతకాలం జరుగుతుందో నాకేం అర్థం కావటం లేదు."

కమల ఒక్కక్షణం భర్త కళ్ళ లోకి చూసి అంది — "ఈ ఇంట్లో ఇబ్బందులకు కారణం ఎవరో చెప్పనా ?"

"ఎవరు ?"

"ఇంకెవరు ? మీరే !"

"అవునేమో !"

"మీరు మనస్ఫూర్తిగా అనటం లేదు. తెలుస్తోనే వుంది. పరిస్థితు లన్నీ అనుకూలంగా వున్నప్పుడు మనం సుఖపడి పోయామంటే అందులో విశేష మేమీ లేదు. అలా లేనప్పుడే సుఖపడటానికి మన ప్రయత్నాలు మనం చెయ్యాలి. అది కనీస ధర్మం. ఏదీ పాటించకుండా వాపోయే వాళ్ళంటే ఎంత ఆపదలో వున్నా సానుభూతి కూడా చూపించ బుద్ధి కాదు."

మధుమూర్తి మాట్లాడ లేదు.

"నేను మీకు పాఠాలు నేర్పు తున్నా ననుకోకండి. సంసారం అంటే ఒక పద్ధతీ పాడూ వుండాలి. చేసే ఖర్చులకో లెక్కా పత్రం వుండాలి. కరివేపాకు దగ్గర కూడా దూబరా జరక్కూడదు. ఒక్క పైసా కూడా అనవసరంగా ఖర్చుపెట్ట కూడదు. మన స్థితి ఏమిటి ? తాహతు ఏమిటి ? ఏది అవసరం ? ఏదికాదు ? — అని వివేకంతో ఆలోచించుకొంటూనే వుండాలి. చేతులు కాలేక ఆకులు పట్టుకుని యితర్ల దయా ధర్మాల కోసం అర్థించే పరిస్థితి తెచ్చుకో కూడదు. ఆర్థికంగా బలంగా వున్నప్పుడే నీతి నిజాయితీలు కూడా నిలువుకో గలుగుతాం. 'ఆర్థిక పత నమే నైతిక పతనానికి దారితీస్తుంది' అంటూంటారు మా నాన్న. నిజంగా ఆయన ఎంతో పొదుపుగా - ఎంతో నైపుణ్యంగా - ఎంతో ఖచ్చితంగా - ఖర్చుచేస్తూ ఆరుగురు పిల్లల్ని పెంచు కొన్నారు, పెళ్ళిళ్ళు కూడా చేశారు. అంటే నేను చెప్పే సూత్రాలన్నీ గాలికబుర్లు కావు సుమా ! అని చెప్పటానికే ఆయన విషయం చెప్పాను."

మధుమూర్తి దీనంగా అన్నాడు- "నన్నేం చెయ్యమంటావు కమలా? పరిస్థితులన్నీ నువ్వు చూస్తోనే వున్నావు. నా వల్ల ఒక్క కానీ కూడా అనవసరం ఖర్చు కావటం లేదు. సిగరెట్లు మానేశాను. సిని మాలు కూడా బాగా తగ్గించేశాను. ఇక నేనేం చెయ్యగలను ?"

"అలా అంటునే నాకు చిరాకు వేస్తుంది. పెద్దవాళ్ళై ఆలోచించ గలిగే శక్తి వచ్చాక - కొన్ని విష యాలు గ్రహించి పాటించి తీరాలి. మీ సంసారం గురించి మీరుచెయ్య లేననుకోవటం ఏమిటి ? సంపా దించేది ఒకరూ — ఖర్చు పెట్టేది మరొకరూ అయినప్పుడు—ఇలాంటి ఇబ్బందులే వస్తాయి, బాధ్యతా రహితంగా సంసారంచేస్తే యిలా తప్పల తక్కెడలాగే వుంటుంది."

కమల వుద్దేశ్యం మధుమూర్తికి అర్థంగాక పోలేదు. ఇంటి పెత్తనం తల్లి చేతుల్లోంచి తప్పించమంటుంది.

"ఆ వివేకం ఆవిడకు వుండాలి గానీ నేనేం చెప్పగలను కమలా ! కోడలి మాటలు విని కొడుకు ఏదో అన్నాడని వాళ్ళు బాధపడతారు."

"నా మాటలు మీరు విన్నారని మీ అమ్మగారు అనుకుంటే మీకేం సిగ్గుచేటా ? తలవొంపా ?"

"ఛ ! ఛ! అదికాదు. లేనిపోని నింద నీ మీద పడుతుంది."

"ఎన్ని నిందలు పడ్డా — మీరు నన్ను అపార్థం చేసుకోనంత వరకూ నాకేం లక్ష్యంలేదు. మన సంసా రాన్ని మనం తీర్చి దిద్దుకోవటంలో తప్పేంలేదు. పూర్వం వాళ్ళు కూడా ఎదిగిన పిల్లలకి ఇళ్లూ వాకిళ్లూ అప్పగించి — వానప్రస్థం పోయేవారని మనం చదవ లేదూ ? పురాణాల్లో మిగతావన్నీ ఆదర్శాలే గానీ—అది ఆదర్శంకాదూ ?

సరే ! మీ కంత సాహసం లేనప్పుడు కనీసం ఆవిడ చేస్తోన్న ఖర్చులన్నా కొన్ని మాన్పించండి. మీ కెంత రాబడి వస్తోందో— ఎంత ఖర్చు అవుతోందో—నెలనెలా అప్పు ఎలా పెరుగుతోందో—దానికి కారణం ఏమిటో—ఆవిడకి వివరంగా చెప్పండి.

ఫస్టుకి తెచ్చిన సరుకులు మళ్ళా ఫస్టువరకూ సరిపెట్ట మనండి. ఈ మధ్యలో అప్పులు యివ్వటం

గానీ—అప్పులు తేవటంగానీ—వల్ల కాదని చెప్పండి.

నెలనెలా వాళ్ళిద్దరి ఖర్చుకి—పదో పదిహేనో ఇచ్చేస్తూ వుండండి. ఏ సినిమాలు చూసినా — ఏ డ్రామాలూ చూసినా — అన్నీ అందులోనే సర్దుకోమని చెప్పండి.

వదినకి డబ్బు పంపించటం మానెయ్యండి. ఆ డబ్బు బ్యాంకులో వేస్తూ వుండండి ...... అలా సందర్భాన్నిబట్టి అవసరాలూ ఖర్చులూ తగ్గించుకొంటూపోతే మనకి అప్పు ఎందుకవుతుంది? మీకి చికాకు లెందుకు వస్తాయి? ఎస్టిమేషన్ లేని వ్యవహారం ఏదైనా సరే ఎలా వుంటుందో మీకు తెలీదూ?"

కమల చెప్పిందంతా విస్మయంగా విన్నాడు మధుమూర్తి. 'నిజంగా నీ చేతిలో సంసారం నడిస్తే ఎంత ప్రశాంతంగా వుంటుందో కమలా!"

"ప్రయోజనం లేని మాట లెందుకు చెప్పండి? ఇవ్వాళ్ళ మనం నలుగురమే వున్నాం. ఒక్క నాలుగేళ్ళు గిర్రున తిరిగేసరికి మరో నలుగురు వుంటారు యింట్లో. ఈ సంసారం ఇలాగే సాగితే ఆ నాటికి పరిస్థితి ఎంత దిగజారుందో ఆలోచించండి." కమల సిగ్గుని వెనక్కి నెట్టి మనస్సులో మాట కాస్తా వెల్లడించక తప్పలేదు.

"నిజమే! కమలా!" అన్నాడు మధుమూర్తి భార్య గర్భం కేసి చూస్తూ.

కమలకి ఏడో నెల. తను తండ్రి కూడా అవుతున్నాడు. ఖర్చులూ—బాధ్యతలూ ఎక్కువ కావటం లేదూ?

"నీ వుద్దేశ్యాలన్నీ ఎంతో బావుటాయి కమలా! కానీ ఆచరించాలంటే నా శేవితో ధైర్యం చాలనట్టు వుంటుంది. అమ్మ ఏమనుకుంటుందో నన్పిస్తుంది."

నిట్టూర్చింది కమల — "అనుకుంటే అనుకో నివ్వండి. క్రమంగా అవిడే తన అవివేకం తను తెలుసుకొంటుంది."

తల్లికి లేని వివేకాన్ని కొడుకు నేర్పి భవిష్యత్తు బాగుచేసుకోవాలన్నది కమలవాదం!—

అదే ఆ కొడుక్కి అసాధ్యం!

● ● ●

అత్తింటు కాలు పెట్టిన తర్వాత గడచిన ఆ ఒక్క సంవత్సరంలోనూ తెలుసుకున్న విషయాలతో కమల ఒక నిర్ణయానికి వచ్చేసింది—

మధుమూర్తికి బాధ్యతలు తెలిస్తే తప్ప ఇక తమ సంసారంలో మార్పు జరగదని.

అడుగడుగునా అనుభవమౌతోన్న ఆ మనఃక్లేశం మరో ఆరేళ్ళపాటు నిత్య నూతనంగా—నిరాటంకంగా సాగింది.

అవే సమస్యలు! అవే ఇబ్బందులు! అవే చికాకులు! అవే మనస్పర్థలు! అంతా చర్విత చర్వణం.

రెండోఏట ఆ యింటి సభ్యులలో మరో పసివాడు కలిశాడు.

అంతా తల్లిలా తెల్లని రంగూ! చక్కని రూపం! అలాంటి బిడ్డని కన్న తల్లిదండ్రుల ఆనందం కమలా మధుమూర్తీ బాగా అనుభవించారు.

మనవణ్ణి చూడ్డానికి వియ్యాలవారింటికి వెళ్ళిన శేషమ్మ—పసివాణ్ణి—"వెంకట్రావుడూ!" అంటూ పిలవనే పిల్చింది. తాతయ్యపేరు పెట్టుకోడానికి పుట్టావుట్రా?" అంటూ ముద్దు లాడింది.

నిజానికి అంత పాత పేరు కొడుక్కి పెట్టడం కమలకి బొత్తిగా యిష్టంలేదు. తన వుద్దేశ్యం మధుమూర్తి దగ్గర వెల్లడించింది స్పష్టంగా.

"నిజమే. నాకు బాగా లేదు కమలా! నాగరీకంగా వుండే కొత్త పేరేదైనా పెడితే బాబు అందానికి తగ్గట్టు వుంటుంది. కానీ... ఎలా?"

"ఎలా ఏమిటి? తల్లీదండ్రులం మనకి నచ్చని పేరు మన బిడ్డకి పెట్టి తీరాల్సిన అగత్యం ఏమిటి?"

"అగత్యం అని కాదు. అమ్మా నాన్నా ఏమైనా అనుకుంటారేమో!"

"అనుకోనివ్వండి. వాళ్ళ ఉద్దేశాలూ మన అభిరుచులూ కలియనప్పుడేం చేస్తాం?"

"అలాకాదు కమలా! నువ్వు ఆలోచించు. ఈ సాంప్రదాయం మనకి కొత్తగా వచ్చిందేంకాదు. మనవడికి తన పేరు పెట్టుకోవాలని ప్రతీ తాతా ముచ్చటపడతాడు. తను చచ్చిపోయినా మనవడి పేరుతో పదిమంది మధ్యా ఇంకా బ్రతికే వుంటానని తృప్తిపడతాడు. పెద్దవాళ్ళలా కోరుకోవటంలో తప్పేంలేదుగా?"

"మీ అభిప్రాయానికి తప్పేం లేకపోవచ్చు. నాకు మాత్రం ఆ సాంప్రదాయంలో చాలా మూర్ఖత్వం కన్పిస్తోంది. మనిషి — తను సంపాదించుకున్న కీర్తి ప్రతిష్ఠలతోనో — మంచితనంతోనో — చిరకాలం జీవించగలడుగానీ, తన పేరు ఓ పసికందుకి అంటగట్టి ఆ విధంగా లోకంలో వుండిపోవాలని ఆలోచించటం అవివేకం.

మీ తండ్రిపేరు మీ కొడుక్కి—అలాగే మీ పేరు — మీ మనవడికి.

మళ్ళా మీ కొడుకు పేరు — వాడి మనవడికి—అంటే మీ తండ్రి పేరూ—మీ పేరూ — తరతరాలకూ చాలు మీ వంశంలో.

ప్రపంచంలోకి కొత్తగా కాలు పెట్టిన పసివాడికి ఓ ప్రత్యేకతేమీ వుండటానికి వీల్లేదు. 'వాడికోసం—

వాడి తాతపేరు — అదే ముత్తాత పేరు—అదే పూర్వీకుడి పేరు—అదేదో కొన్ని తరాలకు ముందే స్థిరపడి పోయి వుంది. అవునా ? ఇంత హృదయంలేని సాంప్రదాయాల కోసం—మన యిష్టాలెందుకు అణుచుకోవాలో చెప్పండి.'

"కమలా !" నిస్పృహాయంగా అన్నాడు మూర్తి. "—నీ వుద్దేశ్యాలు నేను సమర్థిస్తున్నాను. అంతకు మించి ఏమీ చెయ్యలేను. నన్ను నువ్వెలా అర్థం చేసుకున్నా సరే ! తాతగారి పేరు పెట్టలేదేమని నలుగురూ అడిగితే మా అమ్మా నాన్నా చాలా సిగ్గుపడతారు. మనం ఆలోచించినంత వివేకంతో వాళ్ళు ఆలోచించరు కదా ?

పోనీ - నాకోసం - నా తృప్తి కోసం ఈ విషయంలో అడ్డు చెప్పకు. బాబుని "రామం" అని పిలుద్దాం. అలా పిలిస్తే మోటుగా కూడా లేదు."

కమల వూరుకొంది. బాబు విషయంలో హక్కులూ — బాధ్యతలూ అన్నీ తన ఒక్క దానివేకావు. బాబు తండ్రిని అంతకన్నా ఎక్కువ అజ్ఞాపించలేదు— "సరే ! మీ ఇష్టం." అంది.

"నీకు నచ్చిందా ? నిజంచెప్పు."

"నచ్చింది. బాగానేవుంది" వెంకట్రావుడూ ! అనకుండా 'రామం' అని పిలిస్తే బావుంది,"

మధుమూర్తి గుండె తేలికపడింది. కమల ధోరణిచూసి తల్లిదండ్రులతో పెద్ద నిష్ఠూరం వస్తుందనే అనుకున్నాడు.

రామం తాతగారికి - నాయనమ్మగారికి బాగా యిష్టుడే అయ్యాడు.

కుయ్ మని రాగం ప్రారంభించేసరికి - "రావుఁడు ఏడుస్తున్నాడు. అద్దం వేసుకోవే ! ఒసే కమలా ! పాలియ్యవే !" అంటూ పలహాలిస్తూంటాడు మామగారు కోడలికి.

మనవడు కోడలి ఒళ్ళో పడుకుని పాలు తాగుతోంటే ముసలాయన గదిలోకి వెళ్ళి — చిటికెలు వేసి పిలుస్తూ—"ఒరే రావుడూ ! ఇలా చూడు. కడుపు నిండిపోయిందా ? నాతో వస్తావా ? అలా తిప్పి తీసుకొస్తాను, రామ్మా ! రా ! రావాలి మరి." అంటూ కోడలికి ఓ గజం దూరంలో నిలబడతాడు.

కమల శరీరం అసహ్యంతో ముడుచుకు పోతుంది. పైట తీసి ఒంటినిండా కప్పుకొంటుంది. చంటి వెధవ పైటలోంచి తల ఎత్తి తాతగారికేసి ఓ బోసినవ్వు విసిరి—మళ్లా తల్లి పైటలో దూరి కాళ్లూచేతులూ తన్నుకొంటూ పాలకోసం తడుముకుంటాడు.

(సశేషం)



సిక్స్త్ సెన్స్

బీనాదేవి

"ఈ చోద్యం విన్నారా ? పాకిస్తాన్తో వేదాంత్లేవుట !"

"సిక్కిమ్మ సిన్నకూతుర్ని సూసినావా గురూ ? ఎంత పోనాదో ? యీవుమీద యిస్త్రీ పెట్టెయ్యెచ్చు"

"ఇట్స్ ప్లెజర్ మీటింగ్యూ."

"క్లాస చంటాణ్ణి అంద... తల్లీ"

"పొట్టివాడైనా గట్టి... మన లాల్ బహాదూరు."

ఈ థర్డ్క్లాస్ గొడవేమీ ఫస్ట్ క్లాస్ దగ్గర నిలబడ్డ ఎ. ఎస్. పి. రాజేశ్వర్రావుకి వినిపించలేదు. అతను ఫస్టుక్లాసు గొడవగాని, థర్డ్ క్లాస్ గొడవగాని వినిపించుకొనే స్థితిలో లేడు. తనే ఫస్టుక్లాసుకి మించిన ఒక పెద్ద ఎయిర్ కండిషన్డ్ గొడవలో పడిపోయేడు.

ఎయిర్ కండిషన్లో వున్నట్టే వళ్ళంతా చల్లబడిపోతూంది, ముండు గంటల ఎండ పన్నెండు గంటల దానా పేలిపోతున్నా, తల్లోమాత్రం బేస్ ఫర్నేస్ మండుతున్నట్టుంది. అలా వూర్లో వున్న నాళ్లన్నింటిలో ఈ మూణ్ణెల్ల యిదవుతోంది. రోజులు డాక్టర్ రాధ చుట్టూ పెంచిన ప్రేమలతను ఆమెకు చూపకుండానే దానిగురించి ఆమెకు చెప్పకుండానే

వెళిపోతున్నాడు. అలా వెళిపోవల్సి వచ్చింది. "ఈ మూణ్ణెల్ల ఇరవైరోజుల్లోనూ ఎవరూ యింకెవర్నీ ఒక జీవితకాలంలో ప్రేమించలేనంత ప్రేమించేను రాధా" అని ఆమెతో చెప్పాలనీ, యింకేమేమో చెయ్యాలనీ అతనికి ఎంతగానో వుంది. కాని చుట్టూ ఎంతో మంది యూనిఫారాల్లో వున్న సబార్డినేట్సున్నారు. ప్రపంచమంతా తోలు జోళ్ళతోనూ, తోలు పటకాలతోనూ, సబార్డినేట్సు తోలు మొహాల్లోనూ చేసినట్టుంది తోలు కంపు కొడ్తోంది.

రాజేశ్వర్రావు ఆ వూరొచ్చి సరిగ్గా నాల్నెల్లైంది. వచ్చిన మర్నాడే పెళ్ళికాని డాక్టర్రాధని చూసేడు. మర్నాటి వరకూ ఆగకుండా చూసినప్పుడు 'ఈమెను పెళ్ళాడేవాడు ధన్యుడు' అన్న నిశ్చయానికి వచ్చేడు. మర్నాడు మాత్రం ఆ ధన్యత తనకే ఎందుకు దక్కకూడదని తర్కించుకున్నాడు. నెల తిరక్కుండా తనకే చెందాలని నిశ్చయించుకున్నాడు. రెణ్ణెల్లకే తన రైవల్ సూటర్ డాక్టర్రాజు మీద ప్రొహిబిషను కేసు పెడదామా, పేకాటకేసు పెడదామా అని ఆలోచించేడు. అతని ఆలోచన తేలేలోగానే డాక్టర్రాజు ట్రాన్స్ఫరై వెళిపోయేడు. అప్పుడు గవర్నమెంటుద్యోగులకు ట్రాన్స్ఫరుండడం మంచిదనుకున్న రాజేశ్వర్రావు తనకి ట్రాన్స్ఫరాగానే తన అభిప్రాయం మార్చుకున్నాడు.

రాజేశ్వర్రావుకి తన డిపార్టుమెంటు ఓవర్హాల్ చెయ్యాలనీ, చెయ్యవలసిన అవసరం ఎంతేనా వుందని ఎప్పుడూ అనిపిస్తుంది. శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాడు కూడా. "ఫర్వాలేదు. కష్టపడి పని చేస్తే ముందుకొస్తాడు" అన్నాడు తననైనా పొగుడుకోలేని ఎస్పీ రాజేశ్వర్రావు గురించి.

ఈ ఊరొచ్చిన కొద్ది రోజులకే మంచిపేరు అలవాటు ప్రకారం తెచ్చుకున్నాడు రాజేశ్వర్రావు. అతనొచ్చేక సైకిల్ చోరీలు తగ్గిపోయెయి. వ్యభిచారం గూఢంగానే సాగేది. అతను "రౌడీల్లో రౌడీ, తగు మనుషుల్లో తగుమనిషి" అని వర్ణించేరు ప్రజ. అతని సబార్డినేట్సుకి మాత్రం అతన్లో తగు మనిషి చిహ్నాలు తక్కువగానే కనిపించేయి.

"మన డిపార్టుమెంటుకి పరువూ మర్యాదా లేకుండా పోయేయి. దానికి కారణం సహాం చరిత్రా, సహాం మనమూను.

ఏ రాష్ట్రంలో ఎవరికి ఏ భాష వద్దన్నా, ఏ ఊళ్లో ఎవరికి బియ్యం తక్కువైనా, ఏ పల్లెలో కిరసనాయిలు సమంగా కాలకపోయినా ముందు తన్నుతినేది మనం. దీనికి కారణం పూర్వం మనవాళ్ళు తెల్లయముళ్ళ భటుల్లా ప్రవర్తించటమే.



ఇక పోతే మనం ప్రస్తుతం చేసే పనులుకూడా ఏమంత బావుండలేదు. మన్లోనే కొంతమంది — ఎక్కువమంది కాకపోవచ్చు— పాకెట్టు కొట్టేవాళ్ళకి పెర్మిట్లిస్తున్నారు. సారా వండేవాళ్ళకీ, అమ్మేవాళ్ళకీ లైసెన్సులిస్తున్నారు — ఈ చీడ పురుగులు నశించాలి.

మన డిపార్టుమెంటుకి సరైన కీర్తి రావాలంటే సారా అమ్మించడం, దొంగతనాలు చేయించడం మానేసినంత మాత్రాన సరిపోదు. నేరాలు జరిగేక ముద్దాయిలను పట్టుకున్నంత మాత్రాన చాలదు.

అసలు నేరాలే జరక్కుండా చూడాలి. దీనికి దొంగని చూడగానే గుర్తించే శక్తి మనకుండాలి. మనక్కావలసింది—ఒక విధమైన సిక్స్త్ సెన్స్. నాకు తెలుగు సరిగ్గా రాదు. దాన్ని మీరు ఆరో ఇంద్రియమే అంటారో, ఆరో జ్ఞానమే అంటారో అనండి. కాని ఆ సెన్స్ మనందరికి వుండాలి. దాన్ని మనమంతా కల్టివేట్ చెయ్యాలి" అని రాజేశ్వర్రావెప్పుడూ బాహాటంగానే అంటూ వుంటాడు తన సబార్డినేట్సుతో.

తన సన్నిహిత స్నేహితుల్తో మాత్రం ప్రైవేటుగా "వెల్లూర్లోనూ, అనంతపూర్లోనూ తయారయే ఈ నాటు సరుక్కి ఎక్కణ్ణించి వస్తుందీ సెన్సు? మౌంట్ అబూలో తర్ఫీదయ్యే మాకు— అంటే ఐ.పి.యస్.

వాళ్ళకి మాత్రం వద్దన్నా వస్తుంది" అంటాడు.

ఈ వూర్లో తన సబార్డినేట్సులో ఒకరిద్దరికే సెన్సు వున్నట్టనిపించిందతనికి. వాళ్ళచేత ఆ సెన్స్ కల్టివేట్ చేయించేలోగానే తనకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరొచ్చింది.

సరిగ్గా మూడ్రోజుల కింద "విజయవాడలో ఎవరో ఎవరిళ్లో తగలబెట్టేస్తున్నారు. అక్కడికి వెళ్ళి ఏం చెయ్యాలో చెయ్, నిన్నక్కడికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం" అంది ప్రభుత్వం అతన్తో. "ఫైరింజనైన్ని యిళ్ళు ఆర్పమంటారా? అశోక సమ్రాట్టునై కొత్తిళ్ళు కట్టించమంటారా? నేనేం చేస్తాను" అని విసుక్కున్నా వెళ్ళక తప్పలేదతనికి.

ఈ మూడ్రోజుల్లోనూ తన ప్రేమ వ్యక్తం చేయడానికి రాజేశ్వరావుకి రెండు ఆటంకాలొచ్చేయి. రోజుకు మూడు పార్టీల చొప్పున యీ మూడ్రోజులు పార్టీలు యిచ్చిన స్నేహితులు మొదటి ఆటంకం. రాత్రి తప్ప పగలు ప్రసవించమనే రాధ పేషెంట్లు రెండో ఆటంకం.

వెన్నెల్లాంటి మల్లెపూలు—మల్లెపూల్లాంటి వెన్నెలా లేకపోయినా, ఎస్పీ పెళ్ళాం కోపంలా మండిపోయే ఎండలో ఎలా వ్యక్తపరచడం తన ప్రేమ అని అంతవరకూ అనుకుంటూన్న అతను "ఎండైనా వానైనా ఇప్పుడు చెప్పేద్దును ఒక్క క్షణం ఏకాంతం వుంటే" అని అనుకుంటూ వుంటే, రైలు కదలడం, గంట కొట్టడం, గంటలా ఖంగుమని "వెల్ సో లాంగ్" అంటూ జెండా ఊపినట్టు రాధ చెయ్యూపడం, జెండాలు ఊపడం, 12 జతల పోలీసు జోళ్ళ చప్పుళ్ళతో, పోలీసు సలాములు, రాజేశ్వర్రావు ఒక్కసారి రైల్లోకి దూకడం, ఒక్క క్షణంలో జరిగిపోయేయి.


"ఒక్క క్షణం ఏకాంతం, ఒక్క ఏకాంత క్షణం" అనుకుంటూ రైల్లో ప్రవేశించిన అతనికి "ఈ రోజుల్లో ఫస్టుక్లాసులో కూడా ఏకాంతం లేదని"పించింది.

పేషెంటులా వాలిపోయిన ఒక తెల్లని ఏభై అయిదు సంవత్సరాల నాజూకైన ముసలాయన శాలువ కప్పుకుని ఒక బెర్తుమీద పడుక్కున్నాడు. ఆడవాళ్ళకుండవలసిన సన్నని ఎత్తయిన ముక్కూ, శాసించే మెరిసే కళ్ళు, సిగరెట్లు కాల్చినా నల్లపడని సొంపైన పెదాలతో "కాలంలో వున్నప్పుడు చాలా కొంపలకి నిప్పెట్టి వుంటాడన్నట్టు వున్నాడు అతని జుత్తులాగే, తెల్లబడ్డ రోజున్నర పెరిగిన తెల్లగడ్డం అతనికి అందమే తెచ్చిందని ఒప్పుకోక తప్పదు. పై బెర్తుమీద అతని జిప్ సూట్‌కేసూ, హోల్డాలూ వగైరా సామానున్నాయి. అతను ఫారిన్ మాగజైను చదువుకుంటున్నాడు.

రెండో బెర్తుమీద కైతోపహా టెర్లిన్ సూట్లో వున్న 30 ఏళ్ళ నల్లటివాడు పక్కనున్న జిప్ బేగ్ లోంచి అస్తమానూ రుమాలు వేసి మొహం తుడుచుకుంటూ, నాలికతో పెదాలు తడువుకుంటూ, లేని సున్నితం తెచ్చిపెట్టుకుంటూ కూర్చున్నాడు. చేతిలో వున్న తెలుగు పత్రిక చదవకుండా. మనిషి చూస్తే టెర్లిన్ చొక్కా తొడుక్కున్న పులిలా వున్నాడు. జీవితంలో పనంటే ఏమిటో ఎరగనివాడని అతన్ని చూడగానే అనిపిస్తుంది. రాజేశ్వర్రావు కతన్ని చూడగానే అలానే అన్పించి అసహ్యం వచ్చిందతనిమీద. మేనకని చూసిన విశ్వామిత్రుడిలా ముసలాయన్ని చూడగానె రాజేశ్వర్రావు కభిమానం ముంచుకొచ్చింది. ఎంత చెప్పినా ఫారిన్ కల్చరుంది అతన్లో.

"పారిన్ వెళ్ళేవుంటా" డనుకున్నాడు రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావుని చూడగానే ముసలాయన వేలకి విలువైన నవ్వు పారేసేడు. ఉరివేసేముందు జడ్జిగారి నవ్వులా లేదా నవ్వు. కన్నతల్లి చూపులా చల్లగానూ, వెన్నెల చాటు ప్రియురాలి పలకరింపులా వెచ్చగాను వుంది. (మేనక కూడా విశ్వామిత్రుడిమీద యిలాటిదే వదిలుండాలి). ముసలాయనే స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్టు ఆఫర్‌చేస్తూ రాజేశ్వర్రావుతో మాటలు కలిపేడు. తనని తానే పరిచయం చేసుకున్నాడు. ఢిల్లీలో ఏదో పెద్ద మందుల కంపెనీకి అసిస్టెంట్ మేనేజరుట. నాల్నెలై కిడ్నీ ట్రబుల్‌తో



బాధపడుతున్నాట్ట. మరో మూణ్ణెల్లకి కాని ఆపరేషను చెయ్యమన్నారుట. ఆపరేషను చేయించుకునేలోగానే "మనవాళ్ళ" నందర్నీ చూద్దామని యీ ప్రాంతాలు వచ్చేట్ట. ఉదయం విశాఖపట్నంలో ఈ పాసింజెర్లో (ఈ మషిన్లో) ఎక్కి తెల్లవారి కాకినాడ వెళ్దామనుకున్నాట్ట. కాని తోవలో తన బాధ లావైందిట. అంచేత నేరుగా విజయవాడ వెళిపోతున్నాట్ట. అక్కడ పెద్ద డాక్టర్—కిష్టయ్య — స్నేహితుడూ, క్లాస్ మేటూనట. ప్రాక్టీసు చెయ్యక పోయినా తనూ డాక్టరేనట. అంచేత తన జబ్బు ఎంత ప్రమాదమైందో తనకి తెలుసుట. "ఏమిటో చిన్నప్పుడు నేనూ కమ్యూనిస్టునే. ఐనా జీవితంలో చాలా భాగం చూసేక మన చేతుల్లో ఏమీ లేదనిపిస్తుంది, రేపొచ్చేది మనకు తెలియదు. కాస్తో కూస్తో హోదా వుంది. రెండు కార్లున్నాయ్. కావలసినంత డబ్బుంది. లక్ష్మీదేవిలాంటి ఇల్లాలుంది. అందొచ్చిన పిల్లలున్నారు. ఎన్నుంటే ఏం లాభం? దిక్కులేని చావు విజయవాడలో చావమని నాకు రాసేడేమో. ఇది చూసేకైనా భగవంతుణ్ణి మనం నమ్మక తప్పదు. వాడి ఆజ్ఞేదీ మనం కాదన్లేం" అని ముగించేడు ముసలాయన.

ముసలాయన వేదాంతం ముసలాయనాగే సింపుల్‌గానూ, కన్విన్సింగ్‌గానూ కన్పించింది రాజేశ్వర్రావుకి. అతని పరిస్థితికి చాలా బాధపడ్డాడు కూడా రాజేశ్వర్రావు.

ఆ తర్వాత ముసలాయన చాలా విషయాల గురించి చాలా చక్కగా మాట్లాడేడు. సాధన, సావిత్రిలలో ఎవరు గొప్ప? కామరాజు నాడార్కి, క్రెజర్కి వున్న పోలికలేమిటి? వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో పవర్లోకి రావడానికి కమ్యూనిస్టులకున్న ఛాన్సెస్ ఏమిటి? వాళ్ళు పరిపాలనకు వస్తే ఆ గండం తప్పించుకుందికి ప్రజలకున్న ఛాన్సెస్ ఏమిటి? అన్నీ తాను అలసిపోయినట్టు తెలీనివ్వకుండా నెమ్మదిగా వివరించేడు ముసలాయన. కాని అతను వినిపించనివ్వని మూలుగు రాజేశ్వర్రావుకి విని పిస్తూనే వుంది. అర్ధరాజ్యం, కన్నకూతుర్నీ యివ్వడానికి రాజేశ్వర్రావు పాతకాలం రాజు కాడు. కాని ముసలాయనకి చేతనైన సాయం చేయాలన్పించింది. రాజేశ్వర్రావుకి, అతన్ని లేవనీకుండా అతనికి ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసిచ్చేడు. అతనికి తగిలేట్టు ఫాన్ ఫిక్స్ చేసేడు. అతని సిగరెట్టుకి అగ్గిపుల్ల వెలిగించేడు.

ఏదో స్టేషన్లో కుర్రిన్ను పులి దిగిపోయేడు. అతను అంతవరకూ ఒక్క మాటైనా మాట్లాళ్లేదు. అతను దిగిపోగానే అతని గురించి రాజేశ్వర్రావు "అతనేం చేస్తున్నాడంటారు" అనడిగేడు ముసలాయన్ని. "ఏ పనీ వున్నవాళ్ళా లేడు."


"ఐతే లేడీ డాక్టరు మొగుడై వుండాలి."

"లేకపోతే నోట్లు అచ్చుకొట్టేవాడైనా ఐవుండాలి" అని శ్రుతి కలిపేడు ముసలాయన.

తర్వాత కొంతసేపటికి ముసలాయన బాత్‌రూములోకి వెళ్ళేడు. ఓ నిమిషమయ్యేక బాత్‌రూము తలుపు కొరగా తెరచి తల బైటికి పెట్టి "దయచేసి ఆ బేగ్ కాస్త యిలా యిస్తారూ" అన్నాడు.

ఆ క్షణంలో అతన్ని ఎత్తుకు పరిగెత్తమన్నా పరిగెత్తాడు రాజేశ్వర్రావు. ఆ కొద్ది సేపట్లోనే ముసలాయన మొహం బాధతో వంకరుపోయింది బలవంతాన ఎవరో గొంతు పిసికేస్తున్నట్టు గుడ్లు బాగా పైకి వచ్చేసేయి. వంట్లో వున్న రక్తమంతా మొహంలోకి దిగిపోయినట్టు, నల్లగా వుందా అని అనుమానం వచ్చేట్టు ఎర్రబడిపోయిందతని మొహం. పురినొప్పులపడ్డ పసిపిల్ల పిలుపులా దీనాతిదీనంగా వుందతని మాట.

రాజేశ్వర్రావు చప్పున బేగ్ అందించేడు. అందుకుని ముసలాయన మళ్ళీ తలుపు వేసేసుకున్నాడు. తొలిరాత్రి భార్య రాక కోసం ఎదురు చూసే భర్తలా రాజే



శ్వర్రావు ఆత్రంగా బాత్‌రూము డోర్ వేపు చూస్తూ కూర్చున్నాడు.

కొన్ని నిమిషాలయ్యేక తలుపు తెరుచుకుని తల్లిని తగలబెట్టిన వాళ్ళా తడిపంచ భుజాన వేసుకుని ముసలాయన బైటకువచ్చి నీరసంగా గోడకు చేరబడిపోయేడు. అతను మరో పంచకట్టుకుని వున్నాడు. రాజేశ్వర్రావు సానుభూతితో నడిపించుకు తీసుకొస్తూవుంటే 'గుడ్ గాడ్. రక్తం పడ్తోంది. ఇట్ హేజ్ స్టార్టెడ్ బ్లీడింగ్' అన్నాడు ముసలాయన.

ముసలాయన్ని బెర్తుమీద పడుకోబెట్టి నిండా శాలువ కప్పి 'ఇంకెంతసేపు? ఇంకో రెండు గంటల్లో చేరిపోతాం. రెస్టు తీసుకోండి' అని సలహా యిచ్చి రెండో బెర్తుమీద బైటకు చూస్తూ కూర్చున్నాడు రాజేశ్వర్రావు.


బైటంతా దైవ సృష్టిలా వుంది.

ప్రకృతంతా ఆకుపచ్చ చీరకట్టిన గర్భవతిలా నిండుగా వుంది.

ఎన్నో పూదోటలతో సయ్యాటలాడిన చిరుగాలి ప్రియురాలి ముంగురులని ఊపినట్టు పచ్చటి చేలని ఊపుతోంది.

నెత్తిన గంపల్తో వయారంగా ఉల్లాసంగా కొత్తకోడళ్ళలా నడిచిపోతున్నారు రంగురంగుల చీరలు కట్టిన పల్లెపడుచులు.

తారతమ్యం లేకుండా అందరికీ



అన్నిటికి బంగారుపూతలు పూస్తున్న అస్తమించే సూర్యుడు.

వీటన్నిటికీ అపశ్రుతిలా ముసలాయన బాధతో మూలుగుతున్నాడు.

• • •

రైలు విజయవాడ చేరేసరికి రాత్రి తొమ్మిద్దాటింది. ఊరు తగలబడిపోతున్నట్టు తగలబడి పోతోంది ఊరు. ఆకాశమంతా నల్లమబ్బుల్లాంటి పొగల్తోటీ, వాటి నల్లదనం సుస్పష్టంగా కనిపించడానికి కావలసినంత మంటల్తోటీ నిండివుంది.

భూలోకంలోని పాపం దేవుళ్ళుండే స్వర్గాన్ను తగలబెట్టేస్తుందా అన్నంత ఎత్తుకి లేస్తున్నాయి మంటలు.

రాక్షసి కన్యలు కురులు ముళ్ళు వేసుకుంటున్నట్టు సుళ్ళు తిరుగుతున్నాయి పొగలు.

వాడుకలో లేని శ్మశానంలా వుంది ప్లాట్‌ఫారం. రైల్లోంచి దిగేవారి హడావిడేగాని, ప్లాట్‌ఫారం మీద మనుష్యుల్లేరు. రైలుని చూసి పరుగెత్తుకు వచ్చేరు సి. ఐ., టూ టౌన్ ఎస్. ఐ, ముగ్గురు పి. సీ. లు,

'క్షమించండి సార్! మెన్ అంతా ఊళ్ళో డ్యూటీలో వున్నారు' అంటూ రాజేశ్వర్రావుని రిసీవ్ చేసుకున్నాడు సి. ఐ. సామాను పీ.సీ.లు దింపుతూ వుంటే 'క్షమించండి' అంటూ జారుకున్నాడు ఎస్. ఐ.

రాజేశ్వర్రావువీ, ముసలాయనవీ సామాన్లు చాలా మట్టుకు పి. సీ. లు పట్టుకున్నారు. సి. ఐ. కూడా రాజేశ్వర్రావుపెట్టె పట్టుకున్నాడు. ముసలాయన సూట్‌కేసు రాజేశ్వర్రావు ఫర్వాలేదంటూ పట్టుకున్నాడు.

టాక్సీ స్టేండు చేరేసరికి ఒకటే టాక్సీవుంది. 'ఇద్దరం ఇందులో ఎక్కేద్దాం' అని ముసలాయన్తో అని 'మీరు డ్యూటీ పాడుచేసుకోకండి. దారి చూపెట్టడానికి మాతో ఒక్క పి. సి. వస్తే చాలు' అని సి. ఐ. తో అని రాజేశ్వర్రావు వెనక సీట్లో ఎక్కేడు. అతని పక్కన ముసలాయనా, ముందు సీట్లో పి. సీ. ఎక్కేక బైలేరింది.

దార్లో నీరసంతో వణికే కంఠంతో ముసలాయన రాజేశ్వర్రావుకి కృతజ్ఞత తెలియజేసేడు. ఆవేశంతో వణికే కంఠంతో కొంపలికి నిప్పుపెట్టే ఏంటీ సోషల్ ఫోర్సెసుని శపించేడు. ఎ. ఎస్పీ. క్వార్టర్సు చేరేక రాజేశ్వర్రావుని దింపి అతన్ని టాక్సీబిల్లు ఇవ్వకుండా అతన్ని మరోసారి థేంక్ చేసి 'ఎలా వున్నదీ రేపు కబురుచేస్తా. వీలైతే నేనే వస్తా' అంటూ టాక్సీలో వెళిపోయేడు ముసలాయన.

• • •

ఊరికి రాజేశ్వర్రావు కొత్త. ఏ పని చేద్దామనుకున్నా వీలు కాకుండా ఊళ్ళో పై అధికారులూ, మినిష్టర్లూ కేంపు. వాళ్ళ మర్యాదలు చూసేసరికే పొద్దుపోతోంది. 'ఇహ యిన్వెస్టిగేషనేవిటి? నా మొహం!' అని విసుక్కుంటూనే మూడ్రోజులు గడిపేసేడు రాజేశ్వర్రావు.

నాలుగోనాడు ఉదయం మండుతున్న ఇళ్ళు ఆరిపోయినట్టుగా, తుఫాను వెలిసినట్టుగా సంతుష్టినివ్వని ప్రశాంతతతో వుంది ఊరు. ఆ ముందు రాత్రి ఇళ్ళేమీ తగులబళ్ళేదు. ఆ ఉదయమే చీటికీ మాటికీ ఒళ్ళు మండించుకునే అధికార్లు వగైరాలు వెళ్ళిపోయేరు. వాళ్ళని సాగనంపి ఇంటికొచ్చి బద్ధకంగా పక్కమీదవాలిన రాజేశ్వర్రావుకి చెంపమీద కొరడాతో ఛెళ్ళున కొట్టినట్టైంది టెలిఫోను మోగగానే.

రిసీవరు ఎత్తితే టూ టౌన్ ఎస్. ఐ. మాట్లాడుతున్నాడు.

'గుడ్ మార్నింగ్ సార్! (సలాం కొట్టిన జోళ్ళ చప్పుడు) దొంగనోట్ల అచ్చు కేసులో ముద్దాయి దొంగనోట్లతో సహా దొరికిపోయేడు సార్. రిమేండుకు పంపేలోగా మీరు చూస్తానంటే బంగళాకి తీసుకొస్తాను సార్' అన్నాడు ఎస్. ఐ.
'సర్లె. తీసుకురా' అన్నాడు రాజేశ్వర్రావు. ఖూనీలు చేసిన వాణ్ణి, నోట్లు అచ్చుకొట్టేవాణ్ణి, సినిమాలో వేసేవాణ్ణి, ఎలక్షన్లో గెల్చిన వాణ్ణి చూద్దామనే సామాన్యుని కుతూహలంతో ఏమీ విడ్డూరం లేదు.

'కాని ఎంత విడ్డూరం' అనుకున్నాడు రాజేశ్వర్రావు, జలగలాగ సాగి సలాంకొట్టి టూ టౌన్ ఎస్. ఐ. బిగ్‌సూట్‌కేస్తో సహా ముసలాయన్ని హాజరు పెట్టినప్పుడు.

కేసు వివరాలు తెలుసుకున్నాక 'నీ ఆరోగ్యం ఎలా వుంది' అని ముద్దాయి నడిగేడు రాజేశ్వర్రావు.

'వీడికేం తక్కువ సార్! ముసలి నక్కలా అలా వున్నా పులిలా నలుగురితో పెనుగులాడేడు సార్ మేం పట్టుకున్నప్పుడు' ఎస్. ఐ. జవాబు చెప్పేడు.

• • •

'తవరొచ్చిన బండికే కౌంటర్ఫీట్ నోట్లకేసులో ఒకడొస్తున్నాడని భోగట్టా చేరింది సార్. వాడి వర్ణన కూడా ముందుగానే వచ్చింది సార్. కాని మీరేం అనుకోకండి. పొరపాట్లెవరికైనా వస్తాయ్. వీడు మీతోటే వచ్చి మీ చేతే నోట్లపెట్టె మోయిస్తాడని అనుకోలేదు సార్. తప్పంతా మాదే సార్. ఇంకెప్పుడూ యిలాంటి పొరపాట్లు రాకుండా చూసుకుంటాను' అని ప్రాధేయ పూర్వకంగా రాజేశ్వర్రావుకి ఆ సాయంత్రం వివరించాడు సి ఐ, యిటుపైని రాజేశ్వర్రావు పక్కన మహాత్మాగాంధి లాంటి మనిషి నిలబడ్డా అతగాణ్ణి ఖూనీకోరుగానూ, కావు సారా చేసేవాడుగాను, చూస్తానని ప్రామిస్ చేస్తున్నట్టు.

ఆనాటినుంచి మరి సిక్స్‌త్ సెన్సు గురించి రాజేశ్వర్రావు మాట్లాళ్ళేదు.

□□□

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు

ప్రతులకు : కళాభవన్, హైదరాబాదు-4

1.	తెలుగు సామెతలు : ప్రధాన సంపాదకులు- శ్రీ విశ్వనాథ సత్యనారాయణ	10-00
2.	పదబంధ పారిజాతం (1, 2 భా॥) -శ్రీ నార్ల వెంకటేశ్వరరావు (ఒక్కొకటి)	10-00
3.	నన్నయ పదప్రయోగ కోశము " — శ్రీ అబ్బూరి రామకృష్ణారావు	40-00
4.	రవీంద్ర శతవార్షిక విశేష సంచిక " — శ్రీ ఆచంట జానకిరామ్	10-00
5.	నన్నెచోడ పదప్రయోగ సూచిక " — శ్రీ దివాకర్ల వెంకటావధాని	20-00
6.	మాండలిక వ్యవసాయవృత్తి పదకోశం "— శ్రీ బి. హెచ్. కృష్ణమూర్తి	25-00
7.	దక్షిణ భారత సాహిత్యములు	3-00
8.	సాహిత్యోపన్యాసములు 1, 2, 5 సంపుటాలు	1-50
	" 3, 4 సంపుటాలు	1-25
9.	ఆంధ్ర క్రియా స్వరూప మణిదీపిక : ముఖ్య సంపాదకులు — శ్రీ విశ్వనాథ సత్యనారాయణ	20-00
10.	ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము — కందుకూరి ఈశ్వరదత్తు	10-00
11.	సూక్తి సుధాకరము: సంపాదకులు —శ్రీ పెనుమత్స సత్యనారాయణరాజు	20-00
12.	ఉర్దూ కథానికలు : అనువాదకులు — శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి	5-00
13.	ఉర్దూ సాహిత్య చరిత్ర " — శ్రీ యస్. సదాశివ	6-00
14.	సి. పి. బ్రౌన్ " — శ్రీ కొత్తపల్లి వీరభద్రరావు	5-00
15.	ఆంధ్ర శతకావళి : అనువాదకులు — శ్రీ తి. గు. వరదాచార్యులు	1-50
16.	శ్రీ మహా భాగవతము: (సంపాదకులు — శ్రీయుతులు రాయప్రోలు సుబ్బారావు, దివాకర్ల వెంకటావధాని, తాపీ ధర్మారావు, దీపాల పిచ్చయ్యశాస్త్రి, డా॥ బి. రామరాజు)	20-00
17.	సూరదాసు పదాలు : అనువాదం — శ్రీ దుర్గానంద్	1-00
18.	రాఘవాభ్యుదయం : సంపాదకులు — డా॥ బి. రామరాజు	4-00
19.	రసగంగాధరం : అనువాదం —శ్రీ ధరిణికోట వెంకటసుబ్బయ్య	6-00
20.	అమ్జదీ రుబాయిలు : అనువాదం — శ్రీ సదాశివ	1-50
21.	సుమతి వేమన శతకాలు : అనువాదం—శ్రీ యస్. టి. జి. వరదాచార్యులు	1-00
22.	అఖిలభారత కవయిత్రులు: సంకలనం—శ్రీమతి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ	7-00
23.	ఉత్తర భారత సాహిత్యములు	4-50
24.	విష్ణు పారిజాతం రచయిత్రి — తరిగొండ వెంగమాంబ	2-50
25.	ఉత్తర రామచరిత్ర : సంపాదకులు — శ్రీ నేలటూరి రామదాసయ్యంగార్	8-00
26.	ఆంధ్రదేశ హాస్య కథలు — శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి	0-75
27.	నెహ్రూ సంచిక : సంపాదకులు — శ్రీ ఆదపా రామకృష్ణారావు	8-00
28.	బ్రౌన్ డిక్షనరీ	30-00

పుస్తకాలు

రాధా మాధవమ్

వచన గ్రంథాలను అనువదించడం కంటె పద్యకావ్యాలను భాషాంతరీకరించడం కష్టసాధ్యమైన పని. మూల గ్రంథాలమీది అభిమానం కొద్దీ ఈ సాహసం చేసేవారు తెలుగులో తరచుగా తగులుతూనే వుంటారు. ఇటువంటి ప్రయత్నాలలో ఏ స్వల్పమో తప్ప మిగతావన్నీ మూల గ్రంథానికి అపచారం చేసేవిగానే మిగిలిపోతున్నాయి. అసలు గ్రంథానికి నూటికి నూరుపాళ్ళు న్యాయం చేయడం అసంభవమనే చెప్పాలి. నన్నయ, తిక్కనల భారతాంధ్రీకరణానికే ఇటువంటి వాదు తప్పలేదు. అసలు పద్యానువాద ప్రక్రియలోనే ఈ చిక్కు వుంది. ముక్కకు ముక్క అనువాదానికి యత్నించకుండా భావానువాదాన్ని స్వేచ్ఛగా, స్వభాషోచితంగా చేయడమే మంచిపద్ధతి.

ఇది సంస్కృత వాఙ్మయంలో అపూర్వం, అనితర సదృశం, విలక్షణం అయిన జయదేవుని గీతగోవింద ప్రబంధానికి ఆంధ్రీకరణం. కర్త కీర్తిశేషులు శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రిగారు. ఇదివరలో గీతగోవిందం తెలిగింపులు కొన్ని రాకపోలేదుగాని, ఇది వాటికంటె ఇంపుగానే వున్నదనిపిస్తుంది.

అయినా, పైన చెప్పిన అనువాద క్లేశాల నుంచి ఇది కూడా తప్పించుకోలేక పోయింది. జయదేవుని కవితా వైశిష్ట్యం ఎక్కువగా పదబంధ చాతుర్యం మీద, మాధుర్యంమీద ఆధారపడి వుంది.

'మధుర కోమల కాన్త పదావళీం' అని జయదేవుడే స్వయంగా చెప్పుకున్నాడు. సుమారుగా ఇవే పదాల నుపయోగించి పిచ్చయ్యశాస్త్రిగారు పై వాక్యానికి చేసిన అనువాదాన్ని చూస్తే అనువాద ప్రక్రియలోని క్లిష్టత బోధపడుతుంది. శాస్త్రిగారి 'మృదు మధుర కాంత పదముల మిళితమైన' అనే తేట గీతిపాదం విడిగా చూస్తే ఎంత బాగున్నా, అసలు దానితో పోల్చితే పేలవంగానే వుండిపోతుంది. 'కోమల' పదానికి 'మృదు' అనేది వాడవలసి రావడం, 'కాన్త' అనే దాన్ని యథాతథంగా వుంచినా, సంస్కృత భాష మర్యాదలో దానికి అప్రయత్నంగానే వచ్చే అర్థస్ఫూర్తి చప్పున ఈనాటి తెలుగు పాఠకునికి ప్రయత్నపూర్వకంగా తప్ప స్ఫురించక పోవడం జరుగుతుంది. ఇది అనువాదకుల కృషిలోపం కాక, అనువాద ప్రక్రియాలోపమనే చెప్పుకోవాలి.

జయదేవుని ప్రబంధంలో శ్లోకాలు మధురాలైతే, అష్టపదులు

మధురతరాలు. వాటి సంగీత యోగ్యత శ్రవణైకవేద్యం. ఒక్క ముక్క బోధపడక పోయినా, వాటిని రాగ, తాళ యుక్తంగా పాడుకుని, కేవల పద సౌందర్యానికి వివశమైపోయే సంప్రదాయం ఒకటి కొన్నాళ్ళ క్రిందటి వరకు తెలుగునాట బహుళంగా వుండేది. సినిమాలకు, గ్రామొఫోన్ రికార్డులకు ఎక్కినా, అష్టపదుల సంప్రదాయం తిరిగిరావడం—పాత జీవితపు మర్యాదలు మళ్ళీ రావడమంత అసంభవం. శాస్త్రిగారి అనువాదం కూడా పండితవర్గ పరిధినిదాటి పామర లోకంలో ప్రవేశించడం ఇంతే కష్టం. పండితవర్గాన్ని కూడా ఇది ఎంతవరకు సంతుష్టులను చేస్తుందో చెప్పలేము. అష్టపదుల మాధుర్య రహస్యం వాటి పద గుంఫనంలో, అంత్య ప్రాసలు, మధ్య ప్రాసలలో, అంతర లయలో వున్నది. ఇవన్నీ తెలుగులోకి తేవడం సాధ్యంకాదు. ఉదాహరణకు — 'ధీరసమీరే యమునాతీరే' అని మొదలయ్యే 11వ అష్టపది అనువాదాన్ని చూడవచ్చు. విడిగా చదువుకున్నప్పుడు బాగున్నా, ఎదుటి పుటలోనే వున్న మూలంతో పోల్చితే నిస్సారంగానేననిపిస్తుంది.

ఈ గ్రంథం ఆదిలో జయదేవ కవి చరిత్ర, యమునా పరిసర ప్రకృతి వర్ణన పద్యాలు శ్రీ శాస్త్రి గారి కవితా ప్రతిభకు నిదర్శనాలు. అట్టపై చిత్రాలు, పుస్తక ముద్రణ బాగున్నాయి.

[ప్రచురణ: శాస్త్రిశ్రీ కల్చరల్ బుక్ రైటర్స్ అండ్ పబ్లిషర్స్, గుంటూరు–2. వెల: రు. 6]

ఔషధకాండ

సాధారణంగా తెలుగులో వైజ్ఞానిక గ్రంథాలు వ్రాసేవారికి విషయ పరిజ్ఞానం వున్నంతగా భాషా వైదుష్యం వుండదు. ఈ కారణం చేత వారు వ్రాసే విషయాలు ఎంత మహత్తరాలైనా, భాష ఎగుడుదిగుడుగా వుండడం, విషయాన్ని తేటతెల్లం చేయడానికి కావలసిన సామర్థ్యం లేకపోవడం, అందంగా, ఆకర్షణీయంగా వ్రాయలేకపోవడం జరిగి పఠితల ఆదరాభిమానాలు పొందలేవు.

డాక్టర్ గాలి బాల సుందరరావు (డి. ఎమ్. అంచ్ ఎస్.) గారు వైద్య శాస్త్ర నిష్ణాతులేకాక, స్వయంగా సాహిత్యాభిమానులు, రచయిత కూడా కావటం వల్ల వారు ఆ శాస్త్రంపై వ్రాస్తున్న గ్రంథాలు ఎంతో పఠనయోగ్యంగా వుంటున్నాయి. ఆ శాస్త్రంపై ఏ మాత్రం అభిరుచికలవారినైనా, లేని వారినైనా ఆసక్తితో చదివింపజేయ గలవిగా వుంటున్నాయి.

డాక్టర్‌గారు విపులమైన పీఠికలో తాము వైద్య గ్రంథాలను తెలుగులో వ్రాయడానికి ప్రోద్బలమిచ్చిన కారణాలను వివరించారు. గ్రంథాల ప్రచురణకు తాము పడిన అవస్థలన్నిటిని విశదీకరించారు. ఇటువంటి శాస్త్ర గ్రంథాలు నవలల వలె అమ్ముడుపోవు. వాటిని వ్రాసే వారెంత తక్కువో, చదివేవారు, కొనేవారు కూడా అంతే తక్కువ. అందుచేత వాటిని ప్రచురించడం, ప్రచారం చెయ్యడం చాలా కష్టమైపోతున్నది. అయినా అవి వ్రాయడం, ప్రచురించడం, ముఖ్యంగా తెలుగువలె వెనుకబడిన భాషలో, చాలా అవసరం. మన భాష చాలా గొప్పదని, అందమైనదని దురభిమానులు కొందరు మురిసిపోవడమే తప్ప, వైద్యంలో మన వాఙ్మయం ఎంత పేదదో గ్రహించడంలేదు. వ్రాయడం చేతనైన ప్రతివాడు గేయాలో, కథలో, నవలలో, నాటకాలో తప్ప మరొక రచనకు పూనుకొనడమే లేదు. డాక్టరో, లాయరో, ఇంజనీరో అయినవాడు కూడా కథకుడుగానో, కవిగానో పేరు కొట్టెయ్యాలన్న ఉబలాటం తప్ప, తను చదువుకున్న దాన్ని, తాను సంపాదించిన విజ్ఞానాన్ని, తన వృత్తికి సంబంధించిన దాన్ని ఇతరులకు, ముఖ్యంగా సాధారణ పఠితలకు అందజేయాలనే ఆసక్తి కనబరచడంలేదు. ఈ లోపానికి కొంత బాధ్యత ప్రచురణ కర్తలది, మన ప్రభుత్వానిది కూడా అనుకోండి. డాక్టర్‌గారు ఈ పుస్తక ప్రచురణ ఎంత సమస్య అయిందో పీఠికలో చేసిన వివరణనుబట్టి ఈ విషయాన్ని గ్రహించవచ్చు. ఏమైనా, మిత్రుల సహాయంతో వారు ఈ వైజ్ఞానిక గ్రంథాలను వెలుగులోకి తేవడం ప్రశంసనీయం.

'మనమూ మన దేహస్థితి' అనే విషయంపై బాల సుందరరావుగారు వ్రాసిన గ్రంథ పరంపరలో ఇది వరకు 'శరీర ధర్మకాండ', రోగకాండ' ప్రచురితాలయ్యాయి. ఈ 'ఔషధకాండ' మూడవ ప్రచురణ. విషయ బాహుళ్యంవల్ల ఈ గ్రంథం రెండు భాగాలుగా వెలువరిస్తున్నారు. ప్రస్తుత గ్రంథం మొదటి భాగం.

దీనిలో ఔషధాలకు, వాటి తయారీకి, ఉపయోగానికి, ఉపయోగించే పద్ధతులకు సంబంధించిన విషయాలు వివరించబడ్డాయి. ఇది పాఠ్యగ్రంథం కాదు. కేవలం సామాన్య పాఠకులకు ఆసక్తికరంగా, సులభ భాషలో, ప్రాథమిక విజ్ఞానం అందజేసేదిగా రచించారు. వైద్య పరిభాష విషయంలో ఇంగ్లీషు పదాలను, వాటికి సులభ గ్రాహ్యమైన తెలుగు పదాలను కూడా వాడుతూ పాఠకునికి బోధపడడమే ముఖ్యంగా పెట్టుకుని గ్రంథం రచించారు. శాస్త్రీయ గ్రంథాలు వ్రాసేవారందరూ ఈ సరళ పద్ధతిని అనుసరించడం అభిలషణీయం.

[ప్రచురణ: మధురా పబ్లికేషన్స్, 88–సర్ త్యాగరాయ రోడ్డు, మద్రాసు-17. వెల: రూ. 6.

పాప్ మ్యూజిక్

ఇది 'పాప్' యుగం. పాప్ ఆర్ట్, పాప్ మ్యూజిక్, (పాప్ లిటరేచర్?) లాంటివి ఈ యుగ లక్షణాలు.

వీటిలో పాప్ మ్యూజిక్ అనేది తెలుగు పాఠకులకు వెంటనే పరిచయం చేసేస్తేగాని వీల్లేనంత మహత్తర విషయంగా 'అందేవ్' అనే అందే గోపాలకృష్ణమూర్తి

గారికి అనిపించి, కలంపట్టి, పుస్తకం వ్రాసి, అచ్చువేయించి, తెలుగు పాఠకులలోని పాశ్చాత్య సంగీత ప్రియులకు అంకితం కూడా చేసే శారు.

"విదేశ వాళీయం" అనే మొదటి ప్రకరణంలో పాశ్చాత్య సంగీత (పాప్) ప్రపంచం నుంచి హిందీ, తెలుగు సినిమాలలోకి దిగుమతి అయిన పాటల జాబితా ఇచ్చారు. అసలు ఇంగ్లీషు పాటలు ఎవరు పాడింది, వాటిని దేశవాళీ సినిమాలలోకి, దేశవాళీ సంగీత దర్శకులు ఏ విధంగా కాపీ కొట్టి, కొద్ది మార్పులు చేసి వాడుకున్నది వివరించారు. హిందీ, తెలుగు సినిమాలలో బాగా ప్రజాదరం పొందిన ఎన్నో పాటలు ఆ యా సంగీత దర్శకుల మౌలిక రచనలు కావని, అనుకరణలని తెలుసుకున్నప్పుడు తెలుగు పాఠకులకు ముందు ఆశ్చర్యం, తరువాత ఆగ్రహంకూడా కలుగుతుంది. ఈ విధంగా "ఫారిన్ స్టఫ్‌ను స్మగుల్ చేయడం హర్షించ దగ్గ విషయం కాదు" అని రచయిత మన సంగీత దర్శకులను కోప్పడ్డారు కూడా. అయితే, మన సినిమాలలో-కథలలో, చిత్రీకరణలో, పాటలలో-ఒరిజినాలిటీకోసం వెదికేవారికి తప్ప ఈ స్మగ్లింగ్ అంతగా ఆశాభంగం కలిగించదు. మౌలిక ప్రతిభకోసం మన సినిమాలను చూసేవారెవ్వరూ వుండరనుకుంటాను. కాలక్షేపానికి తప్ప దేనికి పనికిరాని మన (పాప్) సినిమాలలో ప్రత్యేకం సంగీతపు దొంగ రవాణాను నిరసించ వలసిన అవసరంలేదు. అదలా వుంచి, ఇంగ్లీషు 'పాప్' మ్యూజిక్ కూడా పూర్తిగా మౌలికం కాదు. అనేక దేశాల, జాతుల సంగీత ధోరణులను ఆకళించుకుని రూపం దాల్చినదే. వాటిని మనవారు అనుకరించినప్పుడు ఎంత బాగా అనుకరించ గలిగారు, భారతీయం చేయగలిగారు అని చూసుకుంటే చాలునేమో.

ప్రసిద్ధ పాశ్చాత్య గాయకులైన నాట్ కింగ్ కోల్, బాబీ డారిన్, క్లిఫ్ రిచర్డ్, డీన్‌మార్టిన్, డోరిన్‌డే వంటి వారిని ఫొటోలతో సహా పరిచయం చేయడం, బాగా పాపులర్ అయిన కొన్ని పాటల పాఠాలను ఇవ్వడం మెచ్చుకోదగింది.

"డాక్టర్ అఫ్ పాప్ మ్యూజిక్" అనే డిగ్రీ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లేదుగాని, వుంటే ఇవ్వదగినంత శ్రమ చేసి ఈ "థీసిస్" రచించిన శ్రీ అందేవ్‌కు మా అభినందనలు.

ప్రచురణ "పాప్ పబ్లిషర్స్" (రాజమండ్రి-1) వారిదే కనుక ఇది "పాప్ బుక్" కాగలదని మా ఆకాంక్ష. 96 పేజీల ఈపుస్తకం పాప్ వెల : 99 పైసలు. మిగతా పైస పాప్ కార్న్‌కి.

—గ్రంథాన్వేషి

సినిమా

అచ్చ తెలుగు నటుడు గుమ్మడి

ఉమ్మడి సంసార నటుడు గుమ్మడి. క్షోభకు మారుపేరు గుమ్మడి. మనసులోని, హృదయంలోని క్షోభను ప్రదర్శించి సినిమా అభినయ శోభను వెంకటేశ్వరరావు అంతగా పెంచినవారు అరుదు.

ఏ నటుడైనా, ముఖ్యంగా గంభీర పాత్రధారి పలికితే నాభినుంచి స్వరం వస్తుందంటారు. అన్నగాగాని, తండ్రిగాగాని, మరే ఇంటి పెద్దగా గాని నటిస్తూ వ్యథలో వెండి తెరపై ఈ తెనాలి తార పలికే పలుకు నాభినుంచే కాదు నర నరంనుంచి పెల్లుబికి ప్రేలినట్లు వస్తుంది. పాత్రధారి తన పలుకును నర నరంనుంచి తేవడం ఒక ఎత్తు; ప్రేక్షకుల నర నరం కూడా కదలించడం దానికి మించిన ఎత్తు. ఈ రెండూ కల నటుడు "ఎత్తుకు పై ఎత్తు" నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు.

సాధారణంగా ఏ నటుని ప్రజ్ఞనైనా పరీక్షించేందుకు నవరసాల 'టెస్ట్' చేస్తారు. ఎన్ని రసాలు పోషిస్తే అంత మంచినటుడు; అంత ఉత్తమ నటుడు. కాని గుమ్మడి బ్లాక్ అండ్ వైట్ చిత్రాల నటునకు పరీక్షలు రెండే. అవి 'బ్లాక్' భూమికలు, 'వైట్' వేషాలు ధరించడంలో చూపిన ప్రజ్ఞ, ఉపజ్ఞ. గుమ్మడి "బూడిదగుమ్మడి" పాత్రలు ధరించారు. "మంచి గుమ్మడి భూమికలూ నిర్వహించారు. "పిచ్చిపుల్లయ్య", "తోడు దొంగలు", "ఏది నిజం", "జయభేరి", "నమ్మినబంటు", "సతీ తులసి", "రాజమకుటం", "వాగ్దానం", "కులగోత్రాలు", "అంతస్తులు", వంటి చిత్రాలలో మనిషిలోని నలుపును, తెల్లగా, తేట తెల్లగా చూపకలిగారు.

"అర్ధాంగి", "జయసింహ", "దాంపత్యం", "అన్నపూర్ణ", "ఇద్దరు మిత్రులు", "మంచి మనసులు", "కలిమిలేములు", "కానిస్టేబుల్ కూతురు", "పూజాఫలం" వంటి చిత్రాలలో మనిషిలోని తెలుపును, మంచిగా, తేటతెల్లగా ప్రదర్శించ కలిగారు.

"మాయాబజార్" "ప్రేమించి చూడు" మొదలైన చిత్రాలలో ఈ గంభీర నటుడు వినోద సమాన రూపములూ దాల్చారు; ఒప్పించారు.

అయితే ఈ సిని వెంకటేశ్వరరావు అభినయ శిఖరారోహణలో

ఎక్కిన ఏడుకొండలు వేరు. అవి "ఇలవేలుపు", "మా యింటి మహాలక్ష్మి", "ఈడూ-జోడూ", "కులదైవం", "మహామంత్రి తిమ్మరుసు", "తండ్రులు-కొడుకులు", "పాండవ వనవాసం" (ధర్మరాజు) అని "జ్యోతి" ప్రతినిధి నిశ్చితాభిప్రాయం.

దుర్యోధన నాటక నటశేఖరుడు మాధవపెద్ది వెంకట్రామయ్యకు ఏకలవ్యుడైన గుమ్మడి వెంకటేశ్వరరావుకు 1950 లో "అదృష్టదీపుడు"తో సినిమా అదృష్ట స్పర్శ కలిగినదాది "ఆత్మగౌరవం" వరకు 130 చిత్రాల పాత్ర గౌరవం, ఆత్మ (తన) గౌరవం నిలుపుకొనే పరీక్షలు వచ్చినవి.


తనకంటె పాత్ర గొప్ప, పాత్రకంటె కవి గొప్ప, కవికంటె ఆదర్శ దర్శకుడు గొప్ప అనే త్రిసూత్ర త్రిశూలంతో సహజ, సక్రమ, సాత్విక, సంసారపక్ష నటనపథంలో జయగమనం చేస్తూ వచ్చారు. తెలుగురైతు కుటుంబంనుంచి వచ్చి, సినిమా వేషాలు వేసే వరకు పంచకట్టుతప్ప 'ప్యాంటు' ఎరుగని ఈ 39 సంవత్సరాల తెలుగుబిడ్డ, రూపంలో నూరు నయాపైసల తెలుగు సంసారిగా కన్పిస్తారు; నూరు నయాపైసల తెలుగు పాత్రలలో నూరు నయాపైసల తెలుగు నటనే ఇస్తారు. తెలుగు పాత్రను, తెలుగు నటనను తీర్చిదిద్దిన అగ్రశ్రేణి సహజ నటులలో ఒకరు; బహుశా ముఖ్యులు.

'ఆత్మగౌరవం'

అటు గ్రామీణులను, ఇటు బస్తీవారిని అటు పేదవారిని, ఇటు ధనికులను, అటు రైతులను, ఇటు జమీందారులను, అటు టీన్ ఏజెర్స్‌ను, ఇటు కౌమార, వార్ధక్య దశలలోని వారిని, అటు స్త్రీలను, ఇటు పురుషులను, అటు సినిమాకళ మాత్రమే, శాస్త్రం మాత్రమే అని అనుకొనే కళాభిమానులను, ఇటు 'సినిమా అన్నాక, అందులో తెలుగు సినిమా అన్నాక అన్నీ వుండాలి, ఎన్నో వుండాలి' అని వాదించే వారినీ— వారినీ, వీరినీ, అందరినీ ఆకట్టుకొంటూ తమ సంస్థ గౌరవాన్ని, సినీ కళ అనే వ్యవస్థగౌరవాన్ని నిల



"ఆత్మగౌరవం"లో
నాగేశ్వరరావు, రాజశ్రీ



రాష్ట్రపతి బహూమతి స్వీకరిస్తున్న గుమ్మడి

బెట్టిన చిత్రం అన్నపూర్ణా పిక్చర్స్ "ఆత్మగౌరవం".

ఈ కాలపు డ్యాన్సులూ, రొమాన్సులూ కావాలనుకొన్నవారికి ఆ చిత్రం సంతృప్తి నిస్తుంది. కూచిపూడి నాట్యం, క్షేత్రయ్యపదం, పాదవిన్యాసం, సశాస్త్రీయమైన నాట్యం, సంగీతం కావాలనుకొన్న వారికి ఆ చిత్రం పరిపూర్ణమైన, అపూర్వమైన సంతృప్తి నిస్తుంది. పిల్లలతో కథ ప్రారంభమై, యువకులపైగా వెళ్ళి, యువానంతర దశవారి దశలే మార్చివేసిన ఈ కథా, దానిసంవిధానమూ బాలలనుంచి, వృద్ధుల వరకు అబాలగోపాలన్నీ ఆకర్షించే టటువంటిది. ఇట్టి సర్వసమగ్ర కథ, తెలుగు కథ, చిత్రం, తెలుగు చిత్రం అరుదు—చాలా అరుదు. అరుదుకు ఇచ్చట అర్థం బహుశా లేదు.

అక్షరాలలో కథ :- ఎత్తుగడలోనే కొత్త పోకడ కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది.

"ఆత్మగౌరవం" రక్షకుల-అనగా సాంకేతికజ్ఞుల, తారల పేర్ల టైటిలు కార్డ్సుతో చిత్రం ప్రారంభమౌతుంది. ఒక్కొక్క కార్డుపైన పూల రెమ్మా, పిట్టలు, విలువైన స్తంభంపై గూడూ వంటివి ఏవేవో కన్పిస్తూ వుంటవి. ఆ మూడు

పిట్టలూ, రెండు రెమ్మలూ, రెండు పువ్వులూ, ఒక్క గూడూ కథ యిది.

టైటిల్ కార్డుపై బొమ్మలో రెండు పిట్టలు అనురాగంతో గుసగుసలాడుకొంటున్నవి. (అవి అసలు కథలో వాసు, సావిత్రి అనే మేనరికంకల బాలలు.) అందులో ఒక పిట్ట ఎగిరిపోయింది (వాసును అన్న రైతు రామయ్య, వరహాలరావు అనే జమీందారుకు దత్తత యిచ్చాడు.) భోగవిలాసాలు సూచించే ఒక స్తంభపై గూడు వున్నది. ఆ గూడులో ఒక పిట్ట వున్నది. (కథలో మాజీ న్యాయమూర్తి భజగోవిందం కుమార్తె గీత.) రెండు పిట్టలమధ్య సాహచర్యం ఏర్పడింది (గీతకు వాసుపై అనురక్తి కలిగింది.) పల్లెలోని పిట్ట ఓ కొమ్మపై వుండగా పెనుగాలి వచ్చింది. పిట్ట ఎగిరిపోయింది. (రామయ్య సంసారంలో పెనుతుఫాను వచ్చింది. వారి ఇంటినుంచి సావిత్రి వెళ్ళిపోయింది. సరళ అని పేరు మార్చుకొన్నది.) గూడులోని రెండు పిట్టల్లో ఒకటి ధర్మమెరిగి, ధర్మబద్ధమైన, ప్రకృతిసిద్ధమైన గాలి పీల్చుకొనడంకోసం అలా బస్తీ శివార్లవైపు వెళ్ళింది. వాసు గీతను ప్రేమించనందున, ఆమెనుంచి వచ్చేసి సంగీత, నాట్య సౌరభం ఆస్వాదించేందుకు బైటకు వచ్చేశాడు) పల్లె కుటుంబపు తుఫానునుంచి బైటపడ్డ పిట్ట, అయిష్టమైన ప్రేమ తుఫానునుంచి బైటపడ్డ పిట్ట రెండు రెమ్మలపై వ్రాలి, మాధుర్యము చవిచూస్తున్నవి (సంగీతము, నాట్యము అనేవి సరళకు, వాసుకు ప్రేమ రెమ్మలుకాగా మధురానుభూతి మొదలెట్టారు.)

రెండు పిట్టలూ మబ్బుల ప్రళయం తప్పించుకొని ఒక్క గూటిలో చేరినవి.

గీతను వాసుకిచ్చి వివాహం చెయ్యడానికి వరహాలరావు, భజగోవిందం, తుదకు రామయ్య ప్రయత్నించినా, ప్రయత్న మేఘాలనుంచి జడివానలు కురిపించినా ఏ గూటి పిట్ట ఆ గూటి చేరింది. దత్తత ప్రతిబంధకాలకు అతీతులై వాసు, సరళ అనే సావిత్రి ఒక ఇంటివారైనారు; ఒక గూటివారైనారు.

టైటిలు కార్డులపై కొద్ది రేఖా చిత్రాలలో 18 రీళ్ళ కథ వుంది. పైన బ్రాకెట్లలో సంగ్రహంగా పొందుపరచిన కథలో అంతర్వాహినిగా ఉరకలు తీసిన అంశం—దత్తత వెళ్ళడం అపరాధమా? ఆస్తి లేకపోయినా, దత్తత వెళ్ళినా, ఆత్మగౌరవం, ఆత్మాభిమానం నశించదని వాసూ, రామయ్యలు 'మూడు పిట్టలూ—ఒక్క గూడూ' కథలో నినదిస్తారు.

ఆంధ్రీయత: ఇంతటి తెలుగుతనం, తెలుగు సంప్రదాయం, తెలుగు జాతీయ జీవనం వున్న తెలుగు చిత్రాలు చాలా అరుదు.

'ఆత్మగౌరవం' సగౌరవంగా



శ్రీ శంభూ ఫిలిమ్స్‌వారి 'శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు కథ'లో జమున

అనేక కొత్తలు చేసింది. వాటి వైనం:

కొత్త దర్శకుడు కె. విశ్వనాధ్‌కు వెండితెరపై స్వయంప్రకాశమిచ్చింది.

తెలుగు నుడికారంతో, సంసారపక్షంగా, వినోదోల్లాసాలలో 18 రీళ్ళ చిత్రాన్ని జెట్ వేగంతో ఆ సైన్సు పట్టభద్రుడు 'నడిపారు.' మొదటి మూడురీళ్ళలో రైతు—జమీందారు వాతావరణంతపాటు పాత్రలమధ్య సంఘర్షణకు బలమైన 'ప్లాటు' వేశారు.

దత్తతైన మీదట జమీందారు మేడ ముందునుంచి సావిత్రి, వాసు విడిపోయినప్పుడు జూమ్ లెన్సు వినియోగించి పరిస్థితి తీవ్రతను చూపడంలో, టైమ్ లాప్స్ రామయ్య యింటిలో నాట్యపు బొమ్మపై చూపి, పెద్ద సావిత్రి పాత్రను పరిచయంచేసి ఆమెకూడా నాట్యకత్తె కాబోతున్నదని సూచించడంలో, సావిత్రి స్వప్నసన్నివేశమును కాంతి రేఖలతో మొదలిడి నౌకా విహారంలో నీటిపై అవే రేఖలు చూపడంలో, జమీందారు యింటి ఉద్యోగి అప్పలాచార్యులు (అల్లు రామలింగయ్య) పిలకతో బాల వాసు పాత్రను, సుస్థిరంగా ఎస్టాబ్లిష్ చెయ్యడంలో, గీతకు—భగవద్గీతకు ముడిపెట్టి ప్రేమ కథలో విరసభాగమును నడిపించుటలో, గీత ప్రేమ ఊహలను కారులో వెదుకుతున్నప్పుడు) బ్యాక్ ప్రొజెక్షన్స్ ద్వారా కాకసరాసరి చిత్రీకరణతో వివరించడంలో 'ఆర్డర్ ఆర్డర్' (మాజీ జడ్జి రమణారెడ్డి అనే మాటలు), 'నా దొక చిన్న మనవి' (అల్లు రామలింగయ్య) మొదలైన ఊత పదాలతో, కదలికలతో (మ్యానరిజమ్స్) పాత్ర

స్వరూపాన్ని విశదీకరించడంలో వడియాలు పెట్టుకోవంటి వాటి ద్వారా ఆంధ్రీయత చూపడంలో, కట్టు బొట్టు వ్యవహారాలలో తెలుగు నుడికారం సంరక్షించడంలో యువ దర్శకుని లక్ష్యశుద్ధి, విజ్ఞానశుద్ధి కానవస్తున్నవి. కసరత్తులు లేకుండా కథను వివరించడం, నిరాడంబరంగా చిత్రీకరించడం విశ్వనాథ్ విధాన విశ్వమని తోస్తున్నది.

సంభాషణలు: సినీ సంభాషణల రచయితగా భమిడిపాటి ఈ చిత్రం ద్వారానే పరిచయమైనారు. హాస్య సన్నివేశాలలో ఈయన మేధ పదునుగా పని చేసింది. సంభాషణల సంఖ్యను సినిమా పరిమితులుబట్టి కట్టుడి చేసుకొంటే ఈయన యింకా వృద్ధిలోకి రాగలరు. గొల్లపూడి మారుతీరావు కూడా సంభాషణలు రచించి వున్నారు.

శ్రీ గొల్లపూడి మారుతిరావు, శ్రీమతి యుద్దనపూడి సులోచనా రాణి కూర్చిన కథకు శ్రీ దుక్కిపాటి మధుసూధనరావు సినీ అనుసరణ గావించారు.

ఆటలు: శ్రీమతి సుమతికౌశలను నృత్యదర్శకురాలుగా 'ఆత్మగౌరవం' పరిచయం చేసింది. క్షేత్రయ్యపదమునన రక్తిమణులుకాంచన, రాజశ్రీలపైచిత్రీకరించారు.నృత్యమునశాస్త్రీయంగా శోభిల్లింది. అలానే కూచిపూడి నాట్యంకూడా. కొత్తబాలతార శ్యామల కూడా తన బాధ్యతలను చక్కగా నిర్వహించింది.

నటనలు: ఇక పరిచితుల విషయం:

నాగేశ్వరరావు రొమాంటిక్ హీరోగా మరొక మెట్టు పైకి వెళ్ళారు. రాజశ్రీతో ఆడిన ఆటలలో పుట్ స్టెప్స్ లో ఆయన చూపిన చలాకీ తనంలో అందముంది.

సావిత్రి, సరళలగా కాంచన, అప్పలాచార్యులుగా అల్లు రామలింగయ్య, రామయ్యగా గుమ్మడి, జమీందారుగా రేలంగి, జమీందారు భార్య సంతానం సూర్యకాంతం, ఆమె చెల్లెలు కుమారుడు వేణుగాచలం అవరుసలో చక్కగా నటించారు. విషాద స్థితిగతులలో గుమ్మడి నటన, సంఘటన సంధాన కర్తగా అల్లు నటన ప్రత్యేకించి పేర్కొన దగినవి. రాజశ్రీ, రమణారెడ్డి, వాసంతి, పుష్పకుమారి హేమలత, మాష్టర్ బాబు యధాశక్తి నటించారు.

సంగీతం: రాజేశ్వరరావు సంగీతం కూర్చిన పాటలలో 'మారాజులొచ్చారు' (రచన: సి. నారాయణరెడ్డి, పాడినది సుశీల, వసంత), 'ఓ సోదర సోదరీమణులారా' (ఆరుద్ర రచన: ఘంటసాల కంఠం) 'ముందటివలె నాపై' (క్షేత్రయ్య పదం, సుశీల గానం) మధురంగా వున్నవి. దాశరధి, శ్రీశ్రీ పాటలలో కవితా మాధురి వినవచ్చింది.

కళ: జి. వి. సుబ్బారావు కళా దర్శకత్వం, రామచంద్రరావు సెట్స్, పి. యస్. సెల్వరాజ్



"ఆంధ్ర మహావిష్ణువు"లో జమున, రామారావు

ఛాయా గ్రహణ దర్శకత్వం చిత్రానికి 'ఎస్సెట్స్'.

జీవితపు నుడికారంతో సర్వజన రంజకమైన చిత్రం హైదరాబాద్ శ్రీ సారధి స్టుడియోస్ లో నిర్మించిన అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూధనరావు అభినందనీయులు.

అన్నపూర్ణావారి 'పూలరంగడు'

అన్నపూర్ణా పిక్చర్స్‌వారుదక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలిలో 'పూలరంగడు' టైటిల్‌ను తిరిగి రిజిష్టరు చేసుకొన్నారు. హైదరాబాద్ శ్రీ సారధిస్టుడియోస్ లో తీసే ఈ చిత్రంలో నాగేశ్వరరావు నాయకుడు. నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు.

• • •

సుప్రసిద్ధ హాస్యనటుడు, ఒకనాటి దర్శకుడు, నిర్మాత కస్తూరి శివరావు ఫిబ్రవరి 21వ తేదిన తెనాలిలో కాలధర్మం చెందారు.

శంభూ ఫిలిమ్స్ శేఖర్

భారత సినిమా రంగంలో శబ్ద గ్రహణం, కళా దర్శకత్వం, చిత్ర దర్శకత్వం — మూడు బాధ్యతలనూ వహించినవారు అరుదు.

ఆ కాలంలో ప్రభాత్‌కు చెందిన ఫతేలాల్ బాధ్యతలు వహించి వున్నారు.


మళ్ళీ ఈ కాలానికి ఆ మూడు శాస్త్రాలలోను ప్రవీణులైనవారు శ్రీ శంభూ ఫిలిమ్సువారి 'శ్రీ కాకుళ ఆంధ్ర మహా విష్ణువు కథ' దర్శకుడు శ్రీ ఏ. కె. శేఖర్.

కులశేఖరంగారు తెలుగు సినిమా కళా కులానికి కొత్తవారు కాదు. తెలుగు సినిమా కళ ఉచ్ఛ స్థితిలో వున్నప్పుడు 'వందేమాతరం' 'సుమంగళి' మొదలైన చిత్రాలు వచ్చినప్పుడు ఆ వాహినీ సృష్టికి ఆ బి. ఎన్. రెడ్డి, కె. రామనాథ్‌ల వద్ద శబ్దగ్రాహకునిగాను, కళా దర్శకునిగాను శ్రీ శేఖర్ వున్నారు. రామనాథ్ శేఖర్ కాంబినేషన్ అంటే సినిమా కళకు వండుగ, వెలుగు అన్నమాట. ఈరోజు వరకు (రామనాథ్ స్వర్గీయులైనారు) బి. ఎన్. రెడ్డి శేఖర్ లేనిదే సెట్స్ వేయించుకోరు.

శ్రీ శేఖర్ 1934 ప్రాంతాల కొల్హాపూర్‌లోని ఫిలిం స్టుడియోలో శబ్దగ్రహణం, ఆర్ట్ మొదలైనవాటిలో 'ఓనమాలు' దిద్దారు. ఫతేలాల్‌తో అప్పుడు పరిచయమైంది. తర్వాత బందరుకు చెందిన స్వర్గీయ శ్రీ పి. వి. దాస్ మద్రాసులో వేల్ పిక్చర్స్ స్థాపించి తెలుగు చిత్రాలు తీస్తున్నప్పుడు శేఖర్‌కు అవకాశం కలిగించారు. ఆ మీదట శేఖర్, బి. ఎన్. రెడ్డి కలిసి హెచ్. ఎమ్. రెడ్డివద్ద "గృహలక్ష్మి" లో పనిచేశారు. వాహినీ వెలసి బి. ఎన్. రెడ్డి స్వతంత్రుడైనప్పటినుంచి రామనాథ్, శేఖర్, బి. ఎన్. రెడ్డి కాంబినేషన్ దక్షిణ భారతంలోనే కాదు శాంతారామ్‌వంటి పెద్దలచేతకూడా మెప్పుపొందింది.

1938 నుంచి 1941వరకు వాహినీ శబ్ద, కళాశాఖల అధిపతి శేఖర్. దరిమిలా 1942 నుంచి 1949 వరకు జెమినీలో వున్నారు. ఆ తర్వాత రెండు తమిళ చిత్రాలకు దర్శకత్వం (డైరక్షన్) వహించారు. ఈమధ్య కాలంలో 'పెద్దమనుషులు' 'బంగారు పాప', 'రాజమకుటం' 'చంద్రలేఖ' 'అమరశిల్పి జక్కన్న' వంటిచిత్రాలు శేఖర్ కళా దర్శకత్వంలో వెలువడినవి అంటే 'మల్లీశ్వరి' కళారూపకర్త శేఖర్ అంటే వారి అంతస్తు ఎంతటిదో ఊహించవచ్చు.

దాదాపు 32 సంవత్సరాల సినీ



విజయ సారధి వారి "వీరపూజ" రికార్డింగ్ సందర్భంలో
నటి కాంచన, గాయని సుశీల

అనుభవంతో ఈ నాటికి ఈ 57 సంవత్సరాల వయసుకల ఏ(ఆదర్శ) కె (కళా) శేఖరుడు తెలుగు చిత్రానికి స్వయందర్శకత్వ బాధ్యతవహించారు.

శ్రీ శంభు ఫిలిమ్సువారి నూటికి నూరుపాళ్ళు తెలుగు కథ 'శ్రీకాకుళ ఆంధ్ర మహా విష్ణువు కథ'కు శ్రీ శేఖర్ చిత్ర దర్శకుడు. దాదాపు ఒక దశాబ్దంపాటు సాహిత్య పరిశోధన గావించి కొంత స్వకల్పనతో పింగళి నాగేంద్రరావు చిత్ర కథను రూపొందించారు. పాటలు, సంభాషణలు రచించారు. శ్రీ డి. చౌదరి స్క్రిన్ ప్లే సమకూర్చారు, ప్రయోజనాత్మకమైన చిత్రాలు, మన చరిత్రకు, అభిరుచికి సంబంధించిన చిత్రాలు తీయాలనే సంకల్పంతో, సాహసంతో ఈ ఇతి వృత్తాన్ని శ్రీ దగ్గుబాటి లక్ష్మీనారాయణ చౌదరి చేబట్టారు.

తెలుగు జాతి ఎలా ప్రభవించిందో తెలిపే ఇతిహాసమే దృశ్య కావ్యమైంది.

రామారావుతో ఒక్క చిన్న సన్నివేశం, జమునతో ఒక్క చిన్న సన్నివేశం పూర్తి చేస్తే చిత్రం సంపూర్ణమైనట్లే. ఈ లోపల ఫైనల్ ఎడిటింగ్ జరుపుతున్నారు.

శ్రీ శంభు ఫిలిమ్స్ యూనిట్ వివరమిది :

తారాగణం : ఎన్.టి.రామారావు, ఎస్. వి. రంగారావు, జమున, రేలంగి, లింగమూర్తి, దగ్గుబాటి రాఘవయ్య చౌదరి, గిరిజ, విజయ

లక్ష్మి, మిక్కిలినేని, బాలయ్య, ఛాయాదేవి, ప్రసాద్, చదలవాడ, మల్లాది, జగ్గారావు, దశరథ రామిరెడ్డి, సూర్యకళ, సబితాదేవి.

సాంకేతిక వర్గం: పింగళి నాగేంద్రరావు, డి. చౌదరి, పెండ్యాల, తోట, యు. రాజగోపాల్, ఛోప్రా, ఎమ్ ఎన్. మణి, కె. సత్యం, ఏ. కె. శేఖర్, చెరువు ఆంజనేయశాస్త్రి, విజయబాబు చిరంజీవి గారలు. నిర్మాత శ్రీ దగ్గుబాటి లక్ష్మి నారాయణ చౌదరి.

శ్రీ శేఖర్ ఈ చిత్రానికి దర్శకత్వం మాత్రమే వహించారు. తోట వెంకటేశ్వరరావు కళా దర్శకుడు.

మద్రాసులో "నవరాత్రి" ఔట్ డోర్ షూటింగ్

విజయ చాముండేశ్వరీ - పి. ఏ. పి. వారి "నవరాత్రి" లో మార్చి రెండవ వారం మధ్యలో మద్రాసు శివార్లలో నాగేశ్వరరావు పై షూటింగ్ జరిపారు. మార్చి మధ్యంతో షూటింగ్ పూర్తయి ఏప్రిల్ విడుదలకు సర్వసిద్ధమౌతున్న ఈ నవరస నవరాత్రి చిత్రం యూనిట్ వివరమిది: ఏ. వి. సుబ్బారావు, తాతినేని రామారావు, తాతినేని చలపతిరావు, ముళ్ళపూడి వెంకటరమణ, సెల్వరాజ్, నాగేశ్వరరావు, సావిత్రి, ఇక గెస్టులుగా కనిపించని మేటితారలు లేరు.

చలన చిత్ర వార్తలు

అన్నపూర్ణా యూనిట్ సోవియట్ సందర్శన

భారత - సోవియట్ సాంస్కృతిక వినిమయ ఏర్పాట్ల ప్రకారం అన్నపూర్ణా పిక్చర్స్ వారి బహు బహుమాన విజయ చిత్రం "డాక్టర్ చక్రవర్తి"ని సోవియట్ రష్యాలో ప్రదర్శనకు పంపుతున్నారు. అన్నపూర్ణా యూనిట్ వారు ప్యాస్ పోర్టులు, వీసాలు సమకూర్చుకొనే యత్నంలో నిమగ్నులై వున్నారు. ఏప్రిల్ మధ్యలో భారతదేశం నుంచి ఆంధ్ర బృందం బయలుదేరగలదు. "మే డే" మహోత్సవాలు చూచే భాగ్యం వీరికి కలిగితే యాత్రమరింత ఆనందప్రదంగా వుంటుంది. నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు, నవయుగ శ్రీనివాసరావు, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. ముఖ్యపాత్రధారులు నాగేశ్వరరావు, సావిత్రి ఆంధ్రబృందంలో వుండగలరు.

• • •

శ్రీ రామా పిక్చర్స్ తరఫున బొళ్ళ సుబ్బారావు త్వరలో "సుందరకాండ" తెలుగు చిత్ర నిర్మాణం ప్రారంభించబోతున్నారు.

ఒక్క సావిత్రి ఇద్దరు సరస్వతులూ

భారత్ ఫిలిమ్సు వారి "భక్తపోతన"లో సరస్వతీ ప్రత్యక్ష దృశ్యము సావిత్రిపై వీనస్ స్టుడియోన్ లో మార్చి నెలలో చిత్రీకరించారు. వి. ఎల్. ఎన్. వారి "సరస్వతీ శపథం" అనే తమిళ చిత్రంలో కూడా సావిత్రి సరస్వతిగా నటిస్తున్నారు. అదే వేషభూషణములతో సావిత్రి తనంత తానుగా వాంఛించి "పోతన" సరస్వతిగా నటించారు.


శారదా స్టుడియోలో హేమాంగిని పద్మినిపై ఒక నృత్యం మార్చిలోనే చిత్రీకరించారు. ముత్యాలశాల సెట్టుపై షూటింగ్ పూర్తి అయింది. ఏప్రిల్ ఆరంభంలో విడుదలయ్యే ఈ చిత్రంలో పోతనగా గుమ్మడి, శ్రీనాథుడుగా గంగారావు నటిస్తున్నారు. సావిత్రి గెస్ట్ తార. ఇంకా హరనాథ్, బాలయ్య, రావు గోపాలరావు, ప్రభాకరరెడ్డి, చలం, రాజబాబు, బాల్రదేవ గవర్రాజు, పద్మిని, అంజలి, సుగుశ్రీ, వాసంతి, జెబి [illegible] మొదలైనవారు నటిస్తున్నారు. రచన: సముద్రాల రాఘవాచార్య, సంగీతం: ఎస్. రాజేశ్వరరావు, దర్శకుడు: జి. రామినీడు, నిర్మాత: టి. విశ్వేశ్వరరావు. ముమ్మిడివరం బాలయోగిని తయారు చేసిన మునుపటి కె. వి. రెడ్డి పోతనకూ ఈ పోతనకూ ట్రీట్ మెంట్ లో వ్యత్యాసం వున్నది. అంచేత కొత్తరుచులు వుంటవి. శ్రీనాథుని పాత్రకు మరింత ప్రాధాన్యంకల ఈ చిత్రం ఏప్రిల్ ప్రారంభంలోనే విడుదల కాగలదు.



"భక్తపోతన" చిత్రంలో సర్వజ్ఞసింగ భూపాలుడుగా బాలయ్య



రాజ్యం ప్రొడక్షన్స్ "శకుంతల"లో రామారావు, బి. సరోజాదేవి



భారత్ ఫిలింస్‌వారి "భక్త పోతన" చిత్రంలో గుమ్మడి, రంగారావు

హైదరాబాద్ ఏప్రిల్ చిత్రం

ఫిబ్రవరి, మార్చి నెలలలో సంగీత రంగం దాటిన విజయ సారథి ప్రొడక్షన్స్‌వారి "వీరపూజ" జానపద చిత్రం చిత్రీకరణ రంగం ఏప్రిల్ 15 వ తేదీనుంచి హైదరాబాద్‌లోని సదరన్ మూవీటోన్ స్టుడియోస్‌లో ప్రారంభం కాబోతున్నది. ఏకటాకీగా జూన్‌వరకు షూటింగ్ జరిపి చిత్రం సిద్ధం చెయ్యడానికి ఏర్పాట్లు జరిగినవి. కాంతారావు, కాంచన, బాలయ్య, లింగమూర్తి, నాగయ్య, రేలంగి బాలకృష్ణ, జి. వరలక్ష్మి, వాసంతి తారాగణంలో కలరు. సాంకేతికవర్గ వివరమిది : నిర్మాత: పోలవరపు కేశవులు చౌదరి, సంభాషణలు: వీటూరి, పాటలు : వీటూరి, కొసరాజు, సంగీతం: ఘంటసాల, ఛాయాగ్రహణం: పి. ఎల్. రాయ్, కళ : కె. ఎస్. ఎన్. మూర్తి, నృత్యదర్శకుడు: వెంపటి జగన్నాథశర్మ.

● ● ●

విజయావారి జానపదానికి శ్రీ పింగళి నాగేంద్రరావు స్క్రిప్టు పని పూర్తి చేశారు. వీరు ప్రస్తుతం జయంతీవారి జానపద చిత్రానికి పేపర్ వర్క్ సాగిస్తున్నారు. జూన్ ప్రాంతాల సెట్సుకు వెళ్ళగల ఈ చిత్రాలకు కె. వి. రెడ్డి దర్శకుడు, నాయకుడు రామారావు.

రామారావు, కాంచన కాంబినేషన్

రామారావు, కాంచన కాంబినేషన్‌తో రవీంద్ర ఆర్ట్సు ప్రొడక్షన్స్ వారు వాహినీలో తీస్తున్న సాంఘిక చిత్రంలో మార్చి మధ్యానికి మరొక షెడ్యూలు పూర్తి అయినది. కృష్ణమూర్తి తెచ్చిన ఒక ఆశ్చర్యకర వార్త కాంచన రామారావులపై తెచ్చిన ప్రభావమును ఒక రోజు చిత్రీకరించారు. దర్శకుడు: వి. మధుసూదనరావు, నిర్మాత: డి. వి. రెడ్డి.

ఆంధ్ర జానపద గేయాలు

ఆంధ్ర దేశంలో పల్లెపట్టులలో ఇంటింటా వినవచ్చే 13 పాటలపై 10 నిమిషాల డాక్యుమెంటరీ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి శ్రీ ఆర్. వి. రమణమూర్తి నిర్మించి మద్రాసులో ప్రదర్శించారు. నండూరి విఠల్ వ్యాఖ్యానం చెప్పిన ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు బొంబాయి ముకదం. వ్యాఖ్యను రచించినది యండమూరి సత్యనారాయణ.

పేర్ల మార్పు

అరుణాచలవారి 'స్త్రీ' చిత్రం పేరును 'మంగళసూత్రం'గా మార్చారు. మార్చిలో అరుణాచల స్టుడియోస్‌లో వార్డు సెట్టుపై షూటింగ్ జరిగింది. రామారావు, దేవిక, ముఖ్య పాత్రధారులు. తార 'విజయనిర్మల' పేరును నీరజగాను, చంద్రశేఖర్ పేరును (కొత్తనటుడు) చంద్రమోహన్‌గాను బి. ఎన్. రెడ్డిగారు మార్చినారు.

పాదుకా పట్టాభిషేకం

లోగడ 'లవకుశ' వలె ఈసారి 'పాదుకా పట్టాభిషేకం' శ్రీరామ నవమిఉత్సవాలరోజులలో విడుదలవుతున్నది. ఈ చిత్రంలో కాంతారావు, హరనాథ్, శశికాంత్, కృష్ణకుమారి, జయంతి, మిక్కిలినేని, రమణారెడ్డి, సూర్యకాంతం, వాణిశ్రీ మొదలైనవారు నటించారు. దశరథుడు ధూళిపాళ.

నాగేశ్వరరావు కలర్ చిత్రం ప్రోగ్రెస్

విక్రమ్ స్టుడియోస్‌లో కన్నులు మిరుమిట్లు గొలిపే కోట ముఖద్వారం కన్పించింది. అసాధారణమైన బ్యాక్ గ్రౌండ్ పెయింటింగ్ కళాభిమానులను ఇట్టే ఆకట్టుకొన్నది. కళా దర్శకుడు సుధేందు రాయ్ నిర్మించిన సెట్టు అది; 'వసంతసేన' ఈస్ట్‌మన్ కలర్ చిత్రానిది. చారుదత్తుని ఉంగరమును మాయోపాయముచే హస్తగతము చేసుకొన యత్నించుట నాగేశ్వరరావు, పద్మినిలపై చిత్రీకరించారు. ద్వారం దాటివచ్చిన పద్మిని కప్పం కట్టకపోతే చిత్రవధ చేస్తారని, సహాయపడవలసిందని దీనంగా అడుగుతుంది. ఇదే చిత్రాన్ని బి. ఎన్. రంగా హిందీలో సునీల్‌దత్‌తో తీస్తున్నారు.

"పొట్టి ప్లీడరు"

మురళీ అండ్ రేఖావారి 'పొట్టి ప్లీడర్' నిర్మాణం పూర్తి కావచ్చింది. మార్చి ఆరంభంలో ప్రసాద్ స్టుడియోస్‌లో గీతాంజలిపై ఒకపాటను చిత్రీకరించారు. ఏప్రిల్‌లో సర్వసిద్ధం కాగల ఈ చిత్రంలో శోభన్‌బాబు, పద్మనాభం ముఖ్య భూమికలు ధరిస్తున్నారు. దర్శకుడు: హేమాంబరధరరావు, నిర్మాత: పురుషోత్తం. హాస్యనటులు చాలామంది ఈ చిత్రంలో నటిస్తున్నారు.

అగ్గిబరాటా

విఠల్ ప్రొడక్షన్స్ వారి 'అగ్గిబరాటా' ఈ సంచిక వెలువడే తేదీకి సిద్ధమౌతుంది. గిండీవద్దకల ప్రకృతి సౌందర్యంలో ఈ మధ్య కొంత చిత్రీకరణ జరిగింది. రామారావు, రాజశ్రీ ముఖ్యపాత్రధారులు. దర్శకుడు, నిర్మాత విఠలాచార్య.

"చిలకా గోరింకా" షూటింగ్ పూర్తి

ఆత్మా ఆర్ట్స్ వారి 'చిలకా గోరింకా' చివరి షూటింగ్ షెడ్యూలు హైదరాబాద్‌లో మార్చి మధ్యంలో అయిపోయింది, ఇక ఫైనల్ ఎడిటింగ్, రీ రికార్డింగ్ జరుగవలసివున్నది.

కృష్ణంరాజు అనే కొత్తనటుని పరిచయం చేస్తున్న ఈ చిత్రంలో రంగారావు, అంజలి, కృష్ణకుమారి, పద్మనాభం. పినిశెట్టి గాంలు ఎం. తిలకం, రమాప్రభలనే కొత్త కళాకారిణులు నటించారు. దర్శకుడు, నిర్మాత ప్రత్యగాత్మ, రచన: ఆత్రేయ, సంగీతం: రాజేశ్వరరావు, ఛాయ: రాజు, ఎడిటింగ్ సంజీవి, కళ: సుబ్బారావు.

కొత్తవంతెనవద్ద గూఢచారి

రాజలక్ష్మి ప్రొడక్షన్స్ వారి 'గూఢచారి' చిత్రం షూటింగ్ మార్చిలో వాహినీలో ప్రారంభమై మూడుసెట్లపై పని పూర్తి అయింది. కోడంబాకంవద్ద కొత్తగా కట్టిన వంతెనవద్ద కృష్ణతో ఫేటింగ్ దృశ్యాలు చిత్రీకరించారు. మార్చి మధ్యలో మద్రాసు శివారుకోవళం వద్ద కృష్ణ, జయలలితలపై సిల్హౌటీ షాట్స్ కొన్ని చిత్రీకరించారు. నహతా, డూండీ, ఎమ్. మల్లిఖార్జునరావు, రవికాంత్, అరుద్ర యూనిట్ ముఖ్యులు.



విఠల్ ప్రొడక్షన్స్‌వారి "అగ్గిబరాటా"లో రామారావు, రాజశ్రీ

"రంగుల రాట్నం"

వాహినీవారి 'రంగుల రాట్నం' మార్చి మూడవ వారం నుంచి వాహినీ స్టుడియోలో చిత్రీకరణ దశలో పడింది. చంద్రమోహన్ అనే కొత్త యువనటుని బి. ఎన్. రెడ్డి పరిచయం చెయ్యబోతున్నారు. కుమారసంభవం నృత్య నాటిక, దశావతారాల నృత్యం వారి రెండు విశేషాకర్షణలు.

'పన్నగ శయన పంకజ నయన, నల్లని వాడా నారాయణ' అనే పాటను, 'కనరాని దేముడే కని పించినాడే' అనే పాటను ఈవరకే రికార్డు చేశారు. దాశరథి రచించారు. మొదటి సెట్‌లో శివరాం, రమణారెడ్డి, నాగరాజ్, కాకరాల, పుష్పవల్లి, చంద్రమోహన్, నీరజ, విజయశ్రీలకు, నాయికా నాయకులైన సుకన్య, రామమోహన్‌లకు పనివున్నది. సాంకేతిక బృందంలో నరసరాజు, రాజేశ్వరరావు, గోపాలం, రాజగోపాల్, ఏ. కె. శేఖర్, దేవులపల్లి, సి. నారాయణరెడ్డి, దాశరథి, కొసరాజు మొదలైనవారు కలరు.

"శ్రీకృష్ణతులాభారం"

కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్ వారి 'శ్రీ కృష్ణ తులాభారం' షూటింగ్ వాహినిలో ప్రారంభమైంది. కృష్ణుడుగా వున్న రామారావుపై మొదటి 'షాట్' తీశారు. మొదటి రెండురోజుల షూటింగ్‌లో పద్మనాభం (వసంతకుడు) కూడా పాల్గొన్నారు. నిర్మాత డి. రామానాయుడు. ఆయన కుమారుడు సురేష్‌బాబు కెమెరాకు స్విచ్ ఆన్ చేశారు. శ్రీ బి. నాగిరెడ్డి క్లాప్ కొట్టారు. కృష్ణుని పూజాదోషంలో షూటింగ్ ప్రారంభమైంది. యూనిట్ వివరమిది: (పైన పేర్కొన్నవారు కాక) కాంతారావు, రాజనాల, మిక్కిలినేని, అంజలి, జమున, ఎస్. వరలక్ష్మి, విజయలక్ష్మి, జయంతి, అనూరాధ, పెండ్యాల, శ్రీశ్రీ, దాశరథి, సముద్రాలరాఘవాచార్య, కొసరాజు, కె.ఎస్.రెడ్డి, అన్నయ్య, రాజేంద్రకుమార్, మార్తాండ్.

"నానల్"

పి. ఎస్.ఆర్. పిక్చర్స్ 'నానల్' అనే తమిళ చిత్రం ఆధారంగా చిత్రం తీయబోతున్నారు. 'డెస్పరేట్ అవర్స్' అనే హాలీవుడ్ ఛాయలు తమిళ చిత్రంలో కలవు. తెలుగు చిత్రంలో ఒక ముఖ్య భూమికకు గుమ్మడిని 'బుక్' చేసుకొన్నారు. అదీ చిత్రంగా జరిగినది. రెండు భూమికలలో ఏది గుమ్మడికి యివ్వవలెనో నిర్మాతలు నిర్ణయించుకోలేక పోయారు. 'రెండింటిలో ఏదిమీరుతీసుకొన్నా సరే' అని నిర్మాతలు గుమ్మడికి చెప్పారు. గుమ్మడి ఒక భూమికను ఎంచుకొన్నారు. తెలుగు చిత్రాన్ని ఎస్. డి. లాల్ డైరెక్ట్ చేస్తారు. ఛాయగ్రహణ దర్శకుడు ఎస్. ఎస్. లాల్. ప్రస్తుతం పేపర్‌వర్క్ జరుగుతున్నది.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
Congress Office Road, Governorpet, Vijayawada-2

JYOTI '66 APRIL
Regd No. H-368

